# ఈనాడు

కరీంనగర్ 31-8-2019 శనివారం సిటీ సంపుటి 46 సంచిక 22

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50. పేజీలు 16+16 www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi






**For a test drive, SMS 'TRIBER' to 53030 or call on 1800 300 44444 (Open from Monday to Sunday, 7:00 am -11:00 pm).**

Terms and conditions apply. Model/Accessories shown may not be a part of the standard fitment. #Price mentioned is for TRIBER Petrol RXE for Ex-showroom All India and is exclusive of taxes. The colour in the image may vary slightly from the actual colour of the product. Renault India Pvt. Ltd. reserves the right to change or modify the mentioned conditions or specifications without prior notice. Contact your nearest dealer or visit www.renault.co.in for more details.

**SHOWROOMS: TELANGANA: KARIMNAGAR**: RENAULT Karimnagar Mob: +91 9582305983. **MAHBUBNAGAR**: RENAULT Mahbubnagar Mob: +91 7799766431. **NIRMAL**: RENAULT Nirmal Mob: +91 8527232744. **KHAMMAM**: RENAULT Khammam Mob: +91 8527234093. **SIDDIPET**: RENAULT Siddipet Mob: +91 8527235114. **MANCHERIAL**: RENAULT Mancherial Mob: +91 9582571953. **WARANGAL**: RENAULT Warangal Mob: +91 9582230038.

L&K | SAATCHI & SAATCHI


TG


Premier®
Cookware & Appliances
శ్రావణ మాస మెగా
ఎక్స్ఛేంజ్ ఆఫర్
50% వరకు
తగ్గింపు
ప్రీమియర్
స్టెయిన్‌లెస్ స్టీల్
& ట్రెండీ బ్లాక్ ప్రెషర్
కుక్కర్ ఎక్స్ఛేంజ్‌కు
50%
తగ్గింపు
ప్రీమియర్ నాన్-స్టిక్
కుక్‌వేర్ ఎక్స్ఛేంజ్‌కు
50%
తగ్గింపు
ప్రీమియర్
కిచెన్- హుడ్
(చిమ్నీకి)
ఎక్స్చేంజ్‌కు
40%
తగ్గింపు
ప్రీమియర్ ఎలక్ట్రిక్
రైస్ కుక్కర్ (1 లీటర్ కుక్కర్ మినహా)
ఎక్స్ఛేంజ్‌కు
50%
తగ్గింపు
ప్రీమియర్
వెట్ గ్రైండర్
ఎక్స్ఛేంజ్‌కు
రూ.2400
వరకు తగ్గింపు
ప్రీమియర్ మిక్సర్
గ్రైండర్
ఎక్స్ఛేంజ్‌కు
రూ.2200
వరకు తగ్గింపు
ప్రీమియర్
గ్లాస్-టాప్
ఎల్‌పీజీ స్టౌ
ఎక్స్ఛేంజ్‌కు
రూ.2000
వరకు తగ్గింపు
అన్ని ప్రముఖ షాపులలో లభిస్తాయి.
**ఎక్స్ఛేంజ్‌కి పాత అల్యూమినియం కుక్కర్ మాత్రమే తీసుకోబడుతుంది.
*ఇది పరిమిత కాల ఆఫర్ మాత్రమే / *స్టాక్ ఉన్నంత వరకు మాత్రమే.
FOR MORE DETAILS PLEASE CONTACT: ANDHRA PRADESH: PRAKASAM / NELLORE: 9384699601, ANANTAPUR / KURNOOL: 9384825551, EAST & WEST GODAVARI: 9701088466, KRISHNA / GUNTUR: 9384699600, 7358533111, VISAKHAPATNAM / SRIKAKULAM / VIZIANAGARAM: 9490446486, KADAPA / CHITTOOR: 9384699605. TELANGANA: HYDERABAD / SECUNDERABAD: 9384699610, REST OF TWIN CITIES: 9384699610, BULK PURCHASE / CORPORATE GIFT ENQUIRIES SOLICITED PLEASE CONTACT: 73585 33111 / 9384699600




# ఈనాడు




కరీంనగర్ 31-8-2019 శనివారం సిటీ సంపుటి 46 సంచిక 22

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50. పేజీలు 16+16 www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

# మెగా విలీనం

- 10 ప్రభుత్వ రంగ బ్యాంకులు 4 బ్యాంకులుగా కలయిక
- ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటన

[ 2017లో ప్రభుత్వ రంగ బ్యాంకుల సంఖ్య 27. తాజా విలీనం తర్వాత వీటి సంఖ్య 12 అవుతుంది. ]

ఆర్థిక మందగమనం దేశాన్ని భయపెడుతోంది. నిరుద్యోగం పెరిగింది. ఉన్న ఉద్యోగాలు పోతున్నాయి. వాహన విక్రయాలు తగ్గాయి. ఈ పర్యవసానాలకు సూచిక అన్నట్లు.. తాజాగా వృద్ధిరేటు ఆరేళ్ల కనిష్ఠానికి.. 5 శాతానికి చేరింది. మాంద్యం తాలూకా ముందస్తు లక్షణాలు కళ్ల ముందు కదలాడుతున్నాయి. రాబోయే ముప్పును ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ఇప్పటికే ఉద్దీపనలు ప్రకటిస్తోంది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల నిబంధనల్నీ సడలించింది. తాజాగా బ్యాంకింగ్ రంగంలో సంస్కరణలకు తెరతీసింది. ఈ చర్యలన్నీ మాంద్యం పరిస్థితుల్ని ఎదుర్కొనడానికే! ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శుక్రవారం బ్యాంకింగ్ రంగంలో మెగా విలీనాలకు తెరలేపారు. 10 ప్రభుత్వ రంగ బ్యాంకులను నాలుగింటిగా విలీనం చేయనున్నట్లు ప్రకటించారు. 5 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా భారత్‌ను తీర్చిదిద్దడంలో భాగంగా.. ఈ విలీనం చోటు చేసుకుంటోంది. గతేడాది దేనా బ్యాంక్, విజయా బ్యాంక్‌లను బ్యాంక్ ఆఫ్ బరోడాలో విలీనం చేయడంతో అది మూడో అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకుగా అవతరించిన సంగతి తెలిసిందే. ఎస్‌బీఐలో 5 అనుబంధ బ్యాంకులు, భారతీయ మహిళా బ్యాంకుల్ని గతంలోనే విలీనం చేశారు.

### ఏ బ్యాంకు ఎందులో...

| | విలీనం 1 | విలీనం 2 | విలీనం 3 | విలీనం 4 |
|---|---|---|---|---|
| | పీఎన్‌బీ + ఓబీసీ + యూబీఐ | కెనరా బ్యాంక్ + సిండికేట్ బ్యాంక్ | యూనియన్ బ్యాంక్ + ఆంధ్రా బ్యాంక్ + కార్పొరేషన్ బ్యాంక్ | ఇండియన్ బ్యాంక్ + అలహాబాద్ బ్యాంక్ |
| విలీనంతో.. | పీఎన్‌బీ దేశంలోనే 2వ అతిపెద్ద ప్రభుత్వ బ్యాంక్‌గా అవతరిస్తుంది | కెనరా బ్యాంక్ 4వ అతి పెద్ద ప్రభుత్వ బ్యాంక్ అవుతుంది | యూనియన్ బ్యాంక్ 5వ అతిపెద్ద ప్రభుత్వ బ్యాంక్ అవుతుంది | ఇండియన్ బ్యాంక్ 7వ అతిపెద్ద ప్రభుత్వ బ్యాంక్‌గా నిలుస్తుంది |
| శాఖలు | 11,437కు చేరతాయి | 10,324కు చేరతాయి | 9,609కు చేరతాయి | 6,403కు చేరతాయి |
| వ్యాపారం | 17.95 లక్షల కోట్లు | 15.20 లక్షల కోట్లు | 14.59 లక్షల కోట్లు | 8.08 లక్షల కోట్లు |

### విలీనంతో ఎంత లాభం?

- బ్యాంకుల సంఖ్య తగ్గుతుంది. పనితీరు మెరుగుపడుతుంది.
- పెద్ద వ్యాపార సంస్థలకు అప్పులిచ్చే శక్తి బ్యాంకులకు పెరుగుతుంది.
- బహిరంగ మార్కెట్ ద్వారా నిధుల సేకరణ సులువవుతుంది.
- నిర్వహణ వ్యయాలు తగ్గుతాయి.
- మొండి బాకీల సమస్యను అధిగమించే శక్తి పెరుగుతుంది.

### జనం ఏం చేయాల్సి ఉంటుంది?

- మీ ఖాతా ఉన్న బ్యాంకు వేరే బ్యాంకులో కలిసిపోతే పాస్‌బుక్, చెక్‌బుక్ లాంటి వాటిని మార్చుకోవాలి.
- వేర్వేరు లావాదేవీలకు సమర్పించిన ఖాతా వివరాల్ని మార్చాల్సి ఉంటుంది.
- క్రెడిట్, డెబిట్ కార్డులు కొత్తవి తీసుకోవాలి.
- ఫిక్స్‌డ్ డిపాజిట్లను సరిచూసుకోవాలి.
- వడ్డీరేట్లలో మార్పు రావొచ్చు.

వృద్ధిరేటు 5 శాతమే



### ఇక మిగిలే బ్యాంకులు ఇవీ...

1. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
2. పంజాబ్ నేషనల్ బ్యాంక్
3. బ్యాంక్ ఆఫ్ బరోడా
4. కెనరా బ్యాంక్
5. యూనియన్ బ్యాంక్
6. బ్యాంక్ ఆఫ్ ఇండియా
7. ఇండియన్ బ్యాంక్
8. సెంట్రల్ బ్యాంక్
9. ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్
10. యూకో బ్యాంక్
11. బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర
12. పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్

మరిన్ని కథనాలు బిజినెస్ పేజీల్లో

# నల్లమల జల్లెడ

## యురేనియం అన్వేషణకు సన్నద్ధం

### కేంద్ర అణు శక్తి సంస్థ తాజా ప్రతిపాదనలు

- 21,000 ఎకరాల విస్తీర్ణంలో నమూనాల సేకరణ
- 4,000 వరకు భారీ బోర్లు వేయడానికి నిర్ణయం
- వ్యతిరేకత వస్తున్నా ముందుకే..

ఈనాడు - హైదరాబాద్

నల్లమల అడవుల్లో యురేనియం తవ్వకాలకు సన్నాహాలు మొదలవుతున్నాయి. ఇక్కడ ఖనిజాన్వేషణకు అటామిక్ మినరల్స్ డైరెక్టరేట్ (ఏఎండీ) సిద్ధమవుతోంది. అమ్రాబాద్ పులుల అభయారణ్యం ప్రాంతంలో సర్వే, ఖనిజాన్వేషణకు సంబంధించి తెలంగాణ అటవీశాఖకు ప్రతిపాదనలు పంపింది. యురేనియం నిల్వల పరిమాణం, నాణ్యత తెలుసుకునేందుకు దాదాపు 21,000 ఎకరాల అటవీ ప్రాంతంలో సర్వేకు అనుమతివ్వాలని కోరింది. రెండు అటవీ ప్రాంతాల్లో 4,000 వరకు బోర్లు వేస్తామని పేర్కొంది. ...మిగతా 2లో

### 83 చ.కిమీ. విస్తీర్ణంలో..

- యురేనియం కోసం సర్వే చేసే ప్రాంతాలు, విస్తీర్ణాన్ని ఏఎండీ తన ప్రతిపాదనల్లో పేర్కొంది.
- నల్లమల అడవుల్లోని అమ్రాబాద్ పులుల అభయారణ్యం పరిధిలో మొత్తం 83 చ.కి.మీ. మేర సర్వే, అన్వేషణకు అనుమతివ్వాలని అటవీశాఖను కోరింది.
- నల్గొండ జిల్లా నాగార్జునసాగర్ అటవీ డివిజన్ పరిధిలో 7 చ.కి.మీ. ప్రాంతం (2 అటవీ బ్లాకులు), నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ అటవీ ప్రాంతంలో 76 చ.కి.మీ. ప్రాంతం (2 అటవీ బ్లాకులు)లో బోర్ల ద్వారా అన్వేషించనుంది.
- అమ్రాబాద్ టైగర్ రిజర్వు పరిధిలోని ఓ బ్లాక్‌లో 3,000 బోర్లు, మరో బ్లాక్‌లో 1,000 బోర్లు తవ్వనుంది.
- ఒక్కో బోరు తవ్వకానికి 4 - 5 రోజుల సమయం పట్టనున్నట్లు సమాచారం.



# పల్లె వాకిట.. ప్రగతి మంత్రం

- గ్రామాల సమగ్రాభివృద్ధికి ముహూర్తం ఖరారు
- వచ్చే నెల 6 నుంచి ప్రత్యేక కార్యాచరణ ప్రారంభం
- సమీక్ష సమావేశంలో సీఎం కేసీఆర్
- 36 వేల మంది సఫాయి కార్మికుల వేతనాల పెంపు
- నెలకు రూ.8,500 చెల్లింపునకు నిర్ణయం

ఈనాడు, హైదరాబాద్: పల్లెల్లో పచ్చదనం, పరిశుభ్రత, సమగ్రాభివృద్ధి లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణ అమలుకు రంగం సిద్ధమైంది. సెప్టెంబరు 6న ప్రారంభమై అన్ని గ్రామాల్లో 30 రోజుల పాటు అమలవుతుంది. 'ఈ బృహత్తర కార్యక్రమాన్ని మొదట 60 రోజులు నిర్వహించాలనుకున్నాం. అధికారుల నుంచి వచ్చిన సూచన మేరకు తొలి దశలో 30 రోజులు నిర్వహించి, రెండో దశలో మరో 30 రోజులు కొనసాగిస్తాం. ఈ బృహత్కార్యంపై రాష్ట్రంలోని పంచాయతీరాజ్ శాఖ అధికారులతో వచ్చే నెల 3న హైదరాబాద్‌లో విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తాం. 4న అన్ని జిల్లాల్లో కలెక్టర్ల ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సమావేశం జరుగుతుంది. మొత్తం కార్యక్రమం వారి పర్యవేక్షణలో సాగుతుంది. పల్లెకొకరు చొప్పున మండల స్థాయి అధికారులను ఇన్‌ఛార్జులుగా నియమిస్తాం. ...మిగతా 2లో



# వైకల్యాన్ని స్మాష్ చేసి...




మానసి జోషి

ప్రమాదంలో కాలు పోయింది. జీవితం తల్లకిందులైంది. భవిష్యత్తు శూన్యంగా కనిపించింది. కానీ ఆమె ఆగిపోలేదు. కృత్రిమ కాలు అమర్చుకుంది. బ్యాడ్మింటన్ రాకెట్ పట్టింది. కోర్టులోకి దూకింది. మానసి జోషి తన వైకల్యాన్ని 'స్మాష్' చేస్తూ అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటింది. ప్రపంచ ఛాంపియన్ అయింది. ఈ విజేత స్ఫూర్తిగాథ...

విజేత పేజీలో

# బండి తోలేటప్పుడు జర భద్రం

- అమలులోకి రానున్న మోటారు వాహనాల సవరణ చట్టం
- ఇకపై ఉల్లంఘనలకు భారీ జరిమానాలు
- రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడమే తరువాయి



✦ శిరస్త్రాణం ఉన్నా చాలామంది ధరించరు. ఏ ట్రాఫిక్ పోలీసులకో చిక్కితే జరిమానా వంద రూపాయలే కదాని తేలిగ్గా తీసుకుంటారు. ఇకపై అలా కాదు రూ.1000 కట్టడంతో పాటు 3 నెలలు డ్రైవింగ్ లైసెన్సు రద్దవుతుంది.

✦ కారు నడుపుతున్నారు సరే! సీటు బెల్ట్ ధరించనివారే ఎక్కువ. దీనికి పడే జరిమానా అక్షరాలా రూ.1000.

రహదారి భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం.. ప్రమాదాలు, మరణాల నియంత్రణే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన మోటారు వాహనాల సవరణ చట్టం-2019లో ఇలాంటివెన్నో ఉన్నాయి. సెప్టెంబరు 1 నుంచే ఇది అమలులోకి రానుంది. దీనిపై ఇప్పటికే కేంద్రం నోటిఫికేషన్ విడుదల చేసింది. వివిధ ఉల్లంఘనలకు ఈ చట్టంలో పేర్కొన్న జరిమానాలు చూస్తే వాహనదారులకు చెమటలు తప్పవు. మితిమీరిన వేగంతో నడిపినా, బీమా లేకున్నా, అధికలోడు తీసుకెళ్తున్నా.. ఇలా ఒక్కోదానికి పడే వడ్డన భారీగానే. మన వద్ద క్షేత్ర స్థాయిలో అమలుకు కొంత సమయం పట్టనుంది. రాష్ట్ర ప్రభుత్వాలు ఈ అంశాలపై ఉత్తర్వులు జారీ చేసిన అనంతరం రవాణాశాఖ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు జరిమానాలు విధించే అవకాశం ఉందని రవాణా రంగ నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో కొత్త చట్టం ఏం చెబుతోంది? ఏ అతిక్రమణకు ఎలాంటి చర్యలు ఉండబోతున్నాయో అవగాహన కల్పించే కథనం...

'కట్టు తప్పితే.. తప్పదు భారీ మూల్యం' నేటి జిల్లా సంచిక మధ్యపత్రాల్లో..

## ఊరు ఏరైంది.. యాది కన్నీరైంది

ఏంచేస్తున్నావ్ అక్కా.. వంటైందా అంటూ ఒకప్పుడు రోజూ పలకరించుకునే ఒకే ఊరి ఇరుగుపొరుగు ఇళ్లవారు వారంతా. ఊరు ఉనికిని కోల్పోవడంతో విడిపోయి మళ్లీ శుక్రవారం ఒకేచోట కలవడంతో భావోద్వేగం ఉప్పొంగింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని తంగళ్లపల్లి మండలం చీర్లవంచలో సుమారు 2600 కుటుంబాలు ఉండేవి. మధ్యమానేరు ప్రాజెక్టులో గ్రామం ముంపునకు గురికావడంతో పునరావాసంలో భాగంగా రెండు వేర్వేరు చోట్లకు వీరంతా వలస వెళ్లాల్సి వచ్చింది. సరిగ్గా రెండేళ్ల తర్వాత ముంపు నిర్వాసితుల ఐక్యవేదిక, అఖిలపక్షం ఆధ్వర్యంలో కొదురుపాకలో నిర్వహించిన బహిరంగ సభ మళ్లీ వీరిని కలిపింది. సభ ముగిశాక వెళ్లిపోతున్న తరుణంలో ఒకరినొకరు పట్టుకొని ఇలా కన్నీటి పర్యంతమయ్యారు. -న్యూస్‌టుడే, బోయినపల్లి



# తీరంలో ఘోరమే!

- ముంచుకొస్తున్న ముప్పు
- భూతాపంతో పెరగనున్న సముద్ర మట్టాలు



- ముంబయి సహా అనేక నగరాలకు ముంపు ప్రమాదం
- 25 కోట్ల మంది నిరాశ్రయులవుతారు
- మంచు కరుగుదలతో తాగునీటికి కొరత
- ఐరాస ముసాయిదా నివేదిక హెచ్చరిక

..పూర్తి వివరాలు 2లో



**వెయ్యి రెట్లు ఎక్కువ వరద భయం**

✦ 2050 నాటికి లోతట్టు ప్రాంతాల్లో ఉండే భారీ మహానగరాలు, చిన్న ద్వీప దేశాలు సముద్ర మట్టాల్లో వచ్చే అసాధారణ వైరుధ్యాల వల్ల నష్టపోతాయి.

✦ 2100 నాటికి వార్షిక వరద నష్టాలు 100 నుంచి వెయ్యి రెట్లు పెరుగుతాయి.

✦ 25 కోట్ల మంది సముద్ర మట్టాల పెరుగుదలతో నిర్వాసితులు కానున్నారు.

# 8.65% ఈపీఎఫ్‌పై వడ్డీ

- త్వరలో అధికారిక ప్రకటన వెలువరించనున్న కార్మిక శాఖ

దిల్లీ: ఉద్యోగుల భవిష్య నిధి (ఈపీఎఫ్)పై 2018-19 సంవత్సరానికి 8.65 శాతం వడ్డీ చెల్లించాలని కేంద్ర కార్మిక శాఖ నిర్ణయించింది. దీనిపై త్వరలో అధికారిక ప్రకటన వెలువరించనుంది. ప్రస్తుతం డిపాజిట్లపై 8.55 శాతం వడ్డీ చెల్లిస్తుండగా, దాన్ని 8.65 శాతానికి పెంచాలని గతంలో ప్రతిపాదించింది. ఇందుకు ఆర్థిక శాఖ ఎలాంటి అభ్యంతరం చెప్పకపోవడంతో అధికారిక ప్రకటన విడుదల చేయనున్నామని కార్మిక శాఖ మంత్రి సంతోష్ గంగ్వార్ శుక్రవారం చెప్పారు. అధికారిక ప్రకటన వెలువరించిన తరువాతే చందాదారుల ఖాతాల్లో వడ్డీ సొమ్ము జమవుతుంది. చందాదారులు తమ సొమ్మును విత్ డ్రా చేసుకున్నప్పుడు కూడా ఈ వడ్డీ రేటునే పరిగణనలోకి తీసుకుంటారు.

# 'ముంచు'కొస్తున్న ముప్పు!



- భూతాపంతో పెరగనున్న సముద్ర మట్టాలు
- ముంబయి సహా అనేక నగరాలకు ముంపు ప్రమాదం
- 25 కోట్ల మంది నిరాశ్రయులు అవుతారు
- మంచు కరుగుదలతో తాగు నీటికి కొరత
- ఐరాస ముసాయిదా నివేదిక హెచ్చరిక

పారిస్: మానవ పరిణామక్రమానికి ఊపిరిలూదిన సాగరాలు ఇక పెను విధ్వంసాన్ని సృష్టించబోతున్నాయని ఐరాస ముసాయిదా నివేదిక హెచ్చరించింది. సముద్ర మట్టాలు పెరిగిపోయి, తీర ప్రాంతం వెంబడి ఉన్న అనేక మహానగరాల్లో జలప్రళయం తప్పదని, కోట్ల మంది నిరాశ్రయులవుతారని పేర్కొంది. కరుగుతున్న మంచుతో మరిన్ని విపత్తులు పొంచి ఉన్నాయంది. ప్రధానంగా చైనా, అమెరికా, ఐరోపా, భారత్‌లకు ఈ ముప్పు తీవ్రంగా ఉన్నట్లు స్పష్టంచేసింది. పెరుగుతున్న సాగర మట్టాలతో ముంబయి, చెన్నై, కోచి వంటి భారత నగరాలకు పెను ప్రమాదం పొంచి ఉందని తెలిపింది. సముద్ర పర్యావరణాన్ని అస్థిరపాల్జేస్తున్న కర్బన కాలుష్యానికి కళ్లెం వేయకుంటే అనర్థాలు తప్పవని తేల్చి చెప్పింది. ఐరాసకు చెందిన ఇంటర్ గవర్నమెంటల్ ప్యానెల్ ఆన్ క్లైమేట్ చేంజ్ (ఐపీసీసీ).. సముద్రాలు, భూమిపై హిమ ప్రాంతాలపై ఈ ప్రత్యేక నివేదికను రూపొందించింది.

900 పేజీలున్న ఇలాంటి శాస్త్రీయ విశ్లేషణను సిద్ధం చేయడం ఈ ఏడాది ఇది నాలుగోసారి. ఇంతకుముందున్న నివేదికలు భూతాపాన్ని 1.5 డిగ్రీల సెల్సియస్‌కు తగ్గించడం, జీవ వైవిధ్యం స్థాయి, అడవులు, ప్రపంచ ఆహార వ్యవస్థ వంటి అంశాలను స్పృశించాయి. వీటన్నింటి సారాంశం ఒక్కటే. వాతావరణ మార్పుల ప్రభావం, పర్యావరణ క్షీణత ప్రభావాన్ని తగ్గించుకోవాలంటే మానవాళి తీరు మారాలి. తాజాగా సిద్ధమైన నివేదికకు సంబంధించిన అధికారిక సారాంశాన్ని పరిశీలించడానికి సెప్టెంబరులో ప్రపంచ దేశాల ప్రతినిధులు మొనాకోలో సమావేశమవుతున్నారు. తుది నివేదికలో ఉంచాల్సిన అంశాలను అక్కడ ఖరారు చేస్తారు. ముసాయిదా నివేదికలోని ప్రధానాంశాలివీ..

- విధ్వంసకర మార్పులు ఇప్పటికే ఆరంభమయ్యాయి. ఇందులో కొన్ని కోలుకోలేని నష్టాన్ని కలిగిస్తున్నాయి.
- మత్స్య సంపద క్రమంగా తగ్గిపోతోంది.
- పెను తుపాన్ల వల్ల కలిగే నష్టం వంద రెట్లు కన్నా ఎక్కువగా పెరుగుతుంది.

### హిమం.. మాయం

- 21వ శతాబ్దంలో హిమానీనదాలు కరిగిపోవడం వల్ల.. వాటిపై ఆధారపడి జీవిస్తున్న కోట్ల మందికి తొలుత భారీగా తాగునీరు లభ్యమవుతుంది. ఆ తర్వాత చుక్క నీరు దొరకని పరిస్థితి ఎదురవుతుంది.
- మానవ చర్యల పర్యవసానంగా వెలువడే ఉద్గారాలకు భారీగా కోత పెట్టకుంటే ఉత్తరార్థగోళంలోని మంచులో దాదాపు 30 శాతం మేర ఈ శతాబ్దం చివరినాటికి కరిగిపోతుంది. దీనివల్ల వందల టన్నుల మేర కార్బన్ గాల్లోకి వస్తుంది. భూతాపం మరింత పెరుగుతుంది.

### ఆ నాలుగూ..

- ప్రపంచవ్యాప్తంగా వెలువడుతున్న శిలాజ ఇంధన ఉద్గారాల్లో చైనా, అమెరికా, ఐరోపా సంఘం (ఈయూ), భారత్‌ల వాటా 60 శాతం. ఈ దేశాలకు సాగర, మంచు సంబంధ ప్రభావాలూ ఎక్కువే. అయినా కర్బన ఉద్గారాలను తగ్గించుకునేందుకు మరింత విస్తృత లక్ష్యాలను ఈ దేశాలు ప్రకటించలేదు.
- పారిస్ ఒప్పందం నుంచి అమెరికా వైదొలగాలని ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భావిస్తున్నారు.
- భారత్ వేగంగా సౌర విద్యుదుత్పత్తిని పెంచుకుంటోంది. అయితే కాలుష్యాన్ని కలిగించే బొగ్గు ఆధారిత విద్యుత్ సామర్థ్యాన్ని కూడా పెంచుకుంటూ పోతోంది.
- ఈ శతాబ్దం మధ్య నాటికి ఉద్గారాలను గణనీయంగా తగ్గించుకోవాలని ఈయూ లక్ష్యంగా పెట్టుకుంది. అయితే కూటమిలోని అనేక సభ్య దేశాలు ఈ విషయంలో జాప్యం చేస్తున్నాయి.
- చైనా ఒక్కటే అమెరికా, ఈయూ, భారత్‌లు సంయుక్తంగా వెలువరిస్తున్న కార్బన్ డైఆక్సైడ్ ఉద్గారాలకు సమాన స్థాయిలో ఈ వాయువులను విడుదల చేస్తోంది. చైనా దృష్టి ప్రస్తుతం మందగిస్తున్న ఆర్థిక మాంద్యం, అమెరికాతో వాణిజ్య యుద్ధంపైనే ఉంది. దీంతో దేశంలో థర్మల్ విద్యుత్ కర్మాగారాలు పెరిగిపోతున్నాయి. వాయు కాలుష్య నిబంధనలు సడలిపోతున్నాయి.

### పెరుగుతున్న సాగర మట్టాలతో ముప్పు పొంచి ఉన్న దేశాలు

**చైనా:** షాంఘై సహా అనేక తీర ప్రాంత నగరాలు ముంపు బారిన పడొచ్చు.

**భారత్:** ముంబయి, చెన్నై, కోచి వంటి అనేక నగరాలకూ ఈ ముప్పు ఉంది.

**అమెరికా:** న్యూయార్క్, మయామీ వంటి నగరాలను రక్షించుకోవడానికి వందల కోట్ల డాలర్లను అమెరికా ఖర్చుపెడుతున్నా పెద్దగా ప్రయోజనం ఉండకపోవచ్చు.

**ఐరోపా:** ఆమ్‌స్టర్‌డామ్, వెనిస్, హాంబర్గ్ వంటి నగరాలపైకి సముద్ర జలాలు కోరలు చాస్తున్నాయి.

### సాగర రక్ష

వాతావరణ మార్పుల బారి నుంచి సాగరాలు రక్షణ కవచాన్ని అందిస్తాయి. ఇవి లేకుంటే భూతాపం వల్ల భూ ఉపరితలంపై ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరిగిపోయి ఉండేవి.

**20 శతాబ్దం చివరినాటితో పోలిస్తే 2100 నాటికి సముద్ర మట్టాలు ఒక మీటరు మేర పెరగొచ్చు.**

**సాగరాలు మింగిన గరళమిది..**

1970 నుంచి గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాల నుంచి వెలువడిన ఉష్ణంలో **90 శాతం**

ప్రపంచ వ్యాప్తంగా వెలువడిన కార్బన్ డైఆక్సైడ్‌లో **25 శాతం**

# పల్లె వాకిట.. ప్రగతి మంత్రం

(మొదటి పేజీ తరువాయి)

ఈ కార్యక్రమాన్ని నిరంతరం ముందుకు తీసుకెళ్తాం' అని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీలలో తక్కువ మొత్తానికి పనిచేస్తున్న 36 వేల మంది సఫాయి కర్మచారుల నెల వేతనాన్ని రూ. 8,500కు పెంచుతున్నట్లు ఆయన ప్రకటించారు. 'గ్రామ పంచాయతీ ఆర్థిక పరిస్థితిని బట్టి రూ. 1,000 నుంచి రూ. 5,000 వరకు వేతనంతో వారు జీవితం వెళ్లదీస్తున్నారు. ఇక్కడ బాధ్యతలు నిర్వహించడంతో పాటు మరో పని వెతుక్కోవాల్సి వస్తోంది. ఈ దీన స్థితిని అర్థం చేసుకొని వారి వేతనాలను రూ. 8,500కు పెంచుతున్నాం. ఇకపై వారు పూర్తి సమయం గ్రామ పంచాయతీ విధులకే కేటాయించాల్సి ఉంటుంది' అని సీఎం వివరించారు. మండల, జిల్లా పరిషత్‌లను క్రియాశీలకంగా మార్చేందుకు అవసరమైన సిఫార్సులను కలెక్టర్ల నుంచి స్వీకరించి, నిబంధనలు రూపొందిస్తామన్నారు. పల్లె ప్రణాళికపై శుక్రవారం ప్రగతి భవన్‌లో ఏడు గంటల పాటు సమీక్ష జరిగింది. మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, ఇంద్రకరణ్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, వేముల ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్యేలు సి.లక్ష్మారెడ్డి, కాలె యాదయ్య, విప్ పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### కరెంటు బిల్లుల చెల్లింపు తప్పనిసరి

పంచాయతీరాజ్ శాఖలో అన్ని ఖాళీలను భర్తీ చేస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ పునరుద్ఘాటించారు. కేంద్ర ఆర్థిక సంఘం నిధులకు రాష్ట్ర ప్రభుత్వ నిధులు జత చేసి నెలకు రూ. 339 కోట్ల చొప్పున పంచాయతీలకు విడుదల చేస్తామన్నారు. 'వీటితో పాటు గ్రామ పంచాయతీ స్వీయ ఆదాయం, నరేగా నిధులు కూడా అందుబాటులో ఉంటాయి. గ్రామ బడ్జెట్‌లో పది శాతం నిధులను పచ్చదనం పెంపొందించేందుకు కేటాయించాలి. అప్పులు, జీతాలు చెల్లించడం లాంటి వాటితో పాటు విద్యుత్ బిల్లుల చెల్లింపును కూడా తప్పనిసరి చెల్లింపుల జాబితాలో చేర్చాలి. వార్షిక ప్రణాళిక, పంచవర్ష ప్రణాళికకు అనుగుణంగానే నిధులు ఖర్చు చేయాలి.

### పంచాయతీలు ట్రాక్టర్లను సమకూర్చుకోవాలి

కూలిపోయిన ఇళ్ళు, భవనాల శిథిలాలను తొలగించాలి. పనికిరాని, ఉపయోగించని బావులు, లోతట్టు ప్రాంతాలను పూడ్చాలి. దోమల ఉత్పత్తిని నిరోధించాలి. పాఠశాలల వంటి అన్ని ప్రభుత్వ సంస్థలను, సంతలను, అన్ని రహదారులను, మురుగు కాల్వలను శుభ్రం చేయాలి. గ్రామ పంచాయతీలు ట్రాక్టర్లను సమకూర్చుకోవాలి. మొక్కలకు నీరు పోయడానికి, చెత్త సేకరణకు ఉపయోగించాలి. అన్ని గ్రామాల్లో డంప్ యార్డ్ ఉండాలి. ప్రభుత్వ భూమి అందుబాటులో లేనట్లయితే పంచాయతీ నిధులతో స్థలం కొనాలి. శ్మశాన వాటికకు స్థలం గుర్తించాలి. వందశాతం మరుగుదొడ్ల నిర్మించడానికి ప్రణాళిక రూపొందించాలి. స్థానికులంతా నెలలో రెండుసార్లు శ్రమదానంలో పాల్గొనేలా ప్రోత్సహించాలి.

### మన ఊరును మనమే బాగు చేసుకోవాలి

ఏ ఊరు ప్రజలు ఆ ఊరుకు కథానాయకులు కావాలి. మన ఊరును మనమే బాగు చేసుకోవాలనే స్పృహ రావాలి. ఈ సంస్కృతి అలవాటు కావాలి. ప్రభుత్వ సంకల్పానికి ప్రజల సహకారం అవసరం. ప్రత్యేక కార్యాచరణ అమలులో మొదటి రోజు గ్రామ సభ నిర్వహిస్తారు. ప్రభుత్వ ఉద్దేశాలను వివరిస్తారు. రెండో రోజు కోఆప్షన్ సభ్యుల ఎంపిక, గ్రామ పంచాయతీ స్టాండింగ్ కమిటీల ఎంపిక నిర్వహించాలి. సర్పంచ్ కుటుంబ సభ్యులను కోఆప్షన్ సభ్యులుగా ఎంపిక చేయడానికి వీలులేదు. గ్రామానికున్న అవసరాలేంటి? ఉన్న వనరులేంటి? అనే విషయాలను బేరీజు వేసుకుని, వాటికి అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాలి. ఈ ఏడాది చేయాల్సిన పనులకు వార్షిక ప్రణాళికను, ఐదేళ్లలో చేయాల్సిన పనులకు పంచవర్ష ప్రణాళికను రూపొందించాలి. గ్రామసభ ఆమోదం తీసుకోవాలి. వాటి ఆధారంగానే నిధులు ఖర్చు చేయాలి.

### హరితహారం

శాశ్వత ప్రాతిపదికన నర్సరీల ఏర్పాటుకు స్థలం ఎంపిక చేయాలి. గ్రామంలో హరిత ప్రణాళికను సిద్ధం చేయాలి. దానిని గ్రామసభ ఆమోదించాలి. జిల్లా హరిత కమిటీ సూచనలకు అనుగుణంగా హరిత ప్రణాళిక ఉండాలి. వారం రోజుల పాటు విద్యుత్ వారం నిర్వహించాలి. వదులుగా ఉండే కరెంటు వైర్లను, వంగిన విద్యుత్ స్తంభాలను సరిచేయాలి" అని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక కార్యాచరణ అమలుపై దిశా నిర్దేశం చేశారు.

### కంపా నిధులతో అటవీ ప్రాంతాల అభివృద్ధి

రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 3,110 కోట్ల నిధులతో అటవీ ప్రాంతాలను పెద్దఎత్తున అభివృద్ధి చేయాలని సీఎం కేసీఆర్ ఆదేశించారు. అటవీశాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి ప్రగతి భవన్‌లో సీఎంను కలిసి కంపా నిధుల విడుదల ఉత్తర్వులను ఆయనకు అందజేశారు.

## యురేనియం తవ్వకాలు- ప్రకృతి విధ్వంసాలపై 1న సదస్సు

ఈనాడు, హైదరాబాద్: యురేనియం తవ్వకాలతో మానవజాతి ప్రమాదంలో పడుతుందని, ప్రకృతి విధ్వంసం జరుగుతుందని బహుజన బతుకమ్మ నిర్వహణ కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య, తెలంగాణ యునైటెడ్ ఫ్రంట్ సంయుక్తంగా హైదరాబాద్‌లోని బీసీ భవన్‌లో సెప్టెంబరు 1న 'యురేనియం తవ్వకాలతో జరిగే విధ్వంస పరిణామాలు - బహుజన బతుకమ్మ' అంశంపై రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్లు కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సదస్సు జరుగుతుందని పేర్కొంది. చర్చల్లో ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు, కె.విమల, విమలక్క, జూపాక సుభద్ర, జయప్రకాష్ తదితరులు పాల్గొంటారని కమిటీ వివరించింది.

## తెలంగాణ తహసీల్దార్ల సంఘం అధ్యక్షుడిగా ఎస్.రాములు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ తహసీల్దార్ల సంఘం (టీజీటీఏ) రాష్ట్ర అధ్యక్షుడిగా ఎస్.రాములును నియమించినట్లు సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు వి.లచ్చిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఏవీ భాస్కర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంఘం కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో.. ఇటీవల ఖాళీ ఏర్పడిన పదవుల భర్తీ చేపట్టినట్లు పేర్కొన్నారు. సంఘం అనుబంధ అధ్యక్షుడిగా డి.శ్రీనివాస్‌కుమార్, కోశాధికారిగా శకుంతల నియమితులైనట్లు వెల్లడించారు. రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, కొత్త రెవెన్యూ చట్టంపై త్వరలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు.

## 53 మందికి డీఎస్పీలుగా పదోన్నతి

ఈనాడు, హైదరాబాద్: పోలీసుశాఖలో 53 మంది సివిల్ ఇన్‌స్పెక్టర్లకు ప్రభుత్వం డీఎస్పీలుగా పదోన్నతి కల్పించింది. ఈ మేరకు డీజీపీ ఆదేశాలు జారీ చేశారు.

## ఈడీ విచారణకు హాజరైన డీకే

ఈనాడు డిజిటల్, బెంగళూరు: అక్రమ నగదు బదిలీ కేసులో కర్ణాటక మాజీ మంత్రి, కాంగ్రెస్ ట్రబుల్ షూటర్‌గా పేరొందిన డి.కె. శివకుమార్ ఈడీ ఎదుట విచారణకు హాజరయ్యారు. గురువారం రాత్రి ఈడీ నుంచి సమన్లు అందుకున్న ఆయన విచారణ శుక్రవారం దిల్లీలోని ఈడీ కేంద్ర కార్యాలయంలో సుదీర్ఘంగా సాగింది. ఈడీ సంయుక్త సంచాలకులు మౌనిక శర్మ నేతృత్వంలోని బృందం ఆయనను విచారించింది. 2017 ఆగస్టు 2న దిల్లీలోని డి.కె.శివకుమార్ నివాసంలో సోదాలు జరిపిన ఐటీ అధికారులు రూ. 8.56 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నారు.

# నల్లమల జల్లెడ

(మొదటి పేజీ తరువాయి)

అడవుల్లోకి వెళ్లేందుకు.. నమూనాల సేకరణకు బోర్ల రూపంలో జరిపే తవ్వకాల కోసం భారీ యంత్రాలు, వాహనాలను ఉపయోగించేందుకు సిద్ధమవుతోంది.

### భూమిలో పెద్దపెద్ద బోర్లు...

ఏఎండీ భూగర్భం నుంచి యురేనియం నిక్షేపాల నమూనాల సేకరణ కోసం దాదాపు 75 సెం.మీ. చుట్టుకొలత ఉండే భారీ బోర్లు వేయనున్నట్లు సమాచారం. యురేనియం అన్వేషణపై ఏఎండీకి మే 22న సూత్రప్రాయ ఆమోదం తెలిపిన కేంద్ర అటవీ సలహా మండలి.. తెలంగాణ అటవీశాఖకు వివరాలు సమర్పించాలని స్పష్టంచేసింది. దీంతో హైదరాబాద్‌లోని ప్రాంతీయ డైరెక్టర్ జులై 1న ఆ సమాచారం అప్‌లోడ్ చేశారు. అందులో పూర్తి వివరాలు లేకపోవడంతో.. అప్పటి తెలంగాణ ప్రధాన అటవీ సంరక్షణ అధికారి (పీసీసీఎఫ్) ప్రశాంత్‌కుమార్ ఝా జులై 4న ఏఎండీ ప్రాంతీయ డైరెక్టర్‌కు లేఖ రాశారు. తవ్వకాలు జరపాలనుకుంటున్న ప్రాంతాల మ్యాప్‌లు, వివరాలు ఇవ్వాలని కోరారు.

### అటవీశాఖ కోరిన వివరాలివి

- అమ్రాబాద్ అభయారణ్యంలో ఏయే ప్రాంతాల్లో యురేనియం కోసం అన్వేషణ చేస్తారు? ఎన్నిచోట్ల బోర్లు వేస్తారు?
- ఎన్ని వాహనాలు, యంత్రాల్ని అడవిలోకి తీసుకెళ్తారు? సర్వేకు ఎంతమంది సిబ్బందిని తీసుకెళ్తారు?
- అడవిలో ఎన్నిరోజులు ఉంటారు? అక్కడికి వెళ్లడానికి రహదారులు చూసుకున్నారా?
- ప్రశాంత్‌కుమార్ ఝా లేఖకు స్పందిస్తూ ఏఎండీ రెండురోజుల క్రితం పూర్తివివరాలతో తాజా ప్రతిపాదనల్ని అటవీశాఖకు పంపింది.

### పార్టీల వ్యతిరేకత

ప్రకృతి సంపదకు, జీవవైవిధ్యానికి నిలయం నల్లమల అడవులు. దట్టమైన అటవీప్రాంతంతో పాటు వివిధ రకాల అరుదైన వన్యప్రాణులకు, చెంచుజాతి ప్రజలకు ఆవాసమిది. అమ్రాబాద్ టైగర్ రిజర్వు ఇక్కడే ఉంది. తెలంగాణలో ఉన్న పెద్దపులుల్లో మూడింట రెండొంతులు ఇక్కడే ఉన్నాయి. ఇప్పుడు జరిపేది అన్వేషణ మాత్రమే అని చెబుతున్నా నమూనాల సేకరణకే వేల సంఖ్యలో బోర్లు వేయబోతున్నారు. పూర్తిస్థాయి తవ్వకాలు ఎంత భారీగా ఉంటాయో అనేదానిపై ఆందోళన పెరుగుతోంది. పులులు సహా వన్యప్రాణులపైనా, చెంచులపైనా, కృష్ణా జలాలపైనా యురేనియం దుష్ప్రభావం పడుతుందన్న ఆందోళన రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు, పర్యావరణవేత్తల నుంచి వ్యక్తం అవుతోంది. ఇంత వ్యతిరేకత వస్తున్నా ఏఎండీ ముందుకే వెళ్తుండటం చర్చనీయాంశంగా మారింది.

### ప్రభావంపై క్షేత్రస్థాయి అంచనా

ఏఎండీ నుంచి వచ్చిన ప్రతిపాదనల్ని తెలంగాణ అటవీశాఖ శుక్రవారం అచ్చంపేట, నాగార్జునసాగర్ డివిజన్ల అధికారులకు పంపినట్లు విశ్వసనీయంగా తెలిసింది. యురేనియం సర్వే ద్వారా పడే ప్రభావాన్ని అంచనా వేయాలని అందులో పేర్కొన్నట్లు తెలిసింది. ఏఎండీ బోర్లు వేయాలనుకున్న ప్రాంతాలకు వెళ్లేందుకు రహదారి ఉందా? లేదంటే వాహనాలు వెళ్లేలా రోడ్లు వేయడానికి ఎన్ని చెట్లను తొలగించాల్సి ఉంటుంది. . వీటితోపాటు వన్యప్రాణులపై ప్రభావం ఉంటుందా.. తదితర వివరాల్ని డివిజన్ అధికారులు పరిశీలించి నివేదిక ఇవ్వనున్నట్లు సమాచారం.

### తవ్వకాలకు అనుమతులు రద్దు చేయండి: కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యేల వినతి

ఈనాడు, దిల్లీ: అమ్రాబాద్ అభయారణ్యంలో యురేనియం తవ్వకాలకు అనుమతులు రద్దు చేయాలని జాతీయ పులుల సంరక్షణ ప్రాధికార సంస్థ (ఎన్‌టీసీఏ) అదనపు డైరెక్టర్ జనరల్ అనూప్‌కుమార్ నాయక్‌కు కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యేలు వంశీకృష్ణ (అచ్చంపేట), సంపత్‌కుమార్ (అలంపూర్), వంశీచంద్‌రెడ్డి (కల్వకుర్తి) విజ్ఞప్తి చేశారు. దిల్లీలో శుక్రవారం ఏడీజీని వారు కలిశారు. యురేనియం తవ్వకాలు చేపట్టాలనుకుంటున్న అభయారణ్యంలో 20 పెద్ద పులులు మనుగడ సాగిస్తున్నాయని వివరించారు. ఈ ప్రాంతం ఆదిమ చెంచు తెగలు, బంజారాలకు నిలయమని.. జీవవైవిధ్యానికి ఆయువుపట్టు అని తెలిపారు. యురేనియం తవ్వకాల వల్ల కృష్ణా జలాలు కలుషితమవుతాయని.. ఫలితంగా రెండురాష్ట్రాల్లో ఎంతోమంది క్యాన్సర్ వంటి వ్యాధుల బారిన పడవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్థిక ప్రయోజనాల కోసం నల్లమలలో యురేనియం తవ్వకాలకు బోరు దింపితే.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గుండెల్లో గునపం దిగుతుందని సంపత్‌కుమార్ హెచ్చరించారు.

### ఏపీలో యురేనియం కాలుష్యంపై 5న న్యాయ విచారణ

ఈనాడు, అమరావతి: కడప జిల్లా ఎం.తుమ్మలపల్లెలోని యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (యూసీఐఎల్)కు చెందిన శుద్ధి కర్మాగారం నుంచి వెలువడే వ్యర్థాల వల్ల భూగర్భజలాలు కలుషితమవుతున్నాయని వచ్చిన ఫిర్యాదులపై సెప్టెంబరు 5న న్యాయ విచారణ చేపడుతున్నామని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ బీఎస్ఎస్ ప్రసాద్ తెలిపారు. అక్కడి భూగర్భజలంలో సోడియం స్థాయి పెరిగినట్లు తమ పరీక్షల్లో తేలిందని, దీనిపై ఐఐటీకి చెందిన నిపుణుల బృందంతో పరీక్ష చేయిస్తున్నామని చెప్పారు. శుద్ధి కర్మాగారం నుంచి వెలువడే వ్యర్థాల వల్ల భూగర్భజలాలు కలుషితం కాకుండా ఉండేందుకు ఆ వ్యర్థాల్ని నింపే చెరువు అడుగున, చుట్టూ పోలిఇథలిన్ పొరతో లైనింగ్ ఏర్పాటు చేయాలని ఆ సంస్థకు సూచించామని.. వారు మాత్రం బెన్‌టోనైట్ పొర ఏర్పాటుకే పరిమితమయ్యారని చెప్పారు.

**ప్రేమను చెప్పేదెలా?**

ఇతరులను బాధలు పెట్టటం, కష్టాల పాలు చేయటమన్నది ఎన్నటికీ ప్రేమ వ్యక్తీకరణ కాజాలదు. బాధను తాను తీసుకోవటం, కష్టాన్ని అనుభవించేందుకు సిద్ధపడటం, హృదయాన్ని పరిశుద్ధం చేసుకోవటమే ప్రేమకు నిజమైన వ్యక్తీకరణ!

– మహాత్మా గాంధీ

(ఈనాడు 1869 - 2019 మహాత్ముడి 150వ జయంతి వేడుకలు)

### గ్రహం అనుగ్రహం

**31–8–2019 శనివారం**

శ్రీ వికారి నామ సం॥రం॥ దక్షిణాయనం
వర్ష రుతువు; భాద్రపద మాసం; శుక్ల పక్షం
పాడ్యమి: మ.2-08 తదుపరి విదియ
పుబ్బ నక్షత్రం: సా.5-02 తదుపరి ఉత్తర
అమృత ఘడియలు: మ.11-04 నుంచి 12-34 వరకు
వర్జ్యం: రా.11-44 నుంచి 1-13 వరకు
దుర్ముహూర్తం: ఉ.5-48 నుంచి 7-27 వరకు
రాహుకాలం: ఉ.9-00 నుంచి 10-30 వరకు
సూర్యోదయం: ఉ.5-48; సూర్యాస్తమయం: సా.6.13

## తెలుగు రాష్ట్రాల్లో సీబీఐ ఆకస్మిక తనిఖీలు

ఈనాడు, దిల్లీ: తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో స్థానిక ప్రభుత్వ విభాగాలు, విజిలెన్స్ అధికారుల సాయంతో సీబీఐ ఆకస్మిక తనిఖీలు చేపట్టింది. ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా దేశవ్యాప్తంగా 150 ప్రాంతాల్లో సోదాలు చేసినట్లు సీబీఐ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. తెలుగు రాష్ట్రాల్లోని హైదరాబాద్, సికింద్రాబాద్, హన్మకొండ, కరీంనగర్, విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు నగరాల్లోనూ తనిఖీలు నిర్వహించారు. విద్యుత్తు, మున్సిపల్ కార్పొరేషన్లు, ఈఎస్ఐసీ, రవాణా, సీపీడబ్ల్యూడీ, డైరెక్టరేట్ ఆఫ్ ఎస్టేట్స్, ఫైర్ సేవలు, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం, జీఎస్టీ విభాగం, పోర్టు ట్రస్టు, జాతీయ రహదారులు డీఏపీపీ, ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా, ప్రభుత్వ రంగ చమురు సంస్థలు, డీజీఎఫ్టీ, ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఏఎస్ఐ, షిప్పింగ్ కార్పొరేషన్, బీఎస్ఎన్ఎల్, ఉక్కు సంస్థలు, గనులు, ఖనిజాలు, ఎన్‌సీటీ పరిశ్రమల విభాగాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టినట్లు అధికారులు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## ప్లాస్టిక్‌పై సమష్టి చర్యలు చేపట్టాలి

- **పీసీబీ, జీహెచ్ఎంసీలకు హైకోర్టు ఆదేశం**

ఈనాడు, హైదరాబాద్: నిబంధనలకు విరుద్ధంగా ప్లాస్టిక్‌ను తయారు చేస్తున్న కంపెనీలు, సరఫరాదారులను పీసీబీ, జీహెచ్ఎంసీలు పట్టించుకోకపోవడంపై హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. హైదరాబాద్, సికింద్రాబాద్‌లలో అతి పెద్ద వినాయక విగ్రహాలను కప్పేందుకు ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని ప్రశ్నిస్తూ హైదరాబాద్‌కు చెందిన వై.వి.మురళీకృష్ణ ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆర్.ఎస్.చౌహాన్, జస్టిస్ ఎ.అభిషేక్‌రెడ్డిలతో కూడిన ధర్మాసనం శుక్రవారం మరోసారి విచారణ చేపట్టింది. పీసీబీ న్యాయవాది స్పందిస్తూ 13 నుంచి 14 కంపెనీలపై చర్యలు తీసుకున్నామనగా నిబంధనలు ఉల్లంఘించినవారిపై ఏం చర్యలు తీసుకున్నారనేది ప్రధానమని ధర్మాసనం వ్యాఖ్యానించింది. జీహెచ్ఎంసీ ఏం చర్యలు తీసుకుందని అడ్వొకేట్ జనరల్ బి.ఎస్.ప్రసాద్‌ను ప్రశ్నించింది. ఒకరిపై ఒకరు చెబుతూ వెళ్లడం సరికాదని, సమష్టిగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందంది. ఇప్పటికే మార్కెట్‌లోకి వచ్చిన ప్లాస్టిక్‌ను ఎలా సేకరిస్తారు? ఏ రకంగా ధ్వంసం చేస్తారన్నదానిపై కార్యాచరణ ప్రణాళికతో నివేదికను సమర్పించాలంటూ విచారణను సెప్టెంబరు 7కు వాయిదా వేసింది.

> సత్యజిత్‌రే సినిమా 'సత్రంజ్‌కే ఖిలాడీ'లో ఇద్దరు నవాబులు చెస్ ఆడుతుంటే ఈస్టిండియా కంపెనీ వచ్చి దేశాన్ని ఆక్రమించినట్లుగా ప్లాస్టిక్ నియంత్రణపై కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ), జీహెచ్ఎంసీల ప్రతినిధులు ఒకరిపై మరొకరు చెబుతూ వదిలేస్తే ఈస్టిండియా కంపెనీలాగే ప్లాస్టిక్ కబళిస్తుంది.
>
> - హైకోర్టు

## 'వస్త్రసిరి'సిల్ల

- **నాలుగేళ్లలో 40 కోట్ల మీటర్ల వస్త్రోత్పత్తి**

ఈనాడు డిజిటల్, సిరిసిల్ల: గత నాలుగేళ్లలో రాజన్నసిరిసిల్ల జిల్లా రూ.1600కోట్ల విలువైన ప్రభుత్వ ఆర్డర్లతో 40కోట్ల మీటర్ల వస్త్రోత్పత్తి చేసినట్లు రాష్ట్ర చేనేత, జౌళిశాఖ డైరెక్టర్ శైలజారామయ్యర్ స్పష్టం చేశారు. బతుకమ్మ చీరల ఉత్పత్తి చివరిదశకు చేరుకున్న నేపథ్యంలో ఆమె శుక్రవారం సిరిసిల్లలో మాట్లాడారు. బతుకమ్మ చీరలు జిల్లాలోని మరమగ్గాలపై నేసినట్లు తెలిపారు.

### పౌరసరఫరాల శాఖకు స్కోచ్ అవార్డులు

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: రైతులు, రేషన్ సరకులు తీసుకునే లబ్ధిదారులకు ప్రయోజనం చేకూర్చేందుకు పౌరసరఫరాల శాఖ చేపట్టిన ఆన్‌లైన్ ప్రొక్యూర్‌మెంట్ మేనేజ్‌మెంట్ సిస్టం(ఓపీఎంఎస్), టీ రేషన్, టీ వాలెట్‌లకు స్కోచ్ అవార్డులు లభించాయి. దిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ పౌరసరఫరాల సంస్థ జనరల్ మేనేజర్ (మార్కెటింగ్) నాగిరెడ్డి ఈ అవార్డులను స్వీకరించారు.

### వాతావరణం

| ప్రాంతం | గరిష్ఠ | కనిష్ఠ |
|---|---|---|
| గుంటూరు | 37.8 | 26.7 |
| ఒంగోలు | 37.6 | 27.8 |
| కడప | 37.0 | 27.0 |
| తిరుపతి | 36.5 | 26.9 |
| విజయవాడ | 35.0 | 26.0 |
| ఆదిలాబాద్ | 34.3 | 25.6 |
| రామగుండం | 34.0 | 26.6 |
| నిజామాబాద్ | 33.9 | 25.2 |
| హన్మకొండ | 33.7 | 26.9 |
| విశాఖపట్నం | 33.6 | 27.6 |
| మహబూబ్‌నగర్ | 33.3 | 24.6 |
| కరీంనగర్ | 32.0 | 26.0 |
| హైదరాబాద్ | 32.0 | 23.7 |
| నల్గొండ | 30.4 | 24.0 |
| సూర్యాపేట | 29.0 | 27.0 |
| ఖమ్మం | 28.0 | 25.0 |
| మెదక్ | 27.0 | 21.0 |



రెంజల్‌లో రెండేళ్ల క్రితం ఎడ్లను ఊరేగిస్తున్న రైతులు



ఎడ్లకు బదులు శుక్రవారం ట్రాక్టర్లను ఊరేగిస్తున్న రైతులు

# ఉత్సవం.. యాంత్రీకరణం

ఒకప్పుడు ఎద్దుంటేనే ఎవుసం.. పొలమంటే పశుగణ ప్రాంగణం. పొలాల అమావాస్య వచ్చిందంటే రైతుల ఇంట కొండంత సంబురం! అర ఎకరమే ఉన్న చిన్న రైతైనా.. అరవయ్యెకరాలున్న మోతుబరి అయినా.. ఆరోజున వారి ముఖాల్లో సంతోషం వెల్లివిరుస్తుంది. గుమ్మాలకు మామిడి తోరణాలు కట్టడం.. ఉదయాన్నే ఎద్దులకు స్నానం చేయించి ప్రత్యేకంగా అలంకరించడం.. వాటికి పానకాలు తాగించడం.. సాయంత్రం డప్పువాయిద్యాల మధ్య కాడెడ్లను ఊరేగించి గుడి చుట్టూ ఐదు ప్రదక్షిణలు చేయించడం.. ఇలా ఆ రోజంతా గ్రామాల్లో పండగ వాతావరణమే. ఇదంతా ఒకప్పటి ముచ్చట!

ఇప్పుడు చాలా గ్రామాల్లో ఆ సందడే లేదు! రైతు నేస్తమైన ఎడ్లు కనుమరుగైపోతున్నాయి. వాటి స్థానంలో ట్రాక్టర్లు ప్రవేశించాయి. ఆనాటి పండగ వాతావరణం తగ్గుముఖం పట్టింది. సకాలంలో వర్షాలు లేకనో ఏమో రైతు ముఖాల్లోనూ కళ తగ్గింది. ఏదో ఆనవాయితీ కావడం.. పెద్దలు పట్టుబట్టడంతో ట్రాక్టర్లనే ఊరేగించి పండగ అయిందనిపించారు. నిజామాబాద్ జిల్లా రెంజల్ మండల కేంద్రంలో రెండేళ్ల క్రితం వరకు ఎద్దులనే ఊరేగించేవారు. గతేడాది నుంచి ట్రాక్టర్లను ఊరేగిస్తున్నారు. శుక్రవారం గ్రామంలో జరిగిన పొలాల అమాస పండగ ఊరేగింపు ఇలా సాగింది.

– రెంజల్, న్యూస్‌టుడే

## మట్టి విగ్రహం.. మన అభిమతం



పర్యావరణాన్ని పరిరక్షించాలని.. మట్టి గణపతినే రూపొందించి పూజించాలన్న నినాదం అంతటా మార్మోగుతోంది. ఇందుకు ఆదర్శంగా నిలిచింది వనపర్తి బాలభవన్. జాతీయ హరితదళం ఆధ్వర్యంలో ఇక్కడ మట్టి వినాయకుల ప్రతిమల తయారీ శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం ఆత్మకూరు ఉర్దూ జడ్పీ ఉన్నత పాఠశాలలోని ఓ విద్యార్థితో కలిసి ఉపాధ్యాయురాలు గణపయ్య విగ్రహాన్ని తయారు చేశారు. ప్రతిమ తయారీకి మతాలు అడ్డుకాదంటూ వారు ఆదర్శంగా నిలిచారు.

– న్యూస్‌టుడే, వనపర్తి

## యువకుడి వేధింపులతో బాలిక బలవన్మరణం

సంస్థాన్ నారాయణపురం, న్యూస్‌టుడే: ఓ యువకుడి వేధింపులు తాళలేక బాలిక బలవన్మరణానికి పాల్పడ్డ ఘటన గురువారం రాత్రి యాదాద్రి భువనగిరి జిల్లాలో చోటుచేసుకుంది. శుక్రవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంస్థాన్ నారాయణపురానికి చెందిన బాలిక(14) స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. ఇదే గ్రామానికి చెందిన సుక్క గిరిబాబు తరచూ సెల్‌ఫోన్‌లో ఆమెకు సంక్షిప్త సందేశాలు పంపిస్తూ వేధించేవాడు. మనస్తాపానికి గురైన ఆ బాలిక గురువారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చౌటుప్పల్ సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. మృతికి కారణమైన వ్యక్తి పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు.

SANSKRITI UNIVERSITY
UGC Recognised Ph: 9014965113
www.sanskriti.edu.in Mathura, Delhi.
Ag.B.Sc.
Fee: 67,000/- మాత్రమే (Per Yr)
Eligibility: BiPC, MPC & Diploma (Agri)
400+ తెలుగు విద్యార్థులు, తెలుగు Faculty మరియు
ICAR, IIMR & NBPGR మూడు రీసెర్చ్ సంస్థలతో
MOU కలిగిన మొట్టమొదటి UNIVERSITY,
Govt. & Pvt. ఉద్యోగాలకు అర్హులు
B.Sc Forensic (3 Yrs) :
మీ లక్ష్యం Police Dep. & CBI లాంటి Invesitigation సంస్థలలో ఉద్యోగం పొందటం అయితే...
B.Sc Forensic లో చేరండి. Scholarship అవకాశం కలదు.
40,000 + ఉద్యోగ అవకాశాలు కలవు.
Call : 9346838173, 8142587349
8142384755

## రిజర్వేషన్లపై పునఃసమీక్ష అవసరమే: మంద కృష్ణమాదిగ

హన్మకొండ చౌరస్తా (వరంగల్), న్యూస్‌టుడే: రిజర్వేషన్లను తిరిగి సమీక్షించాలన్న ఆర్‌ఎస్‌ఎస్ నేత మోహన్ భగవత్ వ్యాఖ్యలను స్వాగతిస్తున్నామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ, రిజర్వేషన్లను సమీక్షించడమంటే అది వర్గీకరణే అని స్పష్టం చేశారు. భగవత్ వ్యాఖ్యలు రిజర్వేషన్లకు వ్యతిరేకమని తాము భావించడంలేదన్నారు. ఎస్సీ వర్గీకరణ అంశంపై కేంద్రప్రభుత్వాన్ని తప్పుపడుతూ..ఎన్నింటినో సుసాధ్యం చేశామంటున్న ప్రధాని మోదీ..అదే కోవలో వర్గీకరణ ఎందుకు సాధ్యంకావడం లేదన్నది వివరించాలన్నారు.






ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

## భువనగిరిలో కాంగ్రెస్ ధర్నా ఉద్రిక్తం

- ఎంపీని అదుపులోకి తీసుకున్న పోలీసులు

భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక సంస్థలకు నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ భువనగిరిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన ధర్నా ఉద్రిక్తంగా మారింది. ఇందులో పాల్గొన్న ఎంపీ కోమటిరెడ్డిని పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు, నాయకుల మధ్య తోపులాట జరిగింది. అనంతరం ఎంపీని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎంపీ అరెస్టు సమయంలో జరిగిన తోపులాటలో వడపర్తి సర్పంచి ఎలిమినేటి కృష్ణారెడ్డి కాలు విరిగింది. తొలుత జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ధర్నా చేశారు. అధికారులు స్పందించడం లేదని ఆరోపిస్తూ తర్వాత కొందరు కార్యకర్తలు పాత బస్టాండు ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. అక్కడ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, డీసీసీ ఇన్‌ఛార్జి అధ్యక్షుడు అనిల్ కుమార్‌రెడ్డి రోడ్డుపై బైఠాయించడంతో ప్రధాన రహదారికి ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి.

## నిజామాబాద్‌లో పసుపు బోర్డు ఏర్పాటు చేయండి

### కేంద్ర మంత్రి పీయూష్‌కు వినోద్ కుమార్ లేఖ

ఈనాడు, హైదరాబాద్: నిజామాబాద్‌లో పసుపు బోర్డు కార్యాలయాలను వెంటనే ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ కేంద్ర పరిశ్రమలు, వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్‌ను కోరారు. వరంగల్‌లోని సుగంధ ద్రవ్యాల (స్పైసెస్) బోర్డు ప్రాంతీయ కార్యాలయాన్ని నిజామాబాద్‌కు తరలించాలనే యోచన మానుకోవాలని సూచిస్తూ శుక్రవారం ఆయనకు లేఖ రాశారు. “2008లో నేను ఎంపీగా ఉన్నప్పుడు వరంగల్‌లో సుగంధ ద్రవ్యాల ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు చేయించాను. వరంగల్ జిల్లాలో మిర్చి, పసుపు ప్రధాన పంటలు. తెలంగాణలోని 70 శాతం మిర్చి ఈ జిల్లాలోనే పండుతోంది. పసుపు 60 శాతం ఇక్కడే సాగవుతోంది. ప్రాంతీయ కార్యాలయానికి సొంత భవనం కోసం ప్రభుత్వం భూమిని కేటాయించింది. ఈ తరుణంలో వరంగల్ నుంచి ప్రాంతీయ కార్యాలయాన్ని నిజామాబాద్‌కు తరలించే యత్నాలు జరుగుతున్నాయి. ఇది సబబు కాదు. కేంద్ర ప్రభుత్వం ఈ ప్రయత్నాలు మానుకోవాలి. ప్రాంతీయ కార్యాలయాన్ని తరలించే కంటే నిజామాబాద్‌లో తప్పనిసరిగా పసుపు బోర్డు ఏర్పాటు చేయాలి. ఎన్నో ఏళ్లుగా నిజామాబాద్ ప్రజలు పసుపు బోర్డు కోసం ఎదురుచూస్తున్నారు. కేంద్రం దీన్ని పరిగణనలోనికి తీసుకోవాలి'' అని వినోద్ కేంద్ర మంత్రిని కోరారు.

## ఎంబీబీఎస్ ప్రథమ సంవత్సరంలో 88.67% ఉత్తీర్ణత

ఎంజీఎం ఆసుపత్రి (వరంగల్), న్యూస్‌టుడే: కాళోజీ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం ఎంబీబీఎస్ ప్రథమ సంవత్సరం పరీక్షల్లో 88.67 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. శుక్రవారం రాత్రి అధికారులు ఫలితాలను విడుదల చేశారు. 284 మంది డిస్టింక్షన్‌లో, 1,484 మంది ప్రథమ శ్రేణిలో, 1,213 మంది ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు.

## గవర్నర్ కార్యదర్శినంటూ తహసీల్దారుకు బురిడీ యత్నం

హుజూర్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: హుజూర్‌నగర్ తహసీల్దారు కార్యాలయం.. శుక్రవారం మధ్యాహ్నం ఓ వ్యక్తి నుంచి ఫోన్.. తాను 'గవర్నర్ నరసింహన్ వ్యక్తిగత కార్యదర్శి సురేంద్రమోహన్‌ని' అంటూ పరిచయం.. తన బంధువులు ప్రస్తుతం హుజూర్‌నగర్‌లో ఉన్నారని, వారికి భోజనాలు ఏర్పాటు చేయాలంటూ హుకుం! సురేంద్రమోహన్ గతంలో సూర్యాపేట జిల్లా పాలనాధికారిగా పనిచేసి ఉండడం.. అవతలి నుంచి ఫోన్ చేసిన వ్యక్తి మాటల్లో తేడా ఉండడాన్ని గమనించిన తహసీల్దార్ సైదులుకు అనుమానం వచ్చింది. వెంటనే ఆ వ్యక్తి చెప్పిన హోటల్ వద్దకు సిబ్బందిని పంపించారు. అక్కడున్నవారిని చూడగానే సిబ్బందికి కూడా అనుమానం వచ్చి ఒకరిని పట్టుకోగా మరో వ్యక్తి తప్పించుకుని వెళ్లిపోయాడు. పట్టుకున్న వ్యక్తిని వారు పోలీసులకు అప్పగించారు. అతడు సూర్యాపేట జిల్లా అమరవరం గ్రామానికి చెందిన జిట్టబోయిన నరేశ్ అని గుర్తించారు. అతనిపై పీడీ యాక్ట్ సహా పలు కేసులు ఉన్నాయని ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపారు. విచారణ చేస్తున్నామని చెప్పారు.

## నీటి సంరక్షణలో మనమే భేష్

- ప్రపంచ నీటి వారోత్సవాల్లో పెద్దపల్లి కలెక్టర్ శ్రీదేవసేన



స్వీడన్ సదస్సులో పాల్గొన్న పెద్దపల్లి జిల్లా కలెక్టర్ శ్రీదేవసేన

పెద్దపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రతి నీటి బొట్టు భూమిలో ఇంకించడం.. పొదుపులో ప్రజా చైతన్యం తీసుకురావడం.. సంపూర్ణ పారిశుద్ధ్యం సాధించి స్వచ్ఛతలో మన దేశం ఆదర్శంగా నిలుస్తోందని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ శ్రీదేవసేన పేర్కొన్నారు. స్వీడన్‌లోని స్టాక్‌హోమ్‌లో జరిగిన ప్రపంచ నీటి సంరక్షణ సదస్సులో భారత్ నుంచి పాల్గొన్న అయిదుగురు అధికారుల్లో ఈమె ఒకరు. ఈ సందర్భంగా సదస్సు ముగింపు సమావేశంలో నీటి సంరక్షణకు సంబంధించి మన దేశానికి కితాబునిచ్చిందని తెలిపారు. అయిదేళ్లలో 38 శాతం ఉన్న వ్యక్తిగత మరుగుదొడ్ల వినియోగం ప్రస్తుతం 99 శాతానికి తీసుకొచ్చామని వివరించినట్లు ఆమె చెప్పారు. పతాక స్థాయిలో పడిపోతున్న నీటి వనరులను కాపాడుకునేందుకు ప్రపంచ సదస్సులో పలు దేశాల్లో నీటి లభ్యత, వినియోగం, ఇతర సమగ్ర సమాచారం తెలుసుకున్నట్లు పేర్కొన్నారు. వారం రోజులపాటు సుదీర్ఘంగా సాగిన సదస్సులోని అంశాలను స్ఫూర్తిగా తీసుకొని జిల్లాలో అమలు చేస్తామన్నారు. ప్రజలను భాగస్వామ్యం చేస్తూ.. ఆదర్శంగా తీర్చిదిద్దుతామని చెప్పారు.

## చిన్నారుల మరణాలు తగ్గాయ్

- జాతీయ సగటు కంటే రాష్ట్ర గణాంకాల్లో తగ్గుదల

ఈనాడు, హైదరాబాద్: ఉత్తమ ఆరోగ్య సూచీలను నమోదు చేసే దిశగా తెలంగాణ అడుగులేస్తోంది. రాష్ట్రం ఏర్పడిన ఐదేళ్ల కాలంలోనే కొన్ని అంశాల్లో ఉత్తమంగా నిలిచింది. ముఖ్యంగా శిశు మరణాలను తగ్గించడంలో గణనీయమైన ప్రగతిని సాధించింది. నీతి ఆయోగ్ 25 అంశాలను సూచించి వాటిలో ప్రగతిని ప్రమాణంగా తీసుకునే రాష్ట్రాలకు ర్యాంకులను కేటాయిస్తుంది. శుక్రవారం ఇదే విషయంపై నీతి ఆయోగ్ ఉన్నతాధికారులు రాష్ట్రాల వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో దృశ్య మాధ్యమ సమావేశాన్ని నిర్వహించారు. కొన్ని అంశాలు మినహా ఎక్కువ అంశాల్లో జాతీయ సగటు కంటే రాష్ట్రం మెరుగైన గణాంకాలనే నమోదు చేసింది.

కేంద్ర ప్రభుత్వ సంస్థ శాంపిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ ప్రకారం

| ప్రతి వేయి జననాలకు | దేశంలో | | తెలంగాణలో | |
|---|---|---|---|---|
| | 2016 | 2017 | 2016 | 2017 |
| ఐదేళ్లలోపు చిన్నారుల మరణాలు | 39 | 37 | 34 | 32 |
| నవజాత శిశు మరణాలు | 24 | 23 | 21 | 20 |
| ఏడాదిలోపు చిన్నారుల మరణాలు | 34 | 33 | 31 | 29 |

## బండెనక బండి.. యూరియా కోసమండి



సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలకు శుక్రవారం యూరియా వస్తుందని తెలిసి రైతులు ట్రాక్టర్లు, ఆటోలతో భారీగా తరలివచ్చారు. దీంతో ఎరువుల దుకాణాలు అధికంగా ఉన్న జాన్‌పహాడ్ రోడ్డు ఇలా రద్దీగా మారింది.

– న్యూస్‌టుడే, నేరేడుచర్ల

## ప్రజలకు ఇబ్బంది కలిగించొద్దు

### బొగ్గు తవ్వకాలపై సింగరేణికి సుప్రీంకోర్టు సూచన

ఈనాడు, దిల్లీ: సమీపంలోని ప్రజలు ఇబ్బంది పడేలా బొగ్గు తవ్వకాలు చేపట్టవద్దని సింగరేణి సంస్థకు సుప్రీంకోర్టు సూచించింది. భూపాలపల్లి జిల్లా కాకతీయ గని-2లో బొగ్గు తవ్వకాల వల్ల సమీప ప్రజలు ఇబ్బందులు పడుతున్నారంటూ నాగవెల్లి రాజలింగమూర్తి దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ ఎల్ నాగేశ్వరరావు, జస్టిస్ హేమంత్‌గుప్తాలతో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. బొగ్గు కోసం జరుపుతున్న పేలుళ్లతో సమీపంలోని ఇళ్లపై రాళ్లు పడుతున్నాయని పిటిషనర్ తరఫు న్యాయవాది శ్రావణ్ కుమార్ కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. దీనికి సంబంధించి ఛాయా చిత్రాలను కోర్టుకు సమర్పించారు. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ఇచ్చిన నివేదిక తమకు అనుకూలంగా ఉందని సింగరేణి కాలరీస్ తరఫున అడిషనల్ సొలిసిటర్ జనరల్ నాదకర్ణి వాదనలు వినిపించారు. ఇదే సమయంలో పిటిషన్‌పై కౌంటరు దాఖలు చేయడానికి గడువు కావాలని కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ తరఫు సీనియర్ న్యాయవాది చేసిన విజ్ఞప్తిని కోర్టు అంగీకరించింది. ప్రజలు ఇబ్బంది పడకుండా జాగ్రత్తలు తీసుకొని తవ్వకాలు చేపట్టాలని సింగరేణికి ధర్మాసనం సూచించింది. తదుపరి విచారణను సెప్టెంబరు 5వ తేదీకి వాయిదా వేసింది.



## ఈనాడు

# ప్రత్యామ్నాయం లేని అడవి

మానవ నాగరికతకు పుట్టిళ్లు అడవులు. నేటికీ ప్రాణికోటి మనుగడకు వనాలే వెలకట్టలేని రక్షాకవచాలు. అటువంటి వృక్షసముదాయాల్ని యథేచ్ఛగా భక్షించే దారుణాలపట్ల దేశదేశాల్లో ప్రకృతి ఊహాతీతంగా స్పందిస్తోంది. రుతువులతో నిమిత్తం లేకుండా వాతావరణం మృత్యుపాశావరణంగా మారడానికి ప్రధాన కారణం- విచ్చలవిడిగా అడవుల నరికివేతే. తరిగిపోతున్న హరితచ్ఛాయ పుడమితల్లికి కడుపుకోత మిగిల్చి మానవాళి భవితవ్యానికి గొడ్డలి వేటుగా పరిణమించాక దేశీయంగా కొన్నేళ్ల క్రితం తెరపైకి వచ్చిన యోచన 'కంపా' (కాంపన్సేటరీ అఫారెస్టేషన్ మేనేజ్‌మెంట్ ప్లానింగ్ అథారిటీ). దానికింద ప్రత్యామ్నాయ అటవీ పెంపకం నిమిత్తం 27 రాష్ట్రాలకు కేంద్రం నుంచి తాజాగా సుమారు రూ.47 వేలకోట్లు మంజూరయ్యాయి. వాటిలో పెద్దపద్దు ఒడిశా (రూ.5,933 కోట్లు), ఛత్తీస్‌గఢ్ (రూ.5,791 కోట్లు), మధ్యప్రదేశ్ (రూ.5,196 కోట్లు), ఝార్ఖండ్ (రూ.4,158 కోట్లు)లది. నిధుల బదిలీ మూడు వేలకోట్ల రూపాయలకు పైబడిన జాబితాలో మహారాష్ట్ర, తెలంగాణల పేర్లు చోటుచేసుకున్నాయి. ఈ నిధుల్ని ప్రత్యామ్నాయ అటవీ పెంపకం, వన్యప్రాణి సంరక్షణ, అడవుల్లో అగ్ని ప్రమాదాల నివారణ తదితరాలకు రాష్ట్రాలు సద్వినియోగపరచాలంటున్న కేంద్రమంత్రి ప్రకాశ్ జావడేకర్- వేటికి ఉపయోగించకూడదో సైతం ఏకరువు పెట్టారు. రాష్ట్ర అటవీ విభాగాల సిబ్బంది జీతభత్యాలు, ప్రయాణ ఛార్జీలు, ఇతరత్రా అలవెన్సుల కోసం ఈ నిధుల్లోంచి రూపాయైనా ఖర్చుపెట్టే వీల్లేదని అమాత్యులు ఆంక్షలు విధించారు. కొన్నేళ్లుగా తగినన్ని నిధులు అందుబాటులోకి రావడం లేదన్న అసంతృప్తితో రగిలిపోయిన రాష్ట్రాలిప్పుడు అరణ్యఘోషను ఏ మేరకు ఉపశమింపజేస్తాయో, దేశమంతటా అటవీ విస్తీర్ణం పెంపొందించే కార్యాచరణపై డేగకన్ను వేస్తామంటున్న కేంద్రం ఈ హరిత యజ్ఞాన్ని ఎలా పర్యవేక్షిస్తుందో చూడాలి.

అటవీ భూముల్ని పారిశ్రామిక అవసరాలకు బదలాయించిన పక్షంలో అందుకు ప్రతిగా మళ్ళీ అడవుల్ని పెంచి విస్తరించే లక్ష్యంతో సర్వోన్నత న్యాయస్థానం ఆదేశానుసారం 2006లో 'కంపా' వ్యవస్థ అవతరించింది. అక్కడ అలా జమపడిన నిధుల్లోంచి రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు ఏటా వెయ్యికోట్ల రూపాయల దాకా విడుదల చేయడానికి 2009లో సుప్రీంకోర్టు అనుమతించింది. కేంద్ర అటవీ పర్యావరణ శాఖ పరిధిలోని 'కంపా' వద్ద రాష్ట్రాలు జమచేస్తున్న నిధిపై పెరుగుతున్న వడ్డీరాశి నుంచి 10 శాతాన్ని ఏటా ఖర్చు చేయడానికి 2014లో న్యాయస్థానం సమ్మతి తెలిపింది. ఆ కారణంగా 2016 నాటికే రూ.40 వేలకోట్ల మేర పేరుకుపోయిన నిధుల్లో 80 శాతం దాకా రాష్ట్రాలకు బదలాయించే అవకాశాలున్నట్లు 2018లో కథనాలు వెలుగుచూశాయి. ఈ సంవత్సరం మొదట్లో కొత్త నిబంధనల కూర్పు, వాటికి సర్వోన్నత న్యాయస్థానం ఆమోదం దరిమిలా కడకు 90 శాతం నిధుల వితరణకు నేడు మార్గం సుగమమైంది! అభివృద్ధి ప్రాజెక్టుల పేరిట కోల్పోయిన అటవీ వనరులను పునరుద్ధరించడానికి పరిహారం రూపేణా వేలకోట్ల రూపాయలు జమపడుతున్నాయంటే అర్థం- ఇప్పటికే ప్రకృతికి భారీగా నష్టం వాటిల్లిందని. 2014-2018 సంవత్సరాల మధ్య మహారాష్ట్రలోని దక్షిణ కొంకణ్ ప్రాంతంలో 1600 ఎకరాల విస్తీర్ణంలోని దట్టమైన అరణ్యాలు అంతరించిపోయాయి. 2013-16 సంవత్సరాల మధ్య తెలుగుగడ్డపై ఆరు లక్షల వృక్షాలు అక్రమంగా నరికివేతకు గురైనట్లు కేంద్ర అటవీ మంత్రిత్వశాఖ గణాంకాలు చాటుతున్నాయి. అధికారిక అనుమతులతోనో, అక్రమ పద్ధతుల్లోనో 2001-2018 సంవత్సరాల మధ్య ఎకాయెకి 16 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలోని వృక్షచ్ఛాయను ఇండియా కోల్పోయిందన్నది ప్రపంచ వనరుల సంస్థ (డబ్ల్యూఆర్ఐ) అంచనా. అంతటి భారీ నష్టాన్ని సాధ్యమైనంతగా పూడ్చటానికి రాష్ట్రాలు శాయశక్తులా నిబద్ధకృషి సాగించాలిప్పుడు!

గడచిన అయిదేళ్లుగా దేశ అటవీ విస్తీర్ణంలో ఒక శాతం పెంపుదల నమోదైనట్లు రెండున్నర నెలల క్రితం కేంద్రమంత్రి జావడేకర్ సగర్వంగా ప్రకటించారు. మూడు సంవత్సరాల కిందట కేంద్రం వెల్లడించిన సమాచారం ప్రకారం, దేశంలో అడవుల మొత్తం విస్తీర్ణం 7,08,273 చదరపు కిలోమీటర్లు. అంటే, భారతావని భౌగోళిక ప్రాంతంలో దాదాపు 21 శాతం. అది పెరిగి 24 శాతానికి చేరిందని నిరుడు కేంద్రం వెల్లడించగా, జావడేకర్ మరింత 'వృద్ధి'ని ప్రస్తావించడం విస్మయపరుస్తోంది. ఈ గణాంకాలు కాకిలెక్కలేనంటూ పర్యావరణ నిపుణులు భిన్నగళం వినిపిస్తున్నారు. సర్కారు లెక్కలు ఎలా ఉన్నా 1952నాటి జాతీయ అటవీ విధాన నిర్దేశానుసారం, 33 శాతం విస్తీర్ణంలో అడవులు నేటికీ ఎండమావులనే తలపిస్తున్నాయి. జాతికి జీవగర్రగా నిలిచే వనాల పరిరక్షణను ఎన్నో దేశాలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ధీమాగా పురోగమిస్తున్నాయి. పొరుగున భూటాన్ పరిమాణంలో 71శాతం అడవులున్నాయి. అయిదు దశాబ్దాల వ్యవధిలో దక్షిణ కొరియా అటవీ విస్తీర్ణం రెండింతలకు పైబడిందని లోగడ అంతర్జాతీయ అడవుల పరిశోధన కేంద్రం (సీఐఎఫ్ఆర్) శ్లాఘించింది. ఇప్పుడక్కడ 64 శాతం భూభాగం పచ్చదనమే. ఒకప్పుడు 21 శాతం అటవీ ఆచ్ఛాదనకే పరిమితమైన కోస్టారికాలో ప్రస్తుతం 52 శాతం అడవులు నెలకొన్నాయి. తూర్పు ఆఫ్రికా దేశం టాంజానియాలో పౌరుల క్రియాశీల భాగస్వామ్యంతో అటవీ పరిరక్షణోద్యమం కొత్తపుంతలు తొక్కి హరితచ్ఛాయను 52 శాతానికి విస్తరింపజేసింది. వివిధ దేశాల స్ఫూర్తిమంతమైన అనుభవాల నుంచి విలువైన పాఠాలు నేర్చి, ఇన్నేళ్లుగా జరిగిన నష్టాన్ని పూడ్చుకోవడానికి లభించిన మహదవకాశాన్ని సద్వినియోగపరచుకోవడంలో రాష్ట్రాలన్నీ పోటీపడాలి. ప్రత్యామ్నాయ వనాల పెంపకం చేపట్టినంత మాత్రాన, హరాయించుకుపోయిన వృక్ష సంపదను ఇప్పటికిప్పుడు పునరుద్ధరించడమన్నది సాధ్యంకాదు. అటవీ పరిరక్షణను ప్రణాళికాబద్ధంగా వేగవంతం చేయడంతోపాటు అడవుల నరికివేతను కనిష్ఠ స్థాయికి కుదించగలిగితేనే- అరణ్యాల రోదనను బాపగలిగేది!

# అసోం చిక్కుముడి



కె.రామకోటేశ్వరరావు

అసోం ఓ చరిత్రాత్మక ఘటన ముంగిట నిలబడింది. నేడు ఆ రాష్ట్ర జాతీయ జనాభా రిజిస్టర్ వెల్లడి కానుంది. దీనివల్ల అక్కడున్న దాదాపు 40 లక్షల మంది విదేశీయులుగా మారబోతున్నారని అంచనా. ఈ పరిణామంవల్ల శాంతిభద్రతలు ప్రమాదంలో పడతాయని, దాదాపు 200 కంపెనీల కేంద్ర బలగాలు కావాలని అసోం ప్రభుత్వం ఇప్పటికే కేంద్ర సర్కారును కోరింది. ఒకవైపు కశ్మీర్ ఉద్రిక్తతలు చల్లారక ముందే, అసోమ్‌లో జరుగుతున్న పరిణామాలు ఎలా ఉంటాయోనని తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఇన్నేళ్ల అస్సామీయుల సమస్యకు పరిష్కారం లభించిందని సంతోషపడాలో, ఒకేసారి రెండు అతి సున్నితమైన సమస్యలు ఎదురవుతున్నందుకు కలత చెందాలో తెలియని పరిస్థితి నెలకొంది.

## ఉనికి ప్రశ్నార్థకమైన వేళ...

'యాండబో' ఒప్పందంతో 1826లో అసోం ప్రాంతం బ్రిటిష్ అధీనంలోకి వెళ్ళింది. అక్కడి తేయాకు తోటల్లో పనిచేయడానికి తూర్పు, మధ్య భారతదేశం నుంచి ప్రజల్ని అసోమ్‌కు తరలించారు. మరోవైపు 1905లో బెంగాల్ విభజన సమయంలో మొదలైన బెంగాలీల వలసలు మొన్న మొన్నటిదాకా కొనసాగుతూనే ఉన్నాయి. అందుకే దాదాపు 28 శాతం బెంగాలీ భాష మాట్లాడేవారు ఉన్నారు. మతపరంగానూ జనాభాలో తీవ్ర మార్పులు జరిగాయి. అసోమ్‌లో 1901లో 12 శాతంగా ఉన్న ముస్లిములు 2011కి 35 శాతానికి పెరిగారు. మొత్తం జనాభాలో అస్సామీ మాట్లాడేవారి సంఖ్య 50 శాతంకంటే తక్కువకు పడిపోయింది. ఇది అస్సామీయులను తీవ్ర మానసిక ఆందోళనకు గురిచేసింది. వారి భాష, సంస్కృతి, ఆచారాలు, సంప్రదాయాలు ఉనికి కోల్పోయే ప్రమాదమేర్పడిందని భావించారు. దాని పర్యవసానంగా కేంద్రం 1950లోనే అసోం వలసదారుల చట్టం తెచ్చింది. అయినా ఆశించిన ప్రయోజనం దక్కలేదు. ఎక్కడా లేనివిధంగా 1951 జనాభా లెక్కల ఆధారంగా 1951 అసోం జాతీయ జనాభా రిజిస్టర్‌ను తయారు చేశారు. కానీ, వలసల ప్రవాహం ఆగలేదు. 1947 విభజనతో వేధింపులకు గురైన హిందువులు తూర్పు పాకిస్థాన్ నుంచి శరణార్థులుగా అసోం, పశ్చిమ్‌బంగలకు రావడం మొదలైంది. పశ్చిమ పాకిస్థాన్ నుంచి ఒకేసారి ఉప్పెనలా కాకుండా అంచెలంచెలుగా వస్తూనే ఉన్నారు. 1971 బంగ్లాదేశ్ విమోచన పోరాటం ఈ ఉద్ధృతిని మరింత పెంచింది. వీటన్నింటి ఫలితంగా 1977లో 'ఆల్ అసోం స్టూడెంట్స్ యూనియన్ (ఆసు)' నాయకత్వాన విద్యార్థి పోరాటం మొదలై, పోనుపోను ప్రజాందోళనగా మారింది. 1980లో ఇందిరా గాంధీ హయాములో సుదీర్ఘ చర్చలు జరిగినా, పరిష్కారం లభించలేదు. చివరకు 1985 ఆగస్టు 15న 'అసోం ఒప్పందం' కుదిరింది. అప్పటి ప్రధాని రాజీవ్‌గాంధీ దిల్లీ ఎర్రకోట పైనుంచి ఈ విషయాన్ని ప్రకటించారు. అంతటితో సమస్యకు పరిష్కారం దొరికిందని అందరూ అనుకున్నారు.

అసోం ఒప్పందం ప్రకారం 1966 జనవరి ఒకటో తేదీని నిర్ణీత గడువు (కట్ ఆఫ్ డేట్)గా తీసుకున్నారు. అయినా 1971 మార్చి 24వ తేదీ అర్ధరాత్రి వరకు వచ్చినవారినీ కొన్ని షరతులతో పౌరులుగా కొనసాగించడానికి సమ్మతించారు. ఆపై అంటే బంగ్లాదేశ్ విమోచనను ప్రకటించిన తేదీనుంచి వచ్చినవారిని విదేశీయులుగా పరిగణిస్తారు. భారత్-బంగ్లాదేశ్ అంతర్జాతీయ సరిహద్దును పటిష్ఠపరచాలనీ ఆ ఒప్పందంలో ఉంది. అది అమలుకు నోచుకోలేదు. 2005లో అందుకు సూత్రప్రాయ ఆమోదం లభించింది. ఆ తరవాత మూడేళ్లకు 2009లో పౌరసత్వ నిబంధనల చట్టానికి సవరణ చేయగలిగారు. అంటే ఒప్పందం అమలుకు 24 సంవత్సరాల వరకు అడ్డంకులు తొలగలేదు. ఇది అన్నాళ్లూ అసోం ప్రజల సహనానికి పరీక్ష పెట్టినట్లే. వారికి కేంద్రం మీద ఆగ్రహం కలగడానికి ఇంతకన్నా సహేతుకమైన కారణం ఏం కావాలి?

చివరికి సమస్య సుప్రీంకోర్టుకు వెళ్ళింది. 2009లో దీనిపై వేసిన పిటిషన్ 2013లో విచారణకు వచ్చింది. 2013 ఆగస్టు నుంచి 2019 ఆగస్టు వరకు సుప్రీంకోర్టు విచారణ సాగింది. మొత్తం 59 ఆదేశాలు ఇచ్చింది. ప్రస్తుత అసోం ముఖ్యమంత్రి సర్బానంద సోనోవాల్ రెండుసార్లు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను అత్యున్నత న్యాయస్థానం పరుగులు పెట్టించింది. విశేషమేమంటే 2013లో ఈ కేసు విచారణ బెంచ్‌లో ప్రస్తుత భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ ఉన్నారు. ఇప్పుడు కూడా ప్రధాన న్యాయమూర్తిగా ఈ కేసుపై విచారణ జరుపుతున్నారు. జస్టిస్ రంజన్ గొగోయ్ అసోమ్‌కి చెందిన వ్యక్తి కావడంతో సమస్య మూలాలను మరింత లోతుగా అర్థం చేసుకోగలరని భావించవచ్చు.

ఈ ప్రక్రియ కోసం ఇప్పటివరకు రూ.1,200 కోట్ల వరకు ఖర్చయినట్లు అంచనా. 50 వేలమంది ఉద్యోగులు, ఎనిమిది వేల మంది కంప్యూటర్ ఆపరేటర్లు, 1,200 మంది వ్యక్తిగత సిబ్బంది, 2,500 సేవాకేంద్రాల సిబ్బంది కొన్నేళ్లుగా పనిచేస్తున్నారు. చివరి ముసాయిదా ప్రతిని 2018 జూన్ 30న ప్రచురించారు. దీనిప్రకారం మొత్తం 3.29 కోట్ల జనాభాలో 2.9 కోట్ల మందికి మాత్రమే జాబితాలో చోటుదక్కింది. అంటే సుమారు 40 లక్షల మంది సాంకేతికంగా విదేశీయులన్నమాట. అందువల్లే నేడు వెల్లడించబోయే తుది జాబితాకోసం అందరూ ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు.

**నేడు జాతీయ పౌర పట్టిక విడుదల**

**ఆందోళనలో 40 లక్షల మంది ప్రజలు**

ఇప్పటికే జాతీయ జనాభా రిజిస్టర్ ముసాయిదాపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వమూ ఈ ప్రక్రియపై పెదవి విరుస్తోంది. ఇందులో రాష్ట్రప్రభుత్వం జోక్యం చేసుకోరాదని 2017 జులైలో సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రంలోని భారతీయ జనతా పార్టీ ఈ ప్రక్రియపై పూర్తి అసంతృప్తితో ఉంది. బంగ్లాదేశ్ సరిహద్దు జిల్లాల్లో అక్రమ వలసదారులు అతితక్కువగా ఉండటం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. అనేకమంది బంగ్లాదేశీయులు జాబితాలో చేరారని, ఎంతోమంది అమాయకులైన స్థానికులకు జాబితాలో చోటుదక్కలేదని ఆరోపిస్తున్నారు. జాబితా తప్పుల తడకగా తయారైందని ప్రజలూ వాపోతున్నారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల మళ్ళీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. మరోసారి తనిఖీకి అనుమతి ఇవ్వాలని కోరింది. అందుకు సుప్రీంకోర్టు ఒప్పుకోలేదు. ఈ నేపథ్యంలో ప్రజలు ఎలా స్పందిస్తారోనని రాష్ట్రప్రభుత్వం ఆందోళన చెందుతోంది.

## ఉపశమన చర్యలు

శాంతిభద్రతల పరిరక్షణకు కేంద్రబలగాలను రాష్ట్ర ప్రభుత్వం కోరింది. మరోవైపు జాబితాలో లేనివారి కోసం ఉపశమన చర్యలూ చేపట్టింది. జాబితాలో లేకపోయినా ఎవరినీ వెంటనే విదేశీయులుగా పరిగణించబోమని ప్రకటించింది. విదేశీయుల గుర్తింపుపై ట్రైబ్యునల్‌లో తీర్పు వచ్చేవరకు ఎటువంటి చర్యలు ఉండవని స్పష్టీకరించింది. ఎవరినీ నిర్బంధించబోమంటూ హామీ ఇచ్చింది. ప్రస్తుతం అందుతున్న సంక్షేమ పథకాలు, ఇతర సౌకర్యాల నుంచి ఎవరికీ మినహాయింపు ఉండదని, వారి పిల్లలకు విద్య, పౌరసత్వం తదితర అంశాల్లో ఎటువంటి ఆటంకాలూ ఉండవని ప్రకటించింది.

జాబితాలో లేనివారు ట్రైబ్యునల్‌లో, తరవాతి దశలో హైకోర్టులో అప్పీలు చేసుకుని న్యాయం పొందడానికి అవసరమయ్యే మొత్తం వ్యయాన్ని తామే భరిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటికే 200 ట్రైబ్యునళ్లను నియమించింది. మరో 200 ట్రైబ్యునళ్లను నియమించడానికి సిద్ధపడుతోంది. ట్రైబ్యునల్‌లో అప్పీలు సమయాన్ని 60 రోజుల నుంచి 120 రోజులకు పెంచడంతోపాటు జిల్లా న్యాయ సహాయ సంఘాలను సంఘటితపరచింది. ప్రభుత్వం ఇన్ని ఉపశమన చర్యలు ప్రకటించినా ఉద్రిక్తతల విషయంలో ఆందోళన వ్యక్తమవుతూనే ఉంది. దాదాపు 40 లక్షల మందిని ఒక్కసారి విదేశీయులుగా ప్రకటించడం అసోం ఒప్పందం ప్రకారం జరిగినా- ఈ చర్య సహజంగానే ఉద్రిక్తతలకు దారి తీస్తుంది. ఇంత భారీప్రక్రియలో తప్పులు చోటు చేసుకోవడం సహజమే. అవే ఇప్పుడు ప్రజలపాలిట శాపాలుగా మారే ప్రమాదముంది. భవిష్యత్తులో రాబోయే పౌరసత్వ సవరణ బిల్లుపైనా పెద్దయెత్తున దుమారం చెలరేగుతోంది. ఆ బిల్లు తాజా జాబితాలో లేనివారిని రెండు రకాలుగా విభజిస్తుంది. పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లో దుర్విచక్షణకు, వేధింపులకు గురై పారిపోయి వచ్చిన ముస్లిమేతర వలసదారులను శరణార్థులుగా, మెరుగైన ఉపాధి అవకాశాలు వెతుక్కుంటూ వచ్చిన పొరుగు దేశ ముస్లిములను అక్రమ వలసదారులుగా ఇది వర్గీకరిస్తుంది. దేశవ్యాప్తంగా వివాదాలు రేకెత్తడానికి అవకాశమున్న అంశమిది. రాబోయే పార్లమెంటు సమావేశాల్లో ఈ బిల్లును తీసుకురావచ్చని భావిస్తున్నారు. అటు కశ్మీర్, ఇటు అసోమ్‌లో చోటుచేసుకుంటున్న తాజా పరిణామాలు చివరకు ఎలా పరిణమిస్తాయోనన్న ఆందోళనే దేశ ప్రజల్లో వ్యక్తమవుతోందిప్పుడు!

(రచయిత- సామాజిక విశ్లేషకులు)





ఎన్ఆర్‌సీ కేంద్రం వద్ద పేరు నమోదు కోసం బారులు తీరిన ప్రజలు (పాతచిత్రం)

### కలగూరగంప జాబితా





జాతీయ జనాభా రిజిస్టర్‌లో అసోం ఒప్పందానికి అనుగుణంగా మార్పులు, చేర్పులు (అప్‌డేషన్) ఎలా చేశారనేదే ఈ మొత్తం ప్రక్రియలో కీలకం. ముందుగా దీనికి 1951 జాతీయ జనాభా రిజిస్టర్‌ను ఆధారంగా తీసుకున్నారు. ఆ తరవాత ఒప్పందం ప్రకారం 1971 మార్చి 24 వరకు ఏదైనా ఓటర్ల జాబితాలో పేరు ఉంటే దాన్ని ఆమోదించారు. ఆపై ఈ రెండింటి ప్రకారం జాబితాలో పేర్లు ఉన్నవారి రక్త సంబంధీకులను చేర్చారు. ఇవేమీ లేనివారు 1971 మార్చికి ముందు ఇంకేవైనా పత్రాలు చూపగలిగితే వారినీ జాబితాలో చేర్చారు. విశేషమేమంటే 1951 జాతీయ జనాభా రిజిస్టర్‌లో లేనివారంతా పైన చెప్పిన ప్రక్రియ ద్వారా నమోదు చేసుకొని వారి పౌరసత్వాన్ని నిరూపించుకోవాలి. నిరక్షరాస్యులు, నామమాత్రపు చదువు ఉన్నవారు అధికంగా ఉన్న దేశంలో ఇదెంత కష్టమో అర్థం చేసుకోవచ్చు.

# ఉపాధికి ఊతంగా అభివృద్ధి

దేశాన్ని దారిద్ర్య సంకెళ్ల నుంచి విముక్తం చేయగలిగితేనే నవభారతం ఆవిష్కృతమవుతుందని స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధాని మోదీ అభిప్రాయపడ్డారు. వివిధ కార్యక్రమాల ద్వారా గత అయిదేళ్లలో అనేక మందిని పేదరికం బారి నుంచి తప్పించామన్నారు. 2022 నాటికి పేదరికాన్ని పూర్తిగా నిర్మూలిస్తామని ప్రధాని రెండేళ్ల క్రితం తన సంకల్పాన్ని ప్రకటించారు. దేశవ్యాప్తంగా దారిద్ర్య స్థాయులను తెలిపే తాజా అధికారిక సమాచారమేదీ అందుబాటులో లేదు. కుటుంబ వినియోగ వ్యయాల మీద జాతీయ నమూనా సర్వే సంస్థ జరిపే అధ్యయనాల ఆధారంగా ఈ గణాంకాలను రూపొందిస్తారు. 2011-12 తరవాత ఇలాంటి సర్వే ఏదీ జరగలేదు. పేదలెంత మంది ఉన్నారో, పేదరికం తగ్గుతోందో పెరుగుతోందో పక్కాగా తెలియని పరిస్థితుల్లో పేదరిక నిర్మూలన ఎలా సాధ్యం?

ప్రణాళిక సంఘం 2011 సెప్టెంబరులో సుప్రీంకోర్టులో ఓ ప్రమాణపత్రం దాఖలు చేస్తూ 40.74 కోట్ల పేదలు ఉన్నారని వెల్లడించింది. పట్టణాల్లో రూ.32, గ్రామాల్లో రూ.26 లోపు రోజుకు ఖర్చు చేసేవారిని 'పేదలు'గా లెక్కించినట్లు తెలిపింది. దారిద్ర్య ప్రమాణాల గణన మీద సమీక్షకు సి.రంగరాజన్ నేతృత్వంలో ఏర్పాటైన సంఘం 2014 జూన్‌లో కేంద్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. పట్టణ ప్రాంతాల్లో రూ.47, పల్లెల్లో రూ.32 లోపు ఖర్చు చేసేవారిని పేదలుగా భావించాలని సిఫార్సు చేసింది. ఈ లెక్కన 36.3 కోట్ల పేదలు ఉన్నారని తేల్చింది. ఈ ఏడాది జులైలో విడుదలైన ఐక్యరాజ్య సమితి అభివృద్ధి కార్యక్రమం (యూఎన్‌డీపీ) 'ప్రపంచ బహుమితీయ దారిద్ర్య సూచిక- 2019' ప్రకారం 2006-2016 మధ్య మన దేశంలో 27.1 కోట్ల మంది దారిద్ర్యం నుంచి బయటపడ్డారు! కుటుంబ ఆదాయంతో పాటు ఆరోగ్య స్థితిగతులు, అందుబాటులో ఉన్న పని నాణ్యత తదితరాలు ఈ సూచీకి ఆధారాలు. ఈ నివేదిక ప్రకారం భారతీయుల్లో ఇంకా 36.9 కోట్ల మంది పేదరికంలో మగ్గిపోతున్నారు. ప్రణాళిక సంఘం, రంగరాజన్ సంఘం లెక్కలకూ ఈ యూఎన్‌డీపీ అంచనాలకూ పొంతన లేదన్నది సుస్పష్టం. దారిద్ర్య స్థితిగతుల సమాచారం మీద నెలకొన్న ఈ గందరగోళాన్ని తొలగించడానికి గత అయిదేళ్లలో ప్రభుత్వపరంగా జరిగిన ప్రయత్నమేదీ లేదు. ప్రణాళిక సంఘాన్ని రద్దుచేసి నీతి ఆయోగ్‌ను ఏర్పాటు చేసిన కొత్తల్లో కేంద్ర ప్రభుత్వం ఈ విషయం మీద శ్రద్ధ పెట్టింది. నీతిఆయోగ్ అప్పటి ఉపాధ్యక్షులు అరవింద్ పనగరియా నేతృత్వంలో 'భారత్‌లో పేదరిక నిర్మూలన' మీద ఓ కార్యదళాన్ని (టాస్క్‌ఫోర్స్‌ను) నియమించింది. పేదరికాన్ని నిర్వచించడం, నిర్మూలనకు ఓ కార్యాచరణ ప్రణాళిక రూపొందించడం, రూపుమాపడానికి తగిన కార్యక్రమాలు సూచించడం... తదితర లక్ష్యాలను దానికి నిర్దేశించింది. 2016 జులైలో ఈ కార్యదళం నివేదికను సమర్పించింది. పేదరికాన్ని గణించడం గురించి ఈ బృందం నిర్దిష్ట సూచనలేవీ చేయలేదు. ఇప్పటివరకూ దారిద్ర్య గణనకు ఉపయోగిస్తున్న పద్ధతులను వివిధ కోణాల్లో పరిశీలించిన వీరి నివేదిక, ఈ అంశం మీద మరింత లోతైన అధ్యయనానికి నిపుణుల సంఘాన్ని నియమించాలని సూచించింది. పేదరికాన్ని నిర్మూలించడానికి, ఉపాధికల్పనకు ఊతమిచ్చే సుస్థిరాభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని చెప్పింది. ఈ నివేదిక ఇంకా ప్రభుత్వ పరిశీలనలోనే ఉంది! మరోవైపు, దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారి సంఖ్యను తేల్చడానికి ప్రభుత్వం నిర్ణయించిందని కేంద్ర ప్రణాళిక, గణాంకాల శాఖ మంత్రి రావు ఇంద్రజిత్ సింగ్ జులై 10న లోక్‌సభలో ప్రకటించారు. ఈ సర్వే విధివిధానాలు ఖరారై, గణన పూర్తయి, నివేదికలు సిద్ధమై వాటి ఆధారంగా ఓ కార్యాచరణ ప్రణాళిక రూపొందేసరికి పేదరిక నిర్మూలనకు పాలకులు నిర్దేశించుకున్న గడువు మీరిపోతుంది!



పేదరికానికి విరుగుడు మందు

పేదల్లో 80 శాతం గ్రామీణ ప్రాంతాల్లోనే నివసిస్తున్నారని నీతిఆయోగ్ పేర్కొంది. ప్రత్యక్షంగా, పరోక్షంగా వీరి జీవనోపాధికి వ్యవసాయమే ఆధారం. గడచిన అయిదేళ్లలో వ్యవసాయ రంగ సమస్యలు తీవ్రమయ్యాయేగాని తగ్గలేదు. దేశ రాజధానిలో అన్నదాతలు నిర్వహించిన భారీ ప్రదర్శనలే దీనికి తార్కాణం. ఉపాధికల్పనకు దోహదపడే అభివృద్ధి వల్లే పేదరికం తగ్గుతుందని నీతిఆయోగ్ చెబుతోంది. వాస్తవం అందుకు భిన్నంగా ఉంది. దేశంలో నిరుద్యోగ సమస్య నాలుగున్నర దశాబ్దాల గరిష్ఠ స్థాయికి చేరిందని ప్రభుత్వ సర్వేలు స్పష్టీకరిస్తున్నాయి. నోట్లరద్దు, జీఎస్టీతో వ్యవసాయం తరవాత ఎక్కువ మందికి ఉపాధి కల్పించే సూక్ష్మ, చిన్న మధ్యతరహా పరిశ్రమలు దెబ్బతిన్నాయి. ఒక్క సూరత్ వస్త్ర పరిశ్రమలోనే నాలుగు లక్షల ఉద్యోగాలు పోయినట్లు అక్కడి వస్త్ర వ్యాపారుల సమాఖ్య వెల్లడించింది. అఖిల భారత తయారీదారుల సమితి సర్వే ప్రకారం 2014-2018 మధ్యలో వర్తక రంగంలో 43 శాతం, సూక్ష్మ పరిశ్రమల్లో 32 శాతం, చిన్న పరిశ్రమల్లో 35 శాతం ఉద్యోగాలు పోయాయి. ఈ పరిస్థితుల్లో పేదరికం తగ్గిందని, వచ్చే మూడేళ్లలో పూర్తిగా రూపుమాసిపోతుందని ఎలా విశ్వసించగలం?

'ముద్ర' పథకం పేదల జీవితాల్లో గణనీయ మార్పులు తీసుకొచ్చిందని, వారిని వ్యాపారవేత్తలుగా మార్చుతోందని ప్రధాని మోదీ నిరుడు వ్యాఖ్యానించారు. ఈ పథకం కింద ఈ ఏడాది జులై 12 నాటికి 19.24 కోట్ల మందికి రూ.9.45 లక్షల కోట్ల మేరకు రుణాలు మంజూరు చేశారు. లబ్ధిదారుల్లో ఎక్కువమందికి అందిన సగటు రుణ మొత్తం రూ.25 వేలకు మించి లేదు. ఈ కాస్త మూలధనంతో వారు ఏ వ్యాపారాన్ని ప్రారంభించి నిలదొక్కుకోగలరు? కాబట్టి పేదరిక నిర్మూలనకు 'ముద్ర' దోహదపడుతోందన్నది వట్టిమాటే! 'ఆర్థిక విధానాల ఏకైక లక్ష్యం అభివృద్ధి మాత్రమే కాజాలదు. ఆ అభివృద్ధి ఫలాలు అన్ని వర్గాలవారికీ సమానంగా అందాలి. పేదరిక నిర్మూలనే దేశ ఆర్థిక విధానాల ముఖ్య లక్ష్యం కావాలి' అన్న సి.రంగరాజన్ మాటలను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుత ఆర్థిక విధానాల్లో మార్పుచేర్పులు చేస్తే తప్ప పేదరికం తగ్గదు. ఉద్యోగాల్లేని అభివృద్ధికి మారుగా ఉపాధికల్పనకు ఊతమిచ్చే విధానాలకు రూపకల్పన చేయడంతోపాటు వ్యవసాయ రంగంలో నెలకొన్న సంక్షోభాన్ని రూపుమాపడానికి చర్యలు తీసుకుంటేనే పేదల జీవితాల్లో నిజంగా వెలుగులు నిండుతాయి!

– సత్య భారతి

## ఈనాడు లేఖలు

### 'పాము కాటు'కు మందు కొరత

తెలుగు రాష్ట్రాల్లో పాముకాటు ఉదంతాలు తరచూ జరుగుతున్నాయి. ఖరీఫ్ పనుల్లో నిమగ్నమైన రైతులు, రైతు కూలీలు అనేక మంది పాము కాటుకు బలవుతున్నారు. గ్రామాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సరైన సౌకర్యాలు, చికిత్స అందుబాటులో లేకపోవడంతో పాము కాటుకు గురైన రైతులు పట్టణాలకు చేరేలోపే ప్రాణాలు కోల్పోతున్న సంఘటనలు అనేకం. ఈ పరిస్థితి నుంచి వారిని కాపాడాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనూ పాము కాటుకు విరుగుడు మందును అందుబాటులో ఉంచాలి. తద్వారా తక్షణమే చికిత్స అంది అన్నదాతలు ప్రాణాపాయం నుంచి బయటపడతారు. మందులు సరఫరా చేసినట్లు అధికారులు చెబుతున్నా, ఇంకా అన్ని పీహెచ్‌సీలకూ అవి చేరలేదు. వర్షకాలానికి ముందే అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో పాము, తేలు కాటుకు మందులను అందుబాటులో ఉంచాల్సిన ఆవశ్యకత ఎంతో ఉంది.

- బి.తిరుపతిరెడ్డి, హైదరాబాద్

### యురేనియం తవ్వకాలపై పునరాలోచన

నల్లమల అడవుల్లో యురేనియం నిక్షేపాల అన్వేషణకు కేంద్రం అనుమతి రావడంతో గిరిజనుల్లో ఆందోళన మొదలయింది. ఇప్పటికే యురేనియం వెలికితీతవల్ల ఎదురవుతున్న తీవ్ర పరిణామాల గురించి భయంకరమైన వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వాలు ఇంకా ఆ దిశగా ఆలోచించడం సముచితం కాదు. యురేనియం అన్వేషణలో భాగంగా ఆమ్రాబాద్ అడవుల్లో డ్రిల్లింగ్ పనులు ప్రారంభమయ్యాయి. యురేనియం వెలికితీత పనులు ప్రారంభమైతే అటవీ ప్రాంతమంతా విషతుల్యమవుతుందని గుర్తించాలి. వన్యమృగాల మనుగడకూ ముప్పు వాటిల్లుతుందని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వం ఈ విషయంలో పునరాలోచన చేయాల్సిన అవసరం ఉంది.

- కొత్తపల్లి శ్రీకాంత్, గోపాలపురం, ఖమ్మంజిల్లా

## అంతర్యామి

# కష్టం-సుఖం

'బంధ మోక్షాలకు కారణం మనసే' అని వేదాంతులు స్పష్టం చేశారు. మనసు విషయాసక్తమైతే బంధానికి, విషయాసక్తం కాకపోతే ముక్తికి కారణమని 'మైత్రి ఉపనిషత్' వివరించింది. ఈ మనసే సర్వ జగత్తూ! మన జీవితం స్వర్గంలా అనిపించినా, నరకంలా కనిపించినా అదంతా మనసు మహిమే! మనసే కోరికల పుట్టిల్లు. కోరికలు తీరితేగాని మనిషి సంతోషంగా ఉండడు. ఇందుకోసం మనిషి ఎన్నో ప్రయత్నాలు చేస్తూఉంటాడు. ఆ ప్రయత్నాల్లో కొన్ని ఫలిస్తాయి. అదే సుఖం. ఫలించకపోతే దుఃఖం. అనుకున్నది పొందితే లాభం. పొందకపోతే నష్టం. సుఖదుఃఖాల గుట్టు ఇదే... లాభనష్టాల రహస్యమూ ఇదే!

పాశ్చాత్య తత్వశాస్త్రాలు మనసును, బుద్ధిని ఒకే గాట కట్టేశాయి. ఈ రెండింటినీ సమానార్థకాలుగా భావించి ప్రయోగించారు. మన తాత్వికులు అహంకారం, చిత్తం, మనసు, బుద్ధి, జ్ఞానం- వీటిని అహంకార పంచకంగా పేర్కొంటారు. మనసు చేసే పనులను చిత్తవృత్తి అంటారు. యోగం అంటే చిత్తవృత్తిని నిరోధించడం. అభ్యాసం, వైరాగ్యాల చేత చిత్తవృత్తిని నిరోధించవచ్చని యోగదర్శనం చెబుతున్నది. మనసు లక్షణాలు సంకల్పం, సంశయం, శ్రద్ధ, అశ్రద్ధ, ధృతి, అధృతి, లజ్జ, జ్ఞానం, భయం. ఇవే కష్టసుఖాల అనుభూతులకు కారణం.

మనసుకు ఇష్టాలు, అయిష్టాలు ఉంటాయి. ఇష్టమైన పని చేసేటప్పుడు మనసుకు ఆహ్లాదంగా ఉంటుంది. సుఖదుఃఖాలే 'సంసారం' అంటే! సుఖదుఃఖాలు స్థిరంగా ఉండవు. అసలు భౌతికమైనవే స్థిరంగా ఉండవు. వస్తూ పోతూ ఉండటం వాటి లక్షణం. సంపద వల్ల సుఖం కలుగుతుందనేది భ్రాంతి మాత్రమే. ఓడలు బళ్లు, బళ్లు ఓడలు కావడం ఎంత సేపు? కష్టానికి సుఖానికి ఉల్లిపొరంత తెరే అడ్డం. ఉన్నదానితో తృప్తిపడేవాడికి అంతా సుఖమే!

మానవుడు తనకు అధిక సుఖం కలిగినప్పుడు అంతా తన తెలివి అని తెగ మురిసిపోతాడు. కష్టం కలిగితే దానికి కారణం ఇంకెవరో అని నిందిస్తాడు. తత్వం తెలిసినవాళ్లు కష్టసుఖాలు రెండింటినీ సమానంగా చూస్తారు.

మహాభారత శాంతిపర్వంలో కష్టసుఖాల గురించి పలుచోట్ల చర్చలు వస్తాయి. భీష్ముడు ధర్మరాజును ఓదారుస్తూ అనేక ధర్మాలను ఉపదేశిస్తాడు. 'సుఖం తరవాత దుఃఖం, అలాగే మళ్లా సుఖం, ఆ తరవాత దుఃఖం వస్తూ పోతూ ఉంటాయి. మనిషి నిత్యం సుఖమే పొందడు. నిత్యం దుఃఖాన్నే పొందడు. సుఖం వచ్చినా, దుఃఖం వచ్చినా మనం వాటిని అనుభవించాలి. అంతేగాని లొంగిపోకూడదు. నీ కుమారులకుగాని, భార్యకుగాని కొంచెం కష్టం కలిగే పని చేసి చూడు. అప్పుడు... ఎవరెవరో... ఎవరికి ఎవరో నీకు బాగా తెలిసిపోతుంది. 'వీళ్ల కోసమా నేను కష్టపడుతున్నది' అనే జ్ఞానం కలుగుతుంది. నీ దుఃఖం కొంత ఉపశమిస్తుంది' అని ఉద్బోధిస్తాడు.



ఈ లోకంలో రెండు రకాలవాళ్లు సుఖంగా ఉంటారు. మూఢులు, అధిక జ్ఞానం గలవారు... వీళ్లు నిత్యసంతోషులు. మధ్యరకం మనుషులకే ఈ కష్టాలన్నీ! ప్రాణులకు సుఖం కలిగినా, కష్టం కలిగినా అనుభవించి తీరాల్సిందే. ఆసనం, శయనం, వాహనం, భోజనం... ఇవన్నీ కాలానుసారం జరగవలసిందే! ఒక ధనవంతుడు యౌవనంలో మరణిస్తాడు. పేదలు పలురోగాలతో బాధపడుతూ నూరేళ్లు జీవిస్తారు. ధనవంతుల్లో కొందరికి తిన్నా అరగదు. దరిద్రుడికి కర్రముక్క తిన్నా అరిగిపోతుంది! శీతం, ఉష్ణం, వర్షం... ఇవన్నీ కాలాన్నిబట్టి మారుతూ ఉంటాయి. సుఖదుఃఖాలూ అంతే! ఏ మానవుడూ స్వర్గం చూసిరాలేదు, నరకమూ చూడలేదు. సత్పురుషులకు శాస్త్రమే నేత్రం. కష్టసమయాల్లో ధర్మశాస్త్రాలు, పెద్దల మాటలే మానవుడికి చేయూతనిచ్చి దారి చూపిస్తాయి!

– డాక్టర్ పులిచెర్ల సాంబశివరావు

**ఒకప్పుడు తెల్లవారిని తరిమేందుకు..**
**క్విట్ ఇండియా.. క్విట్ ఇండియా అన్నాం!**
**ఇప్పుడు మనలోని అలసత్వాన్ని తరిమేందుకు**
**ఫిట్ ఇండియా... ఫిట్ ఇండియా.. అనే టైమ్ వచ్చింది. అదీ ఓ ఉద్యమంలా! జాగో యువతా అంటూ ప్రధాని మోదీనే ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. మరి, ఎందుకు ఆలస్యం? 'ఫిట్ ఇండియా ఉద్యమం'లో చురుకుగా ముందడుగు వేసేందుకు మీరు సిద్ధమా?**



## ఫిట్ ఇండియా

# ఇప్పుడు కాక ఇంకెప్పుడు?

.. **ఇలా** ఫిట్‌నెస్‌పై కొత్తసంవత్సరానికో, పుట్టిన రోజు నాడో అనేక రిజల్యూషన్స్ ఎప్పటికప్పుడు తీసుకుంటాం. వారం.. పది రోజులు శ్రద్ధగా చేస్తాం. తర్వాత మళ్లీ మామూలే. ఫిట్‌నెస్ కథ కంచికి.. మన జీవనశైలి రొటీన్‌కి వచ్చేస్తుంది. ఈ కోవలోకి వచ్చే యువత శాతం ఎంతో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఈ అలసత్వం నుంచి బయట పడాలంటే ఫిట్‌నెస్‌ని ఓ ఉద్యమంలా స్వీకరించాల్సిందే. అందుకు మానసికంగా సిద్ధం కావాలి. మనం ఫిట్‌గా ఉన్నప్పుడే దేశం దృఢంగా ఉంటుందని పీఎం చెప్పిన సూచనని నిజం చేయాలి. అంతటి సంకల్పాన్ని స్వీకరించాలంటే ఎలా? చదువు, ఉద్యోగం.. దేంట్లో నిమగ్నమై ఉన్నా ఫిట్‌నెస్‌ని దాంట్లో భాగం అయ్యేలా చేసేందుకు ఏం చేయాలి? ఐఫోన్‌ని కాసేపు పక్కన పెట్టి మీలో 'ఐ'పై ఫోకస్ చేయండి. రోజూ మిమ్మల్ని మీరే ఛార్జ్ చేసుకోండి. అప్పుడే.. ఆరోగ్యమనే అయాన్ దృఢంగా పని చేస్తుంది. పంచేంద్రియాల ఓఎస్ ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతుంది.

### 'ఛార్జ్' చేయండి..

ఐఫోన్ అయినా.. ఆండ్రాయిడైనా.. లేవగానే ఫోన్ నోటిఫికేషన్స్ చెక్ చేయడం. వెంటనే ఛార్జింగ్ పెట్టేయడం. రోజూ క్రమం తప్పకుండా చేసే పని. ఎందుకంటే.. రోజంతా ఫోన్ పని చేయాలి మరి, మీ పరిస్థితి ఏంటి? మిమ్మల్ని మీరెలా ఛార్జ్ చేసుకుంటున్నారు? లేవగానే.. బ్యాటరీ అయాన్ల మాదిరిగానే మీలోని కణాలు రీఛార్జ్ అవ్వాలి. అప్పుడే శరీరం రీఛార్జ్ అవుతుంది. ఇలాగైతేనే రోజంతా చురుకుగా పని చేస్తారు.

### అంగుళాల తెర దాటాలి..

పని ఒత్తిడి అనిపిస్తే అంగుళాల తెరపై కాసేపు పబ్‌జీనో.. మరేదైనా గేమో ఆడితే ఏమొస్తుంది? ఫోన్‌లో ఛార్జింగ్ శాతం తగ్గినట్టుగానే.. మీలో ఎనర్జీ తగ్గి కళ్లు ఎండిపోయి ముఖంలో బ్రైట్‌నెస్ తగ్గుతుంది. అదే అంగుళాల తెరని దాటుకుని గ్రౌండ్‌కి వెళ్తే.. క్రికెట్ బ్యాటో.. టెన్నిస్ రాకెట్టో పడితే.. ఆటలో మజా మీలోని హార్డ్‌వేర్ పనితనాన్ని పెంచుతుంది. ఎనర్జీ బ్యాక్అప్ అవుతుంది. దీంతో చదువైనా.. ఉద్యోగమైనా.. చురుకుదనానికి మీరే చిరునామా అవుతారు.

### ఇంద్రియాల ఓఎస్ అప్‌డేట్

ఫింగర్ ప్రింట్ స్కానర్, కీప్యాడ్, అలెక్సా, సిరి, కెమెరా.. ఫోన్‌కి అవన్నీ ఇంద్రియాల్లా ఎలా పని చేస్తాయో.. మీకున్న పంచేంద్రియాలు అంతే. సాఫ్ట్‌వేర్ అప్లికేషన్స్‌లా పని చేస్తూ.. హార్డ్‌వేర్‌తో అనుసంధానం అవుతాయి. మరి, మీలోని హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ చురుగ్గా పని చేయాలంటే? మెదడనే ఓఎస్ ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవ్వాలి. అందుకు మెదడుకి కావాల్సిన ఇన్‌పుట్స్ ఎక్కడ దొరుకుతాయి? చుట్టూ ఉన్న ప్రపంచం నుంచే. రోజులో నడుస్తూ ఓ 2,000 అడుగులైనా వేయండి. దీంతో మెదడు శరీరంలోని సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్‌లను వాడుకుని విలువైన అప్‌డేట్స్‌ని మీకు అందిస్తుంది. దీంతో మీరు నిత్య నూతనంగా కనిపిస్తారు.

### వైరస్‌ల దాడులు..

సరైన అవగాహన లేకుండా, భద్రతాపరమైన జాగ్రత్తలు తీసుకోకుండా ఫోన్‌ని వాడితే ఏం జరుగుతుంది? ఫోన్ హ్యాంగ్ అవ్వొచ్చు. హ్యాకర్ల దాడులు పెరగొచ్చు.. అందుకే ముందు జాగ్రత్తగా క్లీనింగ్ టూల్స్ వాడతాం.. యాంటీవైరస్‌లను ఇన్‌స్టాల్ చేస్తాం. మరి, మీ బాడీ సిస్టం హ్యాంగ్ అవ్వకుండా.. వైరస్‌ల బారిన పడకుండా ఏం జాగ్రత్తలు తీసుకుంటారు? వెంటనే.. యోగా, ధ్యానం లాంటి టూల్స్‌తో క్లీనింగ్ చేయండి. రోజూ ఏదో ఒక యాంటీవైరస్ క్రీడని ఆడుతూ శరీరంలో ప్రవేశించడానికి ప్రయత్నించే స్పైవేర్‌లను అడ్డుకోండి.



### శరీరంపై బాధ్యత ఉండాలి

చదువు, ఉద్యోగం, పిల్లలు.. ఇలా అన్నింటిపై బాధ్యతగా వ్యవహరించే మనం.. మన శరీరంపై ఎందుకు బాధ్యత వహించం? ఇక్కడి నుంచే ఆలోచన మొదలవ్వాలి. ఇంటిల్లిపాదీ ఫిట్‌నెస్‌ని కూడా ఓ బాధ్యతగా తీసుకోవాలి. వ్యాయామం, ఇష్టమైన క్రీడ.. ఏదో ఒకటి దినచర్యలో భాగం అవ్వాలి. వయసు, జీవనశైలి ఆధారంగా వర్క్అవుట్స్‌ని మొదలుపెట్టాలి. నడకతో మొదలెట్టి నెమ్మదిగా జాగింగ్ చేయొచ్చు. మీకున్న సామర్థ్యాన్ని బట్టి అవుట్‌డోర్‌లో రన్నింగ్ చేయండి. మీరు డ్యాన్స్ లవర్ అయితే ఏరోబిక్స్, జుంబా, బోక్వా.. లాంటివి ఎంచుకుని చిందేస్తూ వ్యాయామాన్ని ఫన్‌గా మార్చేయొచ్చు. దేన్ని ఎంపిక చేసుకున్నా వారంలో కనీసం మూడు రోజులు సాధన చేయాలి. ఫంక్షనల్ ట్రెయినింగ్, క్రాస్ ఫిట్.. లాంటివి ఎంచుకుని ట్రైనర్స్ ఆధ్వర్యంలో సాధన చేయొచ్చు.

- తినే ఆహారంలోనూ కొన్ని నియమాలు పెట్టుకోవాలి. వాటిల్లో ప్రధానమైంది 'టైమ్‌కి తినడం'. అల్పాహారం, భోజనం, స్నాక్స్.. ఏదైనా (3 మీల్స్, 3 స్నాక్స్) పద్ధతిని ఫాలో అవ్వొచ్చు. తక్కువ పరిమాణంలో ఎక్కువ సార్లు తినాలి. తక్కువ కేలరీల్లో పోషకాలున్న ఆహారాన్ని తీసుకోవడం ద్వారా బరువు తగ్గొచ్చు.
- కొవ్వుని తగ్గించుకోవడమే ఫిట్‌నెస్‌ని సాధించడం. అంతేగానీ.. కండల్ని కరిగించడం కాదు. కొవ్వు పేరుకోని కండలు శరీరానికి మేలే చేస్తాయి. దృఢమైన కండలు ఎముకలకి రక్షణ కల్పిస్తాయి. అందుకే.. కొవ్వుని కరిగిస్తూ కండల్ని దృఢ పరుచుకోవడమే ఫిట్‌నెస్. దీంతో జీవక్రియలు (మెటబాలిజమ్) మెరుగుపడతాయి.
- రోజుల్లో.. వారాల్లోనే సన్నబడిపోవాలి అని తొందరపాటుతో ఏవో ప్రయత్నాలు చేయడం.. నిరుత్సాహంతో ఆపేయడం.. ఇలాగైతే, ఎప్పటికీ మీరు ఫిట్ కాలేరు. రోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. వర్క్అవుట్స్ చేసే క్రమంలో ఓపిక చాలా అవసరం. రోజువారీ జీనవశైలిలో వ్యాయామాన్ని భాగం చేయాలి. ఆశించిన ఫలితాలు కనిపించట్లేదు అనుకుంటే శరీరతత్వాన్ని విశ్లేషించి భిన్నమైన వర్క్అవుట్స్‌ని చేయాలి.
- తగినంత ఆహారం, ఎక్కువ నీళ్లు, హాయి నిద్ర, ఒత్తిడికి దూరంగా ఉండడం ద్వారా శరీరం ఎప్పటికప్పుడు రీఛార్జ్ అవుతుంది.

– బాబీ, ఫిట్‌నెస్ ట్రైనర్

- మామ.. ఏది ఏమైనా పొట్ట కరిగించి సిక్స్ ప్యాక్ చేయాల్రా!
- దేవ్డా.. ఏది తిన్నా. అక్కడికే వచ్చి చేరుతోంది. మోడ్రన్ దుస్తులు ధరించడం కుదరడం లేదు. ఎలాగైనా సన్నబడాలి.
- జిమ్‌కి వెళ్లి కండలు పెంచడం మన వల్ల కాదుగానీ.. యోగా చేసి శరీరం, మనసుని మన నియంత్రణలో ఉంచుకోవాలి.

మనసులో మాట

# చివరిగా ఒక్క మాట.!



'నేనే ఎందుకు చేయాలి? తనెందుకు చేయదు?' తొమ్మిదేళ్లుగా నాలో ఇదే మథనం. చాలాసార్లు 'హాయ్' అని మెసేజ్ టైప్ చేసేవాణ్ని. సెండ్ చేయకుండానే డిలీట్ చేసేవాణ్ని. భయం, ఇగో.. కారణం ఏదైనా ఇదే తంతు. నా ఇబ్బందిని పైనున్న దేవతలు గమనించారేమో! నేను కోరుకున్నట్టే మే 21న ఆ అమ్మాయి నుంచి 'హలో' అనే సందేశం వచ్చింది. ఆ క్షణం చూడాలి నా ఆనందం. పాదాలు నేలపై ఉంటే ఒట్టు. తొమ్మిదేళ్లుగా నన్నంత వేదనకు గురి చేసిన ఆ అమ్మాయి శన్వీ. మామయ్య కూతురు. మేం పుట్టగానే కాబోయే భార్యాభర్తలన్నారు పెద్దలు. ఆ మాట మనసులో నాటుకుపోయింది. వయసుతోపాటు తనపై ఇష్టం పెరుగుతూ వచ్చింది. అదెంత గాఢంగా మారిందంటే నేను మరో అమ్మాయితో మాట్లాడ్డమూ తప్పే అన్నంత. ఇంత ప్రేమ ఉన్నా వ్యక్తం చేయడానికి భయపడేవాణ్ని.

కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదుగా. మామయ్య కష్టపడి డబ్బులు సంపాదించి పట్టణంలో స్థిరపడ్డారు. అదేసమయంలో కొన్ని కారణాల వల్ల మా కుటుంబంతో పొరపొచ్చాలొచ్చాయి. రోజులు గడిచేకొద్దీ మా మధ్య దూరం పెరుగుతోంది. ఈ సమయంలో పిడుగులాంటి వార్త. శన్వీకి పెళ్లి చేసేందుకు మామయ్య వేరే అబ్బాయిని చూశారని తెలిసింది. ఏడవడం తప్ప ఏమీ చేయలేని దుస్థితి. అప్పుడు డిగ్రీ ఫైనలియర్‌లో ఉన్నా. చదువింకా పూర్తి కాకముందే 'శన్వీని నాకిచ్చి పెళ్లి చేయండి' అని ఎలా అడిగేది? అదిగో అప్పుడే 'ఉద్యోగం వచ్చే వరకు ఎట్టి పరిస్థితుల్లోనూ పెళ్లి చేసుకోన'ని తెగేసి చెప్పిందట శన్వీ. నాకు పెద్ద రిలీఫ్. ఆపై నా కర్తవ్యమేంటో బోధ పడింది.

డిగ్రీ అయిపోగానే ప్రభుత్వోద్యోగమే లక్ష్యంగా హైదరాబాద్ వచ్చేశా. కొలువు కొడితే మామయ్యతో మా పెళ్లి చేయమని అడగాలని. కానీ ఏం లాభం? ఎంత ప్రయత్నించినా ఉద్యోగం దొరకలేదు. మరింత సమయం వృథా చేయొద్దని ఎలాగోలా కష్టపడి ఓ ప్రైవేటు సంస్థలో జాబ్ సంపాదించా. శిక్షణలో ఉండగా చెల్లి పెళ్లి జరిగింది. అత్తమ్మ, మామయ్యలతో పాటు శన్వీ వచ్చింది. దాదాపు నాలుగేళ్ల తర్వాత తనని చూడటం. సంతోషంతో నోట మాట రాలేదు.

తను మా ఇంటినుంచి తిరిగెళ్లిన రోజే ఈ 'హలో' అని మెసేజ్. కాసేపు కుశల ప్రశ్నలయ్యాక 'మీ చెల్లి పెళ్లిలో అందరూ నీ గురించి బాగా మాట్లాడుకుంటున్నారు. నువ్వు సెటిల్ అయ్యావు. నాకూ ఉద్యోగమొచ్చింది. నీకు నేనంటే ఇష్టముంటే బావని పెళ్లి చేసుకుంటానని ఇంట్లో చెబుతా' అంది. కోరుకున్న దేవతే నాముందుకొచ్చి నీకేం వరం కావాలన్నట్టుగా ఉంది నా పరిస్థితి. 'చిన్నప్పట్నుంచీ నువ్వంటే నాకు చెప్పలేనంత ఇష్టం' అన్నా. 'అయితే ఒక్కసారైనా నాతో మాట్లాడావా..? కనీసం మెసేజ్ పెట్టావా..?' అని చిరుకోపంతో కసురుకుంది. అలా మా మనసులు కలిశాక పెద్దల్ని ఒప్పించడానికి సన్నద్ధమయ్యాం.

మర్నాడే మామయ్యకి ఫోన్ కలిపా. 'ఇద్దరూ కొత్తగా ఉద్యోగాల్లో చేరారు. కొన్ని నెలలపాటు ఏం ఆలోచించకుండా పనిపై శ్రద్ధ పెట్టండి. తర్వాత పెళ్లి విషయం మాట్లాడదాం' అన్నారు. అభయమిచ్చినట్టేనని ఆనందపడ్డా. కానీ కొద్దిరోజుల తర్వాత శన్వీతో ఓ మాటన్నారట. 'అబ్బాయి మంచోడే. కానీ ఇప్పుడున్న పరిస్థితుల్లో తనకొచ్చే తక్కువ జీతంతో మీరు సర్దుకుపోగలరా?' అని. కూతురిపై ఆయనకున్న ప్రేమ అలా మాట్లాడించి ఉండొచ్చు. అందులో తప్పేం లేదు. కానీ మామయ్యా మీకో మాట చెబుతున్నా. నా సంపాదనతో శన్వీ అడిగినవన్నీ కొనిపెట్టలేకపోయినా తనకెలాంటి లోటు లేకుండా చూసుకుంటానని హామీ ఇస్తున్నాను. మీతో పోటీ పడుతూ మీ కూతురికి అమితమైన ప్రేమ పంచుతానని మాటిస్తున్నాను. చివరగా నేను ఎన్ని చెప్పినా మీ సమ్మతం ఉంటేనే తనతో ఏడడుగులు నడుస్తాను. వందేళ్లు తోడుగా నిలుస్తాను. ఎందుకంటే నాది పదేళ్ల ప్రేమైతే.. మీది 23 ఏళ్ల బాధ్యత. తన పక్కన ఎవరుండాలో అందరికంటే మీకే బాగా తెలుసు. నిర్ణయం మీదే.

– మీ కార్తీక్

## పంచుకుందాం!

నానో కవిత

అతనంటే ఎంతిష్టమో...
మాటల్లో చెప్పాలనుకుంది
సమయానికి మాటలే రాలేదు...
అయినా అతడు అర్థం చేసుకున్నాడు
ఆమె కళ్లను చూసి...
గుండెల్లో ఏముందో తెలిసేది అక్కడేగా!

- రేవతి, విజయవాడ



డైలాగ్ కొట్టు!

ప్రతి జ్ఞాపకం అనుభవం కాకపోవచ్చు..
కానీ, ప్రతి అనుభవం మాత్రం ఓ జ్ఞాపకమే!

- జ్యోతి

టెక్‌టాక్

## సెల్ఫీ అదుర్స్!



నలుగురు ఫ్రెండ్స్ కలిసినా.. కొత్త చోటుకి వెళ్లినా సెల్ఫీ పడాల్సిందే. ఇలాంటప్పుడు కొన్ని సార్లు వెలుతురు సమస్య వస్తుంది. తక్కువ వెలుతురులోనూ సెల్ఫీలు అదిరేందుకు ఈ 'సెల్ఫీ రింగ్ లైట్'ని వాడొచ్చు. చిత్రంలో మాదిరిగా స్మార్ట్ ఫోన్‌కి జతచేసి వాడుకునేలా తీర్చిదిద్దారు. ● ధర: రూ. 314

## మరాఠీ తెరపై

# తెలుగు సుధాకరం!

**మొన్నీ మధ్యే ప్రకటించిన జాతీయ అవార్డుల గురించి ప్రస్తావన వస్తే గుర్తొచ్చేది మహానటి కీర్తి సురేష్, ఆ సినిమా డైరెక్టర్ నాగ్ అశ్విన్‌లు.. కానీ, మీకు తెలుసా? వీరితో పాటు తన మొదటి సినిమాకే జాతీయ ఉత్తమ నూతన దర్శకుడిగా అవార్డు అందుకున్నాడో తెలుగు యువకుడు.. పేరు సుధాకర్ రెడ్డి ఎక్కంటి. తన జర్నీని ఈతరంతో పంచుకున్నాడిలా...**

నేను మరాఠీ భాషలో తీసిన తొలి సినిమా 'నాల్' (బొడ్డు తాడు)కు ఈ ఏడాది రెండు జాతీయ అవార్డులొస్తాయని అస్సలు ఊహించలేదు. అయితే ఆ సినిమాను అవార్డుల కోసం మాత్రం తీయలేదు. మరాఠా ప్రాంతంలోని ఓ కుగ్రామంలో ఓ పిల్లాడి ప్రపంచాన్ని అందంగా, ఆర్ద్రంగా ఆవిష్కరిద్దామని చేసిన చిరు ప్రయత్నమది. ఆ సినిమా కథ కల్పనతో కూడుకున్నదే అయినా, దానికి నేపథ్యం మాత్రం నా బాల్యంలోంచి తీసుకున్నదే. చిన్నప్పుడు మన ఇళ్లల్లో జరిగిన సంఘటనల్లోంచే ఆ సినిమాకు కథను అల్లుకున్నాను. తల్లీబిడ్డల మధ్య అపురూపమైన బంధం ఏర్పడడానికి... బిడ్డ తప్పనిసరిగా తల్లి రక్తం పంచుకుని, పేగు తెంచుకుని పుట్టాల్సిన అవసరం లేదనే ఉదాత్తమైన భావనకు అందమైన ఊహను జోడించి ఈ కథను రాసుకున్నాను. కథ రాసుకోవడం ఒక ఎత్తు అయితే, అందులోని పాత్రలకు ప్రాణం పోసే పాత్రలు దొరకడం మరొక ఎత్తు. ఆ రకంగా నా కథలోని తల్లి, తండ్రి, బిడ్డ పాత్రలకు దేవిక, నాగరాజ్ మంజులే, శ్రీనివాస్ పోకలే రూపంలో అద్భుతమైన ఆర్టిస్టులు దొరకడం అదృష్టం. కథలో పిల్లాడి పాత్ర కోసం మరాఠా గ్రామాల్లో దాదాపు 600 మంది చిన్నారుల్ని ఆడిషన్ చేశాం. అందులోంచి ఈ అబ్బాయి దొరికాడు. ఆ పిల్లాడికే ఈసారి జాతీయ ఉత్తమ చైల్డ్ ఆర్టిస్టుగా అవార్డు వచ్చింది. నాకు ఇందిరాగాంధీ జాతీయ ఉత్తమ నూతన దర్శకుడిగా అవార్డొచ్చింది. నాకు అవార్డు రావడం కంటే కూడా, ఆ పిల్లాడి (నాల్ సినిమాలో చైత్య పాత్రధారి)కి అవార్డు రావడం నాకు గొప్ప ఆనందాన్నిచ్చింది.





చైత్యతో..



### అలా పుణె ఫిలిం ఇన్‌స్టిట్యూట్‌కి వెళ్లా..

మా స్వస్థలం గుంటూరు దగ్గర చిరుమామిళ్ల. వ్యవసాయాధారిత కుటుంబం. పొలాలు కౌలుకు తీసుకుని చేసే క్రమంలో మా కుటుంబం తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దులోని మహదేవపూర్ దాకా వలస వెళ్లాల్సి వచ్చింది. ఆ రకంగా బాల్యం కొంతకాలం గోదావరి ఒడ్డున గడిచింది. నాకు ఇద్దరు అన్నలు, ఒక అక్క. ఇంట్లో నేనే చిన్నవాణ్ని. ఇంటర్ దాకా గుంటూరు జిల్లాలోని నడికుడిలో చదివా. తర్వాత హైదరాబాదులోని జేఎన్టీయూ ఫైన్ ఆర్ట్స్ కాలేజీలో ఫొటోగ్రఫీ డిప్లొమా చేశాను. ఆ తర్వాత ఈనాడు పేపర్లో చదివి పుణె ఫిలిం ఇన్‌స్టిట్యూట్‌కి దరఖాస్తు చేశా. తొలి ప్రయత్నంలోనే సీటొచ్చింది. పుణె ఫిలిం ఇన్‌స్టిట్యూట్ అన్నది సినిమా ఆర్టిస్టులకు కల్పతరువు లాంటిది. పుణె వెళ్లాకే నా కెమెరా కన్ను మరింత ఉన్నతంగా విహంగవీక్షణం చేయగలిగింది. నా మస్తిష్క ప్రపంచం మరింత విస్తృతమైంది. పుణె ఫిలిం ఇన్‌స్టిట్యూట్‌లో కోర్సు చేస్తుండగానే 'ప్రోగ్రాం ఫర్ క్రియేటివ్ కంటెంట్' పేరిట యునెస్కో షార్ట్ ఫిలిమ్స్ కోసం ఓ ప్రకటన ఇచ్చింది. నేనొక స్క్రిప్ట్ రాసి పంపితే ఎంపికైంది. ఆ కథతోనే 'ఏక్ ఆకాశ్' గా షార్ట్ మూవీ తీశాను. ఇద్దరు పిల్లల మధ్య చిన్నపాటి ఘర్షణను, ఐక్యతను ఆవిష్కరించే చిత్రమది. ఆ షార్ట్ ఫిలింకి కూడా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అనేక అవార్డులొచ్చాయి. తర్వాత మధుమాసం, పౌరుడు, దళం, సైరాట్ లాంటి ఏడెనిమిది తెలుగు, మరాఠీ సినిమాలకు సినిమాటోగ్రాఫర్ గా పనిచేశాను. ప్రస్తుతం 'సైరాట్' సినిమా ఫేం నాగరాజ్ మంజులే దర్శకత్వంలో అమితాబ్ బచ్చన్ నటిస్తున్న హిందీ చిత్రం 'ఝుండ్' సినిమాకు, అలాగే తెలుగులో 'జార్జిరెడ్డి' సినిమాకు సినిమాటోగ్రాఫర్ గా చేస్తున్నా. ఈ ప్రాజెక్టులు అయ్యాక మంచి కథతో సొంత దర్శకత్వంలో సినిమా తీసే ప్రయత్నంలో ఉన్నా. ఆ సినిమా తెలుగులోనా, మరాఠీలోనా అన్నది ఇప్పుడే చెప్పలేను. షూటింగుల నుంచి ఖాళీ దొరికినప్పుడల్లా ఫ్రెండ్స్‌తో కలిసి ట్రావెల్ చేయడానికి ఇష్టపడతాను.

> గుంటూరు నుంచి హైదరాబాద్, పుణె మీదుగా ముంబయి దాకా ప్రయాణించి ఛాయాగ్రహణ కళను ఔపోసన పట్టాడు. ఆపై ఇటు తెలుగు, అటు మరాఠీలో అరడజనుకు పైగా చిత్రాలకు సినిమాటోగ్రాఫర్ గా పనిచేసి, అనంతరం 'నాల్' అనే మరాఠీ చిత్రానికి దర్శకత్వం వహించి తొలి ప్రయత్నంలోనే ఈ ఏడాది రెండు జాతీయ అవార్డులను సాధించాడు.

### టాలెంట్ చాలు...

గుంటూరోళ్లకి కాస్త సినిమా పిచ్చి ఎక్కువ. ఆ పిచ్చితోనే నేనూ సినిమా పరిశ్రమలోకి వచ్చా. ఇంట్లో కూడా ఎవరూ నాకు అడ్డు చెప్పలేదు. అయితే ఈ ఫీల్డులోకి వచ్చే ముందు అవసరమైన బేసిక్స్ నేర్చుకుని పట్టు సాధించాను. ఫీల్డులోకి వచ్చాక తగినంత శ్రమ చేసి నన్ను నేను రాటుదేల్చుకున్నాను. ఆ క్రమంలోనే సినిమాటోగ్రాఫర్‌గా, కథా రచయితగా, దర్శకుడిగా, నిర్మాతగా నాకు అవకాశాలు లభించాయి. వాటిని అందిపుచ్చుకున్నాను. సినిమా పరిశ్రమలోకి రావాలనే కోరిక నేటి యువతలో ఎక్కువగానే కనిపిస్తుంది. అది తప్పేం కాదు. ఇప్పుడు అందుబాటులోకి వచ్చిన డిజిటల్ యుగంలో అవకాశాలూ అపారంగా ఉన్నాయి. యూట్యూబ్ కూడా ఓ బ్రహ్మాండమైన మీడియం. ఈ అవకాశాల్ని అందిపుచ్చుకోవడానికి మనం చేయాల్సిందల్లా తగిన శ్రమ చేసి, నైపుణ్యాలను ఎప్పటికప్పుడు సానపెట్టుకోవడమే. కష్టే ఫలి అన్న నానుడి అందరికీ తెలిసిందే కదా.

– నాగరాజ్, ఈటీవీ

# ఈనాడు సినిమా



అల్లు అర్జున్

## జాబితా పెరుగుతోంది

అల్లు అర్జున్ 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా' తర్వాత చాలా విరామం తీసుకొన్నారు. అయితే ఆ విరామం తాను తీసుకొన్నది కాదని, అలా వచ్చిందంటూ ఇటీవల 'అల వైకుంఠపురములో...' టీజర్‌తో చెప్పకనే చెప్పేశారు అల్లు అర్జున్. ఇక నుంచి ఆయనకి విరామం దొరికే అవకాశాలు అస్సలు కనిపించడం లేదు. ఎందుకంటే అల్లు అర్జున్ చేయాల్సిన కథల జాబితా ఎప్పటికప్పుడు పెరుగుతూనే ఉంది. పలువురు దర్శకులు ఆయన కోసం కథలు సిద్ధం చేశారు. ప్రస్తుతం త్రివిక్రమ్ దర్శకత్వంలో చేస్తున్న 'అల వైకుంఠపురములో' సినిమాతో పాటు సుకుమార్, వేణుశ్రీరామ్ చెప్పిన కథలకి బన్నీ ఇప్పటికే పచ్చజెండా ఊపేసిన విషయం తెలిసిందే. తదుపరి సుకుమార్ దర్శకత్వం వహించనున్న సినిమాకి ముహూర్తం ఖరారైనట్టు తెలుస్తోంది. దసరా సందర్భంగా సినిమాని ప్రారంభించబోతున్నారు.

### మురుగదాస్ కథ చెబుతారా?

అల్లు అర్జున్ తదుపరి మురుగదాస్‌తో సినిమా చేయబోతున్నట్టు సమాచారం. రజనీకాంత్‌తో 'దర్బార్' తీస్తున్న మురుగదాస్ అది పూర్తవ్వగానే బన్నీకి కథ వినిపిస్తారని తెలిసింది. తెలుగుతో పాటు తమిళంలోనూ ఆ సినిమాని చేయాలనేది మురుగదాస్ ఆలోచన. అల్లు అర్జున్ కూడా తమిళంలో నేరుగా సినిమా చేయాలని ఎప్పట్నుంచో ప్రయత్నాలు చేస్తున్నారు. అన్నీ అనుకొన్నట్టు కుదిరితే మురుగదాస్ తీయబోయే సినిమాతోనే అల్లు అర్జున్ తమిళంలోకి అడుగుపెట్టే అవకాశాలున్నాయి.

## మిలన్‌లో 'చాణక్య'

గోపీచంద్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న చిత్రం 'చాణక్య'. మెహరీన్ కథానాయిక. తిరు దర్శకుడు. రామబ్రహ్మం సుంకర నిర్మాత. ప్రస్తుతం ఇటలీలోని మిలన్‌లో పాటల్ని చిత్రీకరిస్తున్నారు. రాజుసుందరం నృత్యాలు సమకూరుస్తున్నారు. "స్పై థ్రిల్లర్‌గా రూపొందుతున్న చిత్రమిది. గోపీచంద్ గూఢచారి పాత్రలో ఆకట్టుకుంటారు. ఆయన లుక్, నటన ప్రత్యేకంగా ఉంటాయి. బాలీవుడ్ భామ జరీనాఖాన్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇప్పటికే టాకీభాగం చిత్రీకరణ పూర్తయింది. మిలన్‌లో పాటల చిత్రీకరణపై అక్కడి మీడియాలో కథనాలు కూడా వచ్చాయి. ఈ చిత్రం ప్రేక్షకుల్ని అలరిస్తుంది" అని చిత్రబృందం చెప్పింది. సంగీతం: విశాల్ చంద్రశేఖర్.



గోపీచంద్



సమంత, నాగచైతన్య, నాగార్జున, అమల, అఖిల్

## విహారంలో పుట్టినరోజు సంబరం

కథానాయకుడు నాగార్జున గురువారం తన 60వ పుట్టిన రోజును స్పెయిన్‌లో జరుపుకొన్నారు. కుటుంబ సభ్యులతో కలిసి అక్కడ సరదాగా గడిపారు. నాగ్ పుట్టిన రోజు ఏర్పాట్ల కోసం ఆయన తనయులు నాగ చైతన్య, అఖిల్, కోడలు సమంత ముందే స్పెయిన్ వెళ్లారు. ఆ తర్వాత నాగార్జున, ఆయన భార్య అమల వెళ్లారు. కుటుంబమంతా కలిసి విహార యాత్రని ఆస్వాదిస్తూ, నాగ్ పుట్టినరోజు వేడుకల్ని జరిపారు. ఈ సందర్భంగా వారు కలిసి తీసుకొన్న కొన్ని ఫొటోల్ని సమంత సామాజిక మాధ్యమాల ద్వారా పంచుకున్నారు. నాగార్జున స్విమ్మింగ్ పూల్‌లో కండలు చూపిస్తూ కనిపిస్తున్న ఓ ఫొటోని ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పంచుకొన్న సమంత 'మీరు వయసుని ఓడించారు మామా' అంటూ అందులో వ్యాఖ్య జోడించారు.

### పంచ్ డైలాగ్

**ప్రపంచంలో అమ్మని మించిన యోధులు ఎవరూ లేరు**

చిత్రం: కేజీఎఫ్

– పంపినవారు: బి.బాలాజీ, గుత్తి

మెయిల్ ఐడీ: cinema@eenadu.net



'టెర్మినేటర్: డార్క్ ఫేట్'

## ఆరు భాషల్లో కొత్త టెర్మినేటర్

ప్రపంచవ్యాప్తంగా క్రేజ్ తెచ్చుకున్న 'టెర్మినేటర్' సిరీస్‌లో వస్తున్న తాజా చిత్రం 'టెర్మినేటర్: డార్క్ ఫేట్'. ఆర్నాల్డ్ ష్వార్జ్‌నెగ్గర్ మరోసారి టెర్మినేటర్‌గా కనిపించబోతున్నారు. 'డెడ్‌పూల్' దర్శకుడు టిమ్ మిల్లర్ తెరకెక్కిస్తున్నారు. ప్రముఖ దర్శక నిర్మాత జేమ్స్ కెమెరాన్ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా ట్రైలర్ విడుదలైంది. 'టెర్మినేటర్ 2: జడ్జిమెంట్ డే' కథకు కొనసాగింపుగా ఈ చిత్రం తెరకెక్కింది. భారత్‌లో ఈ చిత్రాన్ని ఇంగ్లిష్‌తో పాటు హిందీ, తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం.. ఇలా మొత్తం ఆరు భాషల్లో విడుదల చేస్తున్నట్లు ఫాక్స్‌స్టార్ ఇండియా ప్రకటించింది. నవంబరు 1న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.



'ప్రస్థానం'

## వారసత్వం కోసం పోరాటం

తెలుగులో ప్రశంసలందుకున్న 'ప్రస్థానం' బాలీవుడ్‌లో రీమేక్ అవుతున్న సంగతి తెలిసిందే. సంజయ్ దత్ ప్రధాన పాత్రలో నటించారు. మాతృకను తెరకెక్కించిన దేవా కట్టానే దర్శకుడిగా వ్యవహరించారు. మనీషా కోయిరాలా, జాకీ ష్రాఫ్, చుంకీ పాండే, అలీ ఫజల్, అమైరా దస్తూర్ కీలక పాత్రల్లో నటించారు. తాజాగా ఈ సినిమా ట్రైలర్ విడుదలైంది. రాజకీయ నేత బల్‌దేవ్ ప్రతాప్ సింగ్‌గా సంజయ్ దత్ గాంభీర్యం, ఆయనకు విశ్వాసపాత్రుడైన అనుచరుడిగా జాకీ ష్రాఫ్, ప్రతినాయకుడి పాత్రలో చుంకీ పాండే, సంజయ్ భార్యగా మనీషా నటన ఆకట్టుకుంటోంది. సంభాషణలు మెప్పిస్తున్నాయి. ఈ ట్రైలర్‌ను సంజయ్ ట్విటర్‌లో పంచుకుంటూ 'వారసత్వం కోసం పోరాటం మొదలైంది' అని ట్వీట్ చేశారు. సెప్టెంబరు 20న విడుదల చేస్తున్నారు.



రష్మిక

## అలా పొగిడినా కష్టమే కదా

"సున్నిత మనస్కురాలినే. కానీ చిన్న విషయాలకే ధైర్యం కోల్పోయి వెనక్కి తగ్గే అలవాటు లేదు. అడ్డంకులు ఎన్నున్నా... అనుకొన్నది సాధించడంపైనే దృష్టి ఉంటుంది. అదే నాకు బలం" అంటోంది రష్మిక. వరుస అవకాశాలతో దూసుకెళుతున్న కథానాయిక ఈమె. మహేష్‌బాబు, నితిన్‌లతో కలిసి సినిమాలు చేస్తోంది. త్వరలోనే అల్లు అర్జున్‌తోనూ జోడీ కట్టబోతోంది. విమర్శల్ని మీరు చూసే కోణం ఎలా ఉంటుందని అడిగితే... "సద్విమర్శల్ని స్వీకరించడానికి ఎప్పుడూ సిద్ధమే. మన చుట్టూ ఉన్న వాళ్లంతా ఆహా ఓహో అని పొగుడుతూ ఉన్నా కష్టమే కదా. అలా చేస్తే మన తప్పుల్ని సరిదిద్దుకొనే అవకాశమే ఉండదు. అలాగని విమర్శలు నన్ను అస్సలు బాధ పెట్టవని, ఎవరేమన్నా ఎప్పట్లాగే నవ్వుతూనే ఉంటానని చెబితే అది అబద్ధమే అవుతుంది. మింగుడు పడని మాటలు విన్నప్పుడు అందరిలాగే నాకూ బాధ కలుగుతుంది. కానీ అదే పనిగా బాధపడి ఏం లాభం? అది వాళ్ల అభిప్రాయం. నేనైతే మార్చలేను కదా. అందుకే నా దగ్గరికి వచ్చిన ఆ విమర్శ ఎలాంటిది? దాన్నుంచి నేనేమైనా నేర్చుకోవల్సింది ఉందా అని మాత్రమే ఆలోచిస్తా. ఆ వెంటనే పనిపై దృష్టి పెడుతుంటా" అంది రష్మిక.



రఘు కుంచె, ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం

## ఓ గడసరి.. సొగసరి

రక్షిత్, నక్షత్ర జంటగా నటించిన చిత్రం 'పలాస 1978'. కరుణ కుమార్ దర్శకుడు. ధ్యాన్ అట్లూరి నిర్మాత. రఘు కుంచె సంగీతం అందించారు. ఈ చిత్రంలోని 'ఓ గడసరి' పాటని ప్రముఖ గాయకుడు ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం విడుదల చేశారు. ఈ పాటని బాలు, బేబి ఆలపించారు. లక్ష్మీ భూపాల రచించారు. "1978లో పలాస నేపథ్యంలో జరిగే కథ ఇది. ఆనాటి వాతావరణం తెరపై ప్రతిబింబిస్తుంది. 'గడసరి' పాటని బాలు, బేబీ ఆలపించిన విధానం సంగీత ప్రియుల్ని ఫ్లాష్ బ్యాక్‌లోకి తీసుకెళ్లిపోతుంది. ఆ నాటి మధురమైన బాణీల్ని మరోసారి గుర్తు చేస్తుంది. ఫస్ట్‌లుక్‌కి మంచి స్పందన వచ్చింద"న్నారు రఘు కుంచె.



ఆలియా

## ఆలియా ఇప్పుడేం చేస్తుందో!

'ఒక ఖాన్ సినిమా కోసం మరో ఖాన్‌కు నో చెప్పింది.. ఇప్పుడేమో రెండు చిత్రాలూ చేజారాయి' అంటూ ఆలియా భట్‌పై బాలీవుడ్ వర్గాలు సానుభూతి వ్యక్తం చేస్తున్నాయి. విషయమేంటంటే సల్మాన్ ఖాన్ కథానాయకుడిగా సంజయ్ లీలా భన్సాలీ తెరకెక్కించే 'ఇన్‌షా అల్లా'లో ఆలియా నాయికగా ఎంపికైంది. సల్మాన్‌తో అవకాశం వచ్చినందుకు ఎంతో మురిసిపోయింది. వెంటనే అడిగినన్ని కాల్షీట్లు ఇచ్చేసింది. అదే సమయంలో ఆమీర్ ఖాన్ నటించే మరో చిత్రం కోసమూ ఆలియాను సంప్రదించారని, కానీ కాల్షీట్ల సమస్యతో నో చెప్పిందని వార్తలు వచ్చాయి. ఆమీర్ చిత్రం కన్నా 'ఇన్‌షా అల్లా' భారీ బడ్జెట్ చిత్రం కావడం వల్లే ఆలియా దానికే ఓకే చెప్పిందని చెప్పుకున్నారు. కానీ ఆలియా దురదృష్టం... సెట్స్ పైకి వెళ్లక ముందే 'ఇన్‌షా అల్లా'పై నీలినీడలు కమ్ముకున్నాయి. ఆ సినిమాను పట్టాలెక్కించే ఆలోచన ఇప్పట్లో లేదని, దాని గురించి తర్వాత వెల్లడిస్తామని అటు భన్సాలీ, ఇటు సల్మాన్ ఇటీవలే ప్రకటించారు. దీంతో 'ఇన్‌షా అల్లా' ఆగిపోయినట్లే అని గట్టిగా వినిపిస్తోంది. దీంతో సల్మాన్, ఆమీర్.. ఈ ఇద్దరి చిత్రాలనూ ఆలియా పోగొట్టుకుందని చెప్పుకుంటున్నారు. మరి ఇప్పుడు ఆలియా ఏం చేయబోతోందంటూ ఆసక్తిగా చర్చించుకుంటున్నారు. అయితే 'ఇన్‌షా అల్లా'కు ఇచ్చిన కాల్షీట్లను ఇప్పుడు 'ఆర్ ఆర్ ఆర్' కోసం కేటాయించిందంటూ వార్తలు వస్తున్నాయి.

### గీతోపదేశం

**ఇనప్పెట్టెల్లో మూలుగుతు ఉండే**
**కరెన్సీ కట్టల్లో లేదుర లోకం**
**అహర్నిశలు చెమటోడ్చి శ్రమించే**
**కార్మిక శక్తిలో ఉందిర లోకం**

గీతం: చూడర నాన్నా లోకం...

చిత్రం: కోడలు దిద్దిన కాపురం

రచన: కొసరాజు రాఘవయ్య చౌదరి

– పంపినవారు: కె.రమేష్ నాయుడు, రాజమండ్రి



తాప్సి

## పల్లెటూరి పరుగుల రాకెట్

'సాండ్ కీ ఆంఖ్'లో 82 ఏళ్ల వృద్ధురాలిగా నటిస్తున్న తాప్సి మరో విభిన్న అవతారంలోకి మారిపోయింది. పక్కా పల్లెటూరి అమ్మాయిలా డీగ్లామర్ పాత్రలో నటించడానికి సిద్ధమైంది. ఆమె ప్రధాన పాత్రలో నటించబోతున్న చిత్రం 'రష్మి రాకెట్'. ఆకాష్ ఖురానా దర్శకుడు. రష్మి అనే అమ్మాయిగా కనిపించబోతోంది తాప్సి. వేగంగా పరిగెత్తే రష్మిని ఊరివాళ్లంతా రాకెట్ అని పిలుచుకుంటుంటారు. ఆమెకు అథ్లెట్‌గా అంతర్జాతీయ స్థాయి పరుగు పందాల్లో పాల్గొనే అవకాశం వస్తుంది. కానీ అక్కడ గెలవాల్సింది ప్రత్యర్థుల మీద కాదు.. క్రీడారంగంలో మహిళల పట్ల ఉన్న వివక్ష మీద అని అర్థమౌతుంది. మరి ఆమె పోరాటం ఎలా సాగింది? అనే అంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు.

# వసుంధర



**ఓ సాధారణ ఉపాధ్యాయురాలిగా బోధనారంగంలోకి వచ్చిన ఆమె... అంచెలంచెలుగా కృషి చేసి తనకంటూ గుర్తింపు తెచ్చుకుంది. విద్యార్థులను చదువులో మెరికల్లా తయారుచేయడానికి తాను నిత్య విద్యార్థినిగా మారింది. ఎప్పటికప్పుడు కొత్త బోధనా విధానాలను ప్రవేశపెడుతూ... ప్రయోగాలు చేస్తోంది. నిరుపేద పిల్లలకు సేవచేస్తూ... అక్షరదానం అందిస్తోంది. ఇవన్నీ ఆమెను ఈ ఏడాది జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలిని చేశాయి. ఆమే బెండి ఆశారాణి.**

## ఈ ఇంగ్లిష్ టీచర్... పిల్లల నేస్తం

స్వస్థలం శ్రీకాకుళం జిల్లా టెక్కలి అయినా తండ్రి రామారావు ఆర్మీ ఉద్యోగి కావడంతో బెంగళూరు, అండమాన్, భువనేశ్వర్ తదితర ప్రాంతాల్లో చదువుకుంది ఆశారాణి. ఎంఏ, బీఈడీని ఒడిశాలో పూర్తి చేసింది. 1992లో చిన్న ఇంగ్లిషు మీడియం స్కూల్‌లో టీచర్‌గా చేరింది. ఆ భాషపై అంతగా పట్టు లేకపోవడంతో ఏడాదిపాటు అక్కడ పనిచేశాక ఆర్కేపురంలోని సైనిక పాఠశాలలో టీచర్ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకుంది. తీరా అక్కడికెళ్తే... 'మీకు ఆంగ్లం సరిగ్గా రాదు గనుక రెండో తరగతికి పాఠాలు చెప్పండి...' అన్నారు. ఒక్కక్షణం బాధనిపించినా... అవసరం రీత్యా ఆ పిల్లలకు పాఠాలు చెప్పడానికి సిద్ధమైంది ఆశ. అదే ఆమెకు మేలు చేసింది.

### ❖ రెండేళ్లు కష్టపడి మరీ...

ఆంగ్లభాషలో పట్టు సాధించడానికి చాలా కష్టపడ్డానంటుంది ఆశారాణి. 'టీచర్‌గా విద్యార్థులతో అనుబంధం ఏర్పడటానికి, వారికి పాఠాలు బోధించడానికి ఎలాగైనా సరే ఇంగ్లిష్ పూర్తిగా నేర్చుకోవాలనుకున్నా. అందుకోసం బీబీసీ వార్తలు వినేదాన్ని. దూరదర్శన్‌లో వచ్చే ఇంగ్లిష్ కార్యక్రమాలు చూసేదాన్ని. ఆంగ్లపత్రికలు, పుస్తకాలు విపరీతంగా చదివేదాన్ని. నాపై నాకు కాస్త నమ్మకం వచ్చాక ప్రత్యేక కోర్సులూ చేశా. రెండేళ్లు ఇదే లక్ష్యంతో కష్టపడ్డా. కొన్నాళ్లకు రెండు నుంచి ఏడో తరగతి విద్యార్థులకు ఇంగ్లిష్ టీచర్‌గా వెళ్లా. ప్రస్తుతం మేడ్చల్, జీడిమెట్ల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఇంగ్లిష్ టీచర్‌గా, స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నా. ఉన్నత విద్యార్హతలు ఉన్నా... భాష రాకపోవడం వల్ల నాలా చాలామంది ఇబ్బంది పడతారని అర్థమైంది. దీనికి పరిష్కారం పెద్దయ్యాక భాష నేర్చుకోవడం కన్నా... విద్యార్థి దశ నుంచే కృషి చేస్తే ఏ ఇబ్బందీ ఉండదని అనిపించింది. బాగా ఆలోచించి చాలా సులువుగా ఆంగ్లం నేర్పించేలా చేయాలనుకున్నా. ముఖ్యంగా ప్రభుత్వపాఠశాల విద్యార్థులకు ఇది చాలా అవసరం కాబట్టి ఆ దిశగా నా వంతు ప్రయత్నాలు చేశా...' అని అంటుంది ఆశారాణి.

### ❖ ఆ అవకాశంతో...

సరిగ్గా రెండేళ్ల క్రితం అమెరికాలోని విద్యావిధానం తెలుసుకునే అవకాశం అందుకుందీమె. ఈ కార్యక్రమం గురించి తెలిసి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంది. ఒకే పాఠశాలలో కనీసం అయిదేళ్లపాటు పనిచేసిన అనుభవం ఉండటమే కాదు, వారిచ్చే ప్రశ్నలకు సమాధానాలు సహా కొన్ని ప్రత్యేక అంశాలపై వ్యాసాలను రాసి పంపాలని తెలియడంతో అదీ చేసింది. ప్రపంచవ్యాప్తంగా 36 దేశాల నుంచి 89 మంది దీనికి ఎంపిక కాగా, మన దేశం నుంచి నలుగురు అర్హత సాధించారు. వారిలో ఆశారాణి ఉంది. నెలన్నరపాటు అమెరికాలోని పాఠశాలల నిర్వహణ నుంచి చదువు చెప్పే విధానం వరకు ఎన్నో తెలుసుకుందామె. 'చివరి వారం రోజులు కాలిఫోర్నియాలోని ఓ పాఠశాలలో నాకు తరగతులు నిర్వహించే అవకాశం వచ్చింది. మన దేశ సంస్కృతీ సంప్రదాయాలు, తదితర అంశాల గురించి అక్కడి విద్యార్థులకు చెప్పా. మా ఉపాధ్యాయులందరికీ అక్కడి విధానాలపై అవగాహన కల్పించడమే కాదు... నేను తెలుసుకున్న విషయాలను ఆచరణలో పెట్టా...' అని వివరిస్తుంది.



### ❖ చదువు అర్థమయ్యేలా...

అమెరికా నుంచి వచ్చిన తరువాత వారి తరహాలో ఇక్కడి విద్యార్థులకు పాఠాలు చెప్పాలనుకుంది. అంతటి సాంకేతికత ఇక్కడ అందుబాటులో ఉండదు గనుక తన ల్యాప్‌టాప్‌ను వినియోగించడం మొదలుపెట్టింది. ల్యాప్‌టాప్ ద్వారా చెప్పాల్సిన అంశాలను తెరపై చూపిస్తూ నేర్పించేది. 'అక్కడి చిన్నారులకు బాల్యం నుంచే పుస్తక పఠనంపై ఆసక్తి ఉంటుంది. ప్రతిస్కూల్లో ఓ గ్రంథాలయం తప్పనిసరి. ఇక్కడా ఆ మార్పులు తేవాలనుకున్నా. రెండువేల పుస్తకాలతో చిన్నపాటి లైబ్రరీని ప్రారంభించా. క్రమంగా పిల్లలందరినీ పుస్తకపఠనంవైపు మళ్లించా. వాళ్లకు ఆసక్తి పెరిగేలా... రకరకాల పుస్తకాలు అందుబాటులో ఉంచా...' అని చెప్పే ఆశారాణి... సబ్జెక్టు ఎలాంటిదైనా కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలంటుంది. భయం లేకుండా మాట్లాడితే ఏ భాషైనా సులువుగా నేర్చుకోవచ్చంటుంది.

### ❖ ఉచిత శిక్షణ అందించేలా...

ఓ వైపు టీచరుగా పనిచేస్తూనే... ఇతర పిల్లలకు తనవంతుగా సాయం చేయాలనుకుంది ఆశారాణి. నేరెడ్‌మెట్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడుగా పనిచేసి పదవీవిరమణ పొందిన పన్నాల లక్ష్మీ నర్సింహారెడ్డితో కలిసి ఆయన పేరుతోనే ఓ 'ఎడ్యుకేషన్ సొసైటీ' ప్రారంభించింది. ఇందులో 18 మంది ఉపాధ్యాయులు సభ్యులుగా ఉన్నారు. నిరుపేద విద్యార్థులకు చదువుతోపాటు వృత్తివిద్యా కోర్సులను ఉచితంగా అందించడమే ఈ సంస్థ లక్ష్యం. ఆసక్తి, నేర్చుకోవాలనే పట్టుదల ఉన్న పిల్లలకు అన్నిరకాలుగా చేయూతనందిస్తామని చెబుతుందామె. ఇప్పటివరకు దాదాపు వందమంది పిల్లలు దీని ద్వారా లబ్ధి పొందారని చెబుతుంది.

### ❖ పాఠ్యాంశాలు రాయడంలో...

మొదట్లో ఆంగ్లంపై అంతంతమాత్రమే అవగాహన ఉన్న ఆమె... క్రమంగా ఆ పాఠాలే రూపొందించే స్థాయికి చేరుకుంది. అయిదు, ఆరు, ఎనిమిదో తరగతికి చెందిన ఆంగ్లపాఠ్యపుస్తకాలను రూపొందించడంలో ఆశారాణి భాగస్వామ్యం ఉంది. 2006లో అయిదు, 2008లో ఆరు, 2012లో ఎనిమిదో తరగతి పాఠ్యపుస్తకాలను సిద్ధంచేసే 10 మంది బృందంలో ఆమెకీ అవకాశం వచ్చింది. కేవలం పిల్లలకే కాదు, ప్రభుత్వ టీచర్లకు బోధనావిధానాలపై ప్రత్యేక శిక్షణా తరగతులూ నిర్వహిస్తుంది. ఇవన్నీ కలిపే ఆమెకు ఈ ఏడాది జాతీయస్థాయి అవార్డును తెచ్చిపెట్టాయి. సెప్టెంబరు 7న దిల్లీలో అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి చేతులమీదుగా అవార్డు అందుకోబోతోందామె.

**- సీహెచ్. నర్సింహులు** న్యూస్‌టుడే, పేట్ బషీరాబాద్




## రోజూ తలస్నానమా?



**జుట్టు మురికిగా ఉన్నా లేకపోయినా... కొందరు రోజూ తలస్నానం చేస్తుంటారు. దానివల్ల మేలు జరగకపోగా... సమస్యలు ఎదురవుతాయని తెలుసా... ఎలాగో చదవండి మరి.**

- రోజూ తలస్నానం చేస్తే జుట్టు పొడిబారి పీచులా మారిపోతుంది. షాంపూను రోజూ వాడటం వల్ల జుట్టు తేమనూ కోల్పోతుంది. తప్పదనుకుంటే... రోజుమార్చి రోజు లేదా వారానికి రెండుసార్లు చేస్తే చాలు.
- గాఢత ఎక్కువగా ఉండే షాంపూలతో జుట్టు చివర్లు చిట్లుతుంది. తలపై ఉండే చర్మం పొడిబారి పొలుసులుగా రాలుతుంది. ఇలాంటి సమస్య ఉన్నప్పుడు తలస్నానం చేయడానికి గంట ముందు కొబ్బరి నూనెతో మర్దన చేసుకోవాలి. తక్కువ గాఢత ఉండే షాంపూలను ఎంచుకోవాలి.
- తలస్నానం తరువాత జుట్టును పూర్తిగా ఆరబెట్టాలి. తడి జుట్టుతోనే జడ వేసుకుంటే చుండ్రు సమస్య పెరుగుతుంది. బ్యాక్టీరియా, ఫంగస్ వృద్ధి చెంది ఇతర సమస్యలకు దారి తీసే అవకాశం ఉంది.
- షాంపూను నేరుగా తలకు పట్టిస్తే వాటిల్లో ఉండే రసాయనాలు కుదుళ్లలోకి చేరతాయి. దీంతో మాడు పొడిబారి, తల చర్మం సహజ నూనెలను స్రవించే గుణాన్ని కోల్పోతుంది. దీని ప్రభావంతో వెంట్రుకలు పీచులా, జీవం లేనట్లుగా తయారవుతాయి. షాంపూను చిన్న కప్పులో తీసుకుని కాసిని నీళ్లు కలిపి అప్పుడు తలకు రాసుకోవడమే దీనికి పరిష్కారం.
- బాదం నూనె, గుడ్డు తెల్లసొన వంటి వాటితో వారానికి ఒకసారైనా జుట్టుకు మర్దన చేసుకోవాలి. దీనివల్ల పొడిబారిన కురులు పట్టులా మెరుస్తాయి.

## నెలసరికి డైటింగే కారణమా?

**నా వయసు ముప్పైఎనిమిది. నేను లావుగా ఉంటా. బరువు తగ్గాలనే ఉద్దేశంతో ఈ మధ్యే వ్యాయామంతోపాటు, డైటింగ్ చేయడం మొదలుపెట్టా. కొన్ని కేజీలు తగ్గా కానీ... ఇంకా కష్టపడుతున్నా. ఈ మధ్య రెండు మూడు నెలలుగా నెలసరి ఒకే తేదీన రావడం లేదు. ఇదివరకు ఎప్పుడూ ఇలా జరగలేదు. స్నేహితులేమో డైటింగ్, వ్యాయామం వల్లే అలా అయ్యిందని చెబుతున్నారు. ఇదేమైనా సమస్యకు సంకేతమా? దీనికి ఏదయినా పరిష్కారం ఉందంటారా?**

– ఓ సోదరి

నెలసరి ఇరవైఅయిదు రోజులకు వస్తేనే ఆరోగ్యకరంగా ఉన్నామనుకుంటారు కొందరు. ఇది అపోహ. బహిష్టు వచ్చిన మొదటిరోజును లెక్కబెట్టుకుని... 21 నుంచి 35 రోజుల మధ్య ఎప్పుడైనా వస్తుంది. ఈ మధ్య అది నలభైరోజులకు పెరిగింది. అంటే... నలభైరోజుల్లోపల ఎప్పుడు వచ్చినా కంగారుపడాల్సిన అవసరంలేదు. కొన్నిసార్లు ఆ నెలలో వచ్చే జ్వరాలు, ఒత్తిడి, ఉద్వేగాలు... వంటివాటితోనూ నెలసరి వాయిదా పడొచ్చు. మీరు చేసే వ్యాయామం, ఆహారంలో మార్పులతోనూ అలా అయ్యుండొచ్చు. క్రమంగా సర్దుకుంటుంది కాబట్టి భయపడకండి. పై కారణాలు కాకుండా... రుతుక్రమం మొదలయ్యే ముందు, ప్రసవం, అబార్షన్, మెనోపాజ్ సమయాల్లోనూ నెలసరి క్రమం తప్పుతుంది. వీటన్నింటినీ అంచనా వేసుకోండి. ఇవేవీ కాకుండా... తరచూ ఇదే పరిస్థితి ఎదురవుతోంటే నిర్లక్ష్యం చేయకుండా వైద్యుల్ని సంప్రదించడం మంచిది. హార్మోన్లలో మార్పులు, థైరాయిడ్ ఉన్నా ఇలా కావొచ్చు. వైద్యులు ఈ సమస్యల్ని అంచనా వేస్తే... కొన్ని పరీక్షలు చేయించుకోవాల్సి ఉంటుంది. పరిస్థితిని బట్టి చికిత్స సూచిస్తారు. మీరో పని చేయండి. మరో రెండు నెలలు గమనించి... ఆ తరువాతా ఇలాగే అవుతోంటే... అప్పుడు వైద్యుల్ని సంప్రదించండి.



**డియర్ వసుంధర**



డా॥ అనగాని మంజుల
గైనకాలజిస్టు

– మీ సందేహాలను, సమస్యల్ని vasuhealth@eenadu.net కు పంపించగలరు.

## బంగారం వెండి

30న ముగింపు-క్రితం

| తమిళనాడు (రూ. లలో) | | |
|---|---|---|
| ఆర్నమెంట్ (గ్రా) | 3,682 | 3,712 |
| వెండి (గ్రా) | 52.00 | 52.30 |



| | హైదరాబాద్ | | విజయవాడ | | ప్రొద్దుటూరు | | రాజమహేంద్రవరం | | విశాఖపట్నం | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| బంగారం(24 క్యా) | 39,750 | 40,250 | 39,900 | 40,150 | 38,900 | 38,900 | 39,780 | 40,140 | 39,540 | 39,980 |
| ఆర్నమెంట్ | 37,150 | 37,570 | 37,040 | 37,180 | 35,920 | 35,970 | 36,820 | 37,060 | 36,780 | 37,180 |
| వెండి(కిలో) | 48,360 | 48,750 | 48,600 | 48,900 | 47,800 | 47,500 | 48,400 | 48,800 | 49,500 | 49,000 |

## ఫ్రిజ్‌లో పెట్టి తింటుంటే...



**కూర, పప్పు ఏ మాత్రం మిగిలిపోయినా వెంటనే ఫ్రిజ్‌లో పెట్టేస్తాం. అలా పెట్టినవాటిని ఎప్పుడో తీసుకుంటాం... ఇలా తీసుకునే ఆహారం ప్రమాదకరమని చెబుతున్నారు పోషకాహార నిపుణులు. మరి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలంటే...**



ఒకేసారి ఎక్కువగా వండేసి మిగిలిపోయిన ఆహార పదార్థాలను ఫ్రిజ్‌లో పెట్టేయడం చాలామంది చేసేదే. అలా నిల్వచేయడం వల్ల వాటిలోని పోషకాలు బయటకు వెళ్లిపోతాయి. అలాంటి ఆహారం తినడం వల్ల రకరకాల జబ్బులు వస్తాయి. క్యాన్సర్ వచ్చే ప్రమాదమూ లేకపోలేదు.

○ **బేకరీ ఉత్పత్తులు...** చాలామంది పేస్ట్రీలు, చాక్లెట్లు, స్వీట్లు... అన్నింటిని తెచ్చి ఫ్రిజ్‌లో కుక్కేస్తారు. చక్కెర, మైదాలతో తయారైన ఈ బేకరీ ఉత్పత్తులు ఎక్కువ సమయం ఫ్రిజ్‌లో భద్రపరిచి తినడం వల్ల గుండె సంబంధ సమస్యలు, రక్తపోటు, మధుమేహం లాంటి అనారోగ్యాలు తలెత్తవచ్చు. వాటిని తెచ్చుకున్న ఒకటి రెండురోజుల్లోనే పూర్తిచేయడం మంచిది.

○ **అన్నం...** మిగిలిపోయిన అన్నాన్ని ఫ్రిజ్‌లో పెట్టి ఆ తరువాత తినడం వల్ల జీర్ణ సంబంధ సమస్యలు తలెత్తుతాయి. అన్నం మాత్రం ఎప్పటికప్పుడు వేడిగా వండుకుని తినడమే ఉత్తమం.

○ **ఉప్పు, మసాలాలు...** ఊరగాయలు, సాస్‌లు, చట్నీల్లో ఉప్పు శాతం ఎక్కువగా ఉంటుంది. వీటిని ఫ్రిజ్‌లో భద్రపరిచి అదేపనిగా తీసుకోవడం వల్ల రక్తపోటు నియంత్రణలో ఉండదు. వాటిని పూర్తిగా మానేయాలని లేదు. మితంగా తీసుకోవాలి. పచ్చళ్లను మాత్రం ఎప్పటిప్పుడు ఇంట్లోనే తాజాగా చేసుకోవాలి.

○ **పండ్లు...** వీటినీ ఎక్కువకాలంపాటు ఫ్రిజ్‌లో భద్రపరిచి ఆ తరువాత తింటే అనారోగ్యం దరిచేరుతుంది. ఎప్పటికప్పుడు తాజా పండ్లను మాత్రమే తినాలి. ఏ మాత్రం కమిలిపోయినట్లు కనిపిస్తున్నా.. వాటిని పారేయడమే మంచిది.

○ **పెరుగు...** చాలాకాలం నిల్వ చేసిన పెరుగు తీసుకుంటే ఎసిడిటీ సమస్య ఎదురయ్యే అవకాశం ఎక్కువ. ఒకవేళ అది మిగిలిపోయినా దాన్ని కూరల్లో, గ్రేవీల్లో వేసుకోవడం, స్మూథీలా తయారు చేసుకోవడం మంచిది.

### నజరానా

**దుస్తులపై పడిన ఇంకు మరకలు పోవాలంటే... నెయిల్‌పాలిష్ రిమూవర్ రాసి... కాసేపయ్యాక వెన్నెతో ఉతికి చూడండి.**



## అమ్మాయిలు కుదిర్చిన మైత్రి

అనాథ చిన్నారులకు ఎవరూ ఉండరు. వయసుమీద పడి వృద్ధాశ్రమాల్లో ఉండే పెద్దవాళ్లేమో చిన్నపిల్లలతో కబుర్లు చెబుతూ కాలక్షేపం చేయాలనుకుంటారు. ఈ ఇద్దరి అవసరాలు గుర్తించిన ఓ విద్యార్థినుల బృందం ప్రత్యేకంగా ఓ యాప్‌ని అందుబాటులోకి తెచ్చింది. ఈ రెండు వర్గాలను సమన్వయం చేసేందుకు రూపొందించిన ఆ యాప్ పేరు 'మైత్రి'. ఒంటరితనానికి చేయూతనివ్వడమే తమ లక్ష్యం అంటోంది బృందం. అమెరికాలో జరిగిన 'గ్లోబల్ టెక్ కాంపిటీషన్'లో ఈ యాప్‌ను ప్రదర్శించి రజత పతకం అందుకున్నారీ విద్యార్థినులు. వాళ్లే నోయిడా, ఎమిటీ ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన 12వ తరగతి విద్యార్థినులు అనన్య గ్రోవర్, వన్షిక యాదవ్, వసుధ సుధీందర్, అనుష్క శర్మ, అరేఫా. 'మా బృందానికి 'టెక్ విచెస్' అని పేరు పెట్టుకున్నాం. అమెరికా, శాన్‌ఫ్రాన్సిస్కోలో ఈ ఏడాది జరిగిన టెక్నోవేషన్ ఛాలెంజ్ గురించి తెలుసుకుని దరఖాస్తు చేసుకున్నాం. ప్రపంచంలోనే అతి పెద్దదైన టెక్నాలజీ, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ప్రోగ్రాంగా పిలిచే ఈ పోటీలో పాల్గొనే అవకాశం రావడంతో మా యాప్‌ను ప్రదర్శించాం. దీన్ని చూసిన ప్రముఖులంతా మా పనితీరును గుర్తించి, ప్రశంసిస్తున్నప్పుడు చాలా ఆనందంగా అనిపించింది...' అని చెబుతున్నారు వీళ్లు.

### ❖ ఎలా పనిచేస్తుందంటే...



ఈ యాప్‌ను గూగుల్ ప్లేస్టోర్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఇందులో వృద్ధాశ్రమాలు, అనాథాశ్రమాల వివరాలు నమోదై ఉంటాయి. దీని ద్వారా ఒకరి గురించి మరొకరు తెలుసుకోవచ్చు. ఒకరినొకరు కలవొచ్చు. ఇప్పటివరకు దీన్ని వెయ్యిమంది డౌన్‌లోడ్ చేసుకున్నారు. ప్రస్తుతం ఈ యాప్ సేవలు దిల్లీకి మాత్రమే పరిమితమయ్యాయి. త్వరలో దేశవ్యాప్తంగా ఉన్న అనాథ, వృద్ధాశ్రమాలన్నింటినీ ఇందులో రిజిష్టరు చేయనుందీ విద్యార్థినుల బృందం. బాలికలకు మాత్రమే ప్రత్యేకంగా జరిగే ఈ పోటీలో ఈ ఏడాది 100 దేశాల నుంచి పాల్గొన్నారు.

email: vasundhara@eenadu.net

## వేలాడే పచ్చదనం



**కొద్దిగా సూర్యరశ్మి, సారవంతమైన మట్టి మిశ్రమం, కాస్తంత స్థలం ఉంటే చాలు... అందమైన కుండీల్లో మొక్కలను వేలాడదీసుకోవచ్చు. పెరట్లో అంతగా కనిపించని మొక్కలను సైతం ఈ హ్యాంగింగ్ బాస్కెట్లలో ఆకర్షణీయంగా పెంచుకోవచ్చు. వివిధ వర్ణాల పూలతో కనువిందు చేస్తాయివి.**

బృందావనం

వేలాడే కుండీల్లో నాటే మొక్కల్ని జాగ్రత్తగా ఎంచుకోవాలి. పెద్ద కుండీల్లో పెంచేందుకు ఒకే జాతి మొక్కలను, మరీ చిన్న కుండీలైతే ఒకే జాతి మొక్కలతోపాటు ఒకే ఆకారంలో ఆకులు, పూలు అందించే వాటిని ఎంపిక చేసుకోవాలి. బహువార్షికాలను నాటితే చలి ఎక్కువగా ఉన్నప్పుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. సూర్యరశ్మి, నీటిని ఒకే మోతాదులో తీసుకునే మొక్కలను గుంపుగా పెంచుకోవాలి. ఈ మొక్కల మధ్య సమతౌల్యం బాగుంటుంది.

○ **రంగులూ ముఖ్యమే:** ఎరుపు, పసుపు లేదా ఆకుపచ్చ, ఊదా రంగు మొక్కలను ఎంచుకోవాలి. ఏక వర్ణ మొక్కలు కావాలనుకుంటే ఎరుపు మేలు. ఏకవార్షిక పూల రకాలుగా ఆకుపచ్చ ఆకులున్నవి బాగుంటాయి. కుండీల రంగు, వాటిని వేలాడదీసే ప్రాంతం, బయటి వాతావరణాన్ని బట్టి మొక్కల వర్ణాన్ని ఎంపిక చేసుకోవాలి. వేలాడే, పాకే, లతలుగా ఎదిగే మొక్కలు చాలా ఆకర్షణీయంగా కనిపిస్తాయి.



○ **ఎలాంటి కుండీలంటే:** ఇనుప పళ్లాలు, వెడల్పాటి సీసాలు, ప్లాస్టిక్, సిరామిక్ కుండీలు, చెక్క పెట్టెలు, మట్టి కుండలు... ఇలా ఏదయినా వాడుకోవచ్చు. నీళ్లు బయటకు వెళ్లకపోతే మొక్క త్వరగా చనిపోతుంది కాబట్టి వాటికి రంధ్రాలు ఉండాలి. మొక్క పెరిగే కొద్దీ కుండీ బరువూ ఎక్కువవుతున్నప్పుడు గొలుసులు, తాడుతో వాటికి ఊతమివ్వాలి. మొక్కను ఇసుక లేదా పెర్లైట్‌లో పెంచాలా అనేది నిర్ణయించుకోవాలి. దీనివల్ల వేర్లకు గాలి అంది బాగా పెరుగుతాయి. తేమా చక్కగా అందుతుంది. పద్ధతి ప్రకారం రెండు వంతుల పీట్ మాస్ ఒక్కో వంతు చొప్పున ఇసుక, పెర్లైట్ వాడాలి. ద్రవరూప ఎరువులు వాడితే మేలైన ఫలితాలు ఉంటాయి. పిచికారి చేయడం కన్నా మొక్కలు నాటేముందు మట్టిలో ఎరువులు కలపడం మేలు.





మొక్కలన్నింటినీ కుండీల్లో నాటాకే అనుకున్న ప్రదేశంలో వేలాడదీయాలి. 10-14 అంగుళాల వ్యాసార్థం ఉన్న కుండీలను ఎంచుకోవాలి. వీటిలో ఒక్కోదానిలో మూడు మొక్కలను నాటుకోవచ్చు.

మొక్కలకు ప్రతిరోజూ నీరు పోయాలి. మట్టి మిశ్రమం పైభాగం నుంచి 25 శాతం తేమను కోల్పోయినప్పుడు నీటిని పిచికారి చేయాలి. వారానికోసారి ద్రవరూప ఎరువులను అందించాలి. ఎత్తుగా పెరిగిన వాటిని ఆకృతి ప్రకారం కత్తిరించుకోవాలి. మొక్క నాటే ముందు మట్టిని, పరికరాలను స్టెరిలైజ్ చేయాలి లేదా 1 : 10 నిష్పత్తిలో తయారుచేసిన క్లోరిన్ నీటితో తడపాలి. వాటి వేళ్లు ఉండల్లా చుట్టుకుపోతే బయటకు తీసి సరిచేసి మళ్లీ నాటాలి. కొత్తగా నాటిన మొక్కల్ని నాలుగైదు వారాల వరకు నేరుగా సూర్యరశ్మిలో ఉంచి తరువాత అనుకున్న ప్రదేశంలో వేలాడదీయాలి.

○ **ఏ మొక్కలంటే:** పూల మొక్కల్లో అబూటిలాన్ మెగా పొలిమికమ్, అలమంద, బిగోనియా (వేలాడే రకాలు), వేలాడే చామంతి, వేలాడే పెటూనియా, క్లైయాంథస్, బాల్‌సమ్, తలంబ్రాల మొక్క, ఫ్లేమ్ వాయిలెట్, కంప్యానులా, లిప్‌స్టిక్ మొక్కలు అనుకూలం. ఆకుల మొక్కల్లో కోలియస్, ఫిలోడెండ్రాన్, పొతీస్, స్పైడర్ ప్లాంట్, ఫన్స్, జెబ్రినా, ఆస్పరాగస్, కంగారో వైన్, ట్రేసిస్ కాన్షియా ఎంచుకోవాలి.



– సూరం సింధూజ,
అసిస్టెంట్ ప్రొఫెసర్, శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యానవన విశ్వవిద్యాలయం, హైదరాబాద్



టోక్యో ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో పి.వి.సింధు స్వర్ణం తేగానే అందరం సంతోషపడ్డాం.. ఆమె కోచ్ గోపీచంద్‌కు జేజేలు పలికాం.. అయితే హైదరాబాద్‌లో గోపీ దగ్గరే శిక్షణ పొందిన మరో ముగ్గురు షట్లర్లు పతకాలతో మెరిసారని తెలిసింది తక్కువమందికే.. వాళ్లు పతకాలు తెచ్చింది ప్రపంచ పారా బ్యాడ్మింటన్‌లో.. అందులో ఒకరు స్వర్ణం గెలిస్తే.. ఇద్దరు కాంస్యాలు తెచ్చారు. ఈ ఘనత సాధించిన ఆ క్రీడాకారులే మానసి జోషి, సుకాంత్ కదమ్, విక్రమ్ ఉమేశ్.. వికలాంగులని కలత పడకుండా... ఆత్మస్థైర్యంతో ప్రపంచ బ్యాడ్మింటన్‌లో మెరిసి అందరికి స్ఫూర్తిదాయకంగా నిలిచిన వీళ్ల కథ ఏంటో తెలుసుకుందామా..

# వైకల్యాన్ని స్మాష్ చేసి...



## బ్యాడ్మింటనే లోకం

అది 2011.. రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలైన ఓ యువతి చావుబతుకుల మధ్య ఆసుపత్రిలో కొట్టుమిట్టాడుతోంది. ఆమె ప్రాణాలు నిలబెట్టడానికి వైద్యులు శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. చాలాసేపు మృత్యువుతో పోరాడిన ఆమె తిరిగి స్పృహలోకి వచ్చింది. ఊపిరైతే నిలిచింది కానీ కళ్లు తెరిచి చూసుకుంటే తన ఎడమ కాలు లేదు. ముందు కుంగిపోయినా.. తర్వాత తేరుకుని తన కొత్త ప్రయాణాన్ని ఆమె ఆత్మవిశ్వాసంతో మొదలెట్టింది. బ్యాడ్మింటన్ రాకెట్‌నే ఆయుధంగా చేసుకుని జీవితాన్ని చీకటి చేసిన వైకల్యంపై యుద్ధం చేసింది. విజేతగా నిలిచింది.. అదీ మామూలు విజేతగా కాదు.. విశ్వవిజేతగా. ఇదీ మన హైదరాబాద్‌లోని గోపీచంద్ అకాడమీలో శిక్షణ పొందుతూ పారా బ్యాడ్మింటన్‌లో ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన మానసి కథ.

### బాల్యం నుంచే

ముంబయికి చెందిన మానసి చిన్నతనం నుంచే బ్యాడ్మింటన్ ఆడడం మొదలెట్టింది. ఆరేళ్ల వయసులోనే తండ్రితో కలిసి ఆడేది. జిల్లా స్థాయిలో కూడా ప్రాతినిథ్యం వహించింది. రోడ్డు ప్రమాదం తర్వాత తిరిగి పూర్వపు స్థాయికి చేరేందుకు ఆమెకు ఆట అవసరమైంది. ఫిట్‌గా ఉండడం కోసం తిరిగి రాకెట్ పట్టి బ్యాడ్మింటన్ కోర్టులో అడుగుపెట్టింది. కృత్రిమ కాలు సాయంతో కోర్టులో పరుగెడుతూ ఆటపై పట్టు సాధించింది. అంతర్జాతీయ స్థాయి టోర్నీల్లో పాల్గొని పతకాలు సాధించింది. 2015 ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ మిక్స్‌డ్ డబుల్స్‌లో రజతం నెగ్గిన ఆమె.. తాజాగా ప్రపంచ ఛాంపియన్‌షిప్ మహిళల సింగిల్స్ (ఎస్ఎల్3)లో పసిడితో సంచలనం నమోదు చేసింది.

"పారా బ్యాడ్మింటన్ ప్రపంచ ఛాంపియన్‌షిప్ కోసం కొన్ని నెలల ముందు నుంచే ప్రత్యేక శిక్షణ మొదలెట్టా. కోచ్ గోపీచంద్ ఆధ్వర్యంలో మానసికంగా, శారీరకంగా ఫిట్‌గా ఉండడంపై దృష్టి పెట్టా. మెంటల్ కండిషనింగ్ కోచ్ సాయంతో మానసికంగా మెరుగయ్యా. నేను బలవంతురాలిని.. ఏదైనా సాధించగలను అనే నమ్మకాన్ని పొందా. కీలక మ్యాచ్‌ల్లో ఒత్తిడికి లోను కాకుండా, ప్రశాంతంగా ఉండడం అలవాటు చేసుకున్నా. ఫలితం సాధించా. టోక్యో 2020 పారాలింపిక్స్ క్రీడల్లో స్వర్ణం దిశగా సాగుతున్నా. దేశానికి పసిడి అందించడమే నా లక్ష్యం" అని మానసి తెలిపింది.

## విక్రమార్కుడిలా..

ఆ దంపతులకు మగబిడ్డ పుట్టడంతో ఆ కుటుంబం ఆనందంలో మునిగిపోయింది. కానీ ఆ అబ్బాయికి రెండేళ్ల వయసులో పోలియో వల్ల కుడి కాలు దెబ్బతినడంతో తీవ్ర వేదనకు గురయ్యారు. అలా వికలాంగుడిగా మారిన ఆ పిల్లాడు.. ప్రపంచ స్థాయిలో పతకం తెస్తాడని ఎవరూ ఊహించలేదు. ఇటీవల ప్రపంచ ఛాంపియన్‌షిప్ పురుషుల సింగిల్స్ (ఎస్ఎల్3- ఎస్ఎల్4)లో కాంస్యంతో సత్తాచాటిన ఆ కుర్రాడే విక్రమ్ ఉమేశ్ కుమార్. క్రీడాకారులకు కనీస సౌకర్యాలు కూడా లేని బిహార్‌లోని మారుమూల గ్రామం నుంచి వచ్చిన ఈ 27 ఏళ్ల ఛాంపియన్ ప్రస్తుతం ప్రపంచ స్థాయిలో పతకం సాధించే షట్లర్‌గా మారిన ప్రయాణం ఆసక్తికరం.

### హైజంప్ నుంచి

విక్రమ్‌కు చిన్నప్పటి నుంచి అథ్లెటిక్స్ అంటే ఇష్టం.. 2010 జాతీయ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్‌లో పారా హైజంప్‌లో స్వర్ణం కూడా గెలిచాడు. కానీ ఓ గాయం అతనికి హైజంప్‌ను దూరం చేసింది. అయినా అతను నిరాశ చెందకుండా బ్యాడ్మింటన్‌లో తన అదృష్టాన్ని పరీక్షించుకోవాలనుకున్నాడు. 2011లో తొలిసారిగా రాకెట్ పట్టాడు. పట్టుదలతో శ్రమించాడు. రెండేళ్లు తిరిగేసరికి జాతీయ పారా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్స్‌లో కాంస్యం గెలిచి సత్తా చాటాడు. ఆ తర్వాతి ఏడాది ఆ కాంస్యం కాస్తా స్వర్ణంగా మారింది. ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకున్న అతణ్ని టాటా స్టీల్ సంస్థ ఆదుకుంది. బిహార్‌లో క్రీడాకారులకు సరైన వసతులు లేవని తన మకాంను ఝార్ఖండ్‌కు మార్చాడు. ప్రస్తుతం గోపీచంద్ అకాడమీలో శిక్షణ పొందుతున్నాడు. "ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో పతకం సాధించిన తర్వాత దేశానికి తిరిగి వచ్చినపుడు లభించిన స్వాగతం చూసి ఆశ్చర్యపోయా. మాకు కావాల్సింది ఆ ప్రోత్సాహమే. దివ్యాంగులమంటూ మమ్మల్ని వేరు చేసి చూసే అవకాశం ఇవ్వకూడదనే ఎప్పుడూ అనుకుంటా. అందుకే ఎంత కష్టమైనా సరే జీవితంతో పోరాడాల్సిందే అని నిర్ణయించుకొని బ్యాడ్మింటన్‌లోకి వచ్చా. టోక్యో పారాలింపిక్స్ కోసం సాధన మొదలెట్టా. దాంట్లో పతకం సాధించినా.. లేకపోయినా కూడా ప్రపంచ నంబర్‌వన్ ఆటగాడిగా ఎదగాలన్నదే నా లక్ష్యం" అని విక్రమ్ పేర్కొన్నాడు.





## అన్నయ్యే నడిపించాడు

సరదాగా పిల్లలు క్రికెట్ ఆడుతుండగా ఓ పదేళ్ల బాలుడు బంతి కోసం పరుగెడుతూ పట్టుతప్పి పడిపోయాడు. లేద్దామని ప్రయత్నిస్తున్నా అతని వల్ల కావట్లేదు. స్నేహితులంతా వచ్చి అతన్ని నిలబెట్టారు. ఎడమ మోకాలి నుంచి తీవ్రంగా రక్తం కారుతోంది. భరించలేని నొప్పి... కాలును నిటారుగా నిలపలేకపోతున్నాడు. అయినా చిన్నదెబ్బే కదా అని దాని గురించి పట్టించుకోలేదు. కానీ ఇన్ఫెక్షన్ కాలు మొత్తం పాకింది. మోకాలు దెబ్బతింది.. శస్త్రచికిత్స చేయాలని వైద్యులు చెప్పారు. ఒకటికి నాలుగు ఆపరేషన్లు చేశారు. గాయం మాత్రమే మానింది.. కానీ అతని మోకాలు వంగకుండా ఉండిపోయింది. అతను ఇంకెప్పుడు కాలును వంచలేడని తేలిపోయింది. అలాంటి పరిస్థితుల నుంచి వచ్చిన అతను ప్రస్తుతం ప్రపంచ పారా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్స్ పురుషుల సింగిల్స్ (ఎస్ఎల్4 విభాగం)లో కాంస్యం సాధించే స్థాయికి చేరుకున్నాడు. అతనే మహారాష్ట్ర పారా షట్లర్ 26 ఏళ్ల సుకాంత్ కదమ్.

### కళాశాల జట్టులో వద్దన్నారని

కాలు సరిగా లేకున్నా సుకాంత్ చిన్నతనం నుంచి అన్ని క్రీడల్లో ఆసక్తిగా పాల్గొనేవాడు. బ్యాడ్మింటన్ ఆడుతూ మంచి ప్రదర్శన కనబరిచేవాడు. తన ఇంజినీరింగ్ కళాశాల బ్యాడ్మింటన్ జట్టులో చోటు కోసం ప్రయత్నించి విఫలమయ్యాడు. ఆ కసితో ఆట మీద పట్టు సాధించేందుకు మొదలెట్టిన అతని ప్రయాణం ప్రపంచ ర్యాంకింగ్స్‌లో రెండో నంబర్ ఆటగాడిగా ఎదిగే వరకు తీసుకొచ్చింది. 2014లో ప్రొఫెషనల్ క్రీడాకారుడిగా మారిన అతను రెండేళ్ల పాటు అకుంఠిత దీక్ష, పట్టుదలతో కఠోర సాధన చేశాడు. 2016లో ఐరిష్ పారా బ్యాడ్మింటన్ టోర్నీలో కాంస్యంతో వెలుగులోకి వచ్చాడు. గతేడాది డెన్మార్క్ టోర్నీలో స్వర్ణంతో సత్తాచాటాడు. ఆ తర్వాత గోపీచంద్ అకాడమీలో చేరి... తాజాగా ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో పతకంతో మెరిశాడు. అతను మొదట్లో బ్యాడ్మింటన్ వైపు వెళ్తానంటే ఆర్థిక ఇబ్బందుల కారణంగా తల్లిదండ్రులు వద్దని వారించారు. కానీ తన అన్న శ్రీకాంత్ అతనికి అండగా నిలిచాడు. "ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో పతకం గెలిచినందుకు ఆనందంగా ఉంది. స్వర్ణం సాధించలేదనే అసంతృప్తితో ఉన్నా. టోర్నీలో పోటీ ఎక్కువగా ఉంది. గోపీచంద్ అకాడమీలో చేరిన తర్వాత నా ఆట పూర్తిగా మారిపోయింది. సింధు, సైనా, శ్రీకాంత్ లాంటి ఆటగాళ్లను చూసి స్ఫూర్తి పొందా. నేను ఈ స్థాయికి చేరానంటే దానికి మా అన్న కారణం. టోక్యో పారాలింపిక్స్‌లో పతకం సాధించడమే నా ప్రస్తుత లక్ష్యం" అని సుకాంత్ తెలిపాడు.

# గీత దాటినోడే..

2016 కొరియాతో పోరు ముందు డేవిస్‌కప్ ప్రాక్టీస్ సెషన్.. సీనియర్లందరూ కోర్టులో ఉన్నారు.. జట్టులో అందరికన్నా చిన్న అయిన ఆ కుర్రాడు మాత్రం రాలేదు..! 2017లో న్యూజిలాండ్ డేవిస్‌కప్ పోరు.. మళ్లీ ఆ కుర్రాడిది అదే తంతు.. ఈ రెండు సంఘటనలే కాదు.. సీరియస్‌గా ప్రాక్టీస్ సెషన్ నడుస్తుంటే అనుమతి లేకుండా ప్రియురాలిని తీసుకుని రావడం, మద్యం సేవించడం లాంటి సంఘటనలతో అప్పటి కోచ్ ఆనంద్ అమృత్‌రాజ్ ఆ కుర్రాడిని డేవిస్‌కప్ జట్టు నుంచి తప్పించాడు.. ఇలా ఆరంభంలోనే క్రమశిక్షణ రాహిత్యంతో కెరీర్‌ను ప్రశ్నార్థంగా మార్చుకున్న ఈ కుర్రాడు పునరాగమనంలో సత్తా చాటుతాడని అనుకుంటామా? గ్రాండ్‌స్లామ్ టోర్నీలో ఒక దిగ్గజ ఆటగాడితో తలపడి సెట్ గెలవడాన్ని ఊహించగలమా? కానీ అతను చేసి చూపించాడు.. యుఎస్ ఓపెన్లో స్విస్ గ్రేట్ రోజర్ ఫెదరర్‌తో ఆడి తొలి సెట్ గెలిచి అందర్ని ఆశ్చర్యపరిచాడు. ఆ కుర్రాడే సుమిత్ నాగాల్. ఈ దిల్లీ యువ సంచలనం భారత టెన్నిస్‌లో భవిష్యత్ తారగా ఎదుగుతున్నాడు.



**పేరు:** సుమిత్ నాగాల్
**పుట్టింది:** జైత్‌పుర్, హరియాణా, ప్రస్తుత నివాసం దిల్లీ
**కోచ్, మార్గనిర్దేశకుడు:** మహేశ్ భూపతి
**ఆరాధ్య ఆటగాడు:** రోజర్ ఫెదరర్
**వెలుగులోకి వచ్చింది:** 2015 వింబుల్డన్ జూనియర్స్ డబుల్స్ టైటిల్ గెలవడంతో
**ప్రస్తుత సింగిల్స్ ర్యాంకు:** 190

### క్రికెట్ నుంచి..

భారత్‌లో ఎక్కువమంది కుర్రాళ్లలాగే సుమిత్ ఆరంభంలో క్రికెట్ బ్యాటే పట్టాడు. అయితే అతనికి టెన్నిస్ నేర్పించాలని తండ్రి సురేశ్ కోరిక. ఏడేళ్ల వయసులో సుమిత్‌ను దిల్లీలోని డీడీఏ టెన్నిస్ అకాడమీలో అతణ్ని చేర్పించాడు. తండ్రి అంచనాలను నిలబెడుతూ సుమిత్ ఆరంభంలోనే సత్తా చాటాడు. హైదరాబాద్‌లో జరిగిన అండర్-12 టోర్నీలో సుమిత్ సత్తాచాటాడు. అక్కడ నుంచి మొదలుకొని సుమిత్ అవకాశం వచ్చిన ప్రతిసారి ప్రతిభ నిరూపించుకుంటూనే ఉన్నాడు. మెరుపు ఫోర్ హ్యాండ్ షాట్లు, నెట్ దగ్గరకు దూసుకొస్తూ వేసే డ్రాప్‌లు, పదునైన సర్వీస్‌లు సుమిత్ బలం.

### భూపతి తోడుగా..

సుమిత్ ఎదుగుదలలో భారత మాజీ డబుల్స్ స్టార్ మహేశ్ భూపతి పాత్ర ఎంతో ఉంది. 2008లో కెనడా కోచ్ బాబీ మహల్‌తో కలిసి నిర్వహించిన ప్రతిభాన్వేషణ కార్యక్రమంలో సుమిత్‌ను కనుగొన్న భూపతి.. ప్రత్యేక శ్రద్ధ తీసుకుని అతణ్ని మంచి ఆటగాడిగా తీర్చిదిద్దాడు. ఆ తర్వాత సుమిత్‌ను 2011లో మెరుగైన శిక్షణకు కెనడా పంపాడు. అక్కడ మూడేళ్లు శిక్షణ తీసుకున్న నాగాల్... ఆ తర్వాత జర్మనీకి వెళ్లి మారియానో డెల్ఫానో (అర్జెంటీనా) దగ్గర కోచింగ్‌కు చేరాడు. ఈ శిక్షణల ఫలితం అతనికి త్వరగానే వచ్చింది. 2015లో లే హొయాంగ్‌తో కలిసి వింబుల్డన్ డబుల్స్ టైటిల్ గెలిచాడు సుమిత్. ఆ తర్వాత 2017లో బెంగళూరు ఓపెన్లోనూ విజేతగా నిలిచాడు. వైల్డ్‌కార్డ్ ఎంట్రీగా బరిలో దిగి ఇదే టోర్నీలో తనకన్నా సీనియర్ అయిన యుకి బాంబ్రిని ఓడించాడు. వరుస విజయాలు సాధిస్తున్నా.. క్రమశిక్షణ తప్పాడనే చెడ్డపేరు అతని కెరీర్‌కు ఇబ్బందిగా మారింది. ఈ మచ్చను చెరిపేస్తూ గ్రాండ్‌స్లామ్ టోర్నీ సింగిల్స్ మెయిన్‌డ్రాకు అర్హత సాధించడమే కాక.. తొలి మ్యాచ్‌లో దిగ్గజ ఫెదరర్‌కు గట్టిపోటీ ఇచ్చాడు. 'మంచి భవిష్యత్ ఉంది ఈ కుర్రాడికి' అని ఫెదరర్‌తోనే కితాబు అందుకున్నాడు

# పాయింట్లలో ఆ తేడా ఎందుకు?

**వెస్టిండీస్‌తో తొలి టెస్టులో గెలిచిన భారత్‌కు 60 పాయింట్లు లభించాయి. యాషెస్ తొలి టెస్టులో గెలిచిన ఆస్ట్రేలియాకు, మూడో టెస్టులో గెలిచిన ఇంగ్లాండ్‌కు 24 పాయింట్లే వచ్చాయి. ఈ తేడా ఎందుకు? అసలు ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో పాయింట్లు ఎలా ఇస్తారు?**

గురు @ విజేత

ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టిక చూస్తే ఎవరికైనా ఈ సందేహాలు రావడం సహజం. ఈ తేడా ఎందుకో ఇప్పుడు చూద్దాం!

- ప్రస్తుత విధానం ప్రకారం టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా ప్రతి జట్టు (వేరు వేరు జట్లతో) సొంతగడ్డపై మూడు, విదేశాల్లో మూడు సిరీస్‌లు ఆడాల్సివుంటుంది. ప్రతి సిరీస్‌కు 120 పాయింట్లు కేటాయిస్తారు. అది ఐదు మ్యాచ్‌ల సిరీస్ అయినా, రెండు మ్యాచ్‌ల సిరీస్ అయినా పాయింట్లలో మార్పు ఉండదు. ఆ 120 పాయింట్లను సిరీస్‌లో ప్రతి మ్యాచ్‌కు సమానంగా కేటాయిస్తారు. భారత్, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ సమానంగా ఒక్కో మ్యాచ్‌లో నెగ్గినా పాయింట్లలో తేడా రావడానికి కారణం ఇదే. భారత్-విండీస్ సిరీస్‌లో రెండు మ్యాచ్‌లే కాబట్టి ఒక మ్యాచ్‌లో నెగ్గిన జట్టుకు 60 పాయింట్లు లభిస్తాయి. యాషెస్ సిరీస్‌లో ఐదు మ్యాచ్‌లు ఉన్నందున.. ఒక్క మ్యాచ్‌కు గరిష్ఠంగా ఇచ్చే పాయింట్లు 24 మాత్రమే. రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో ఓ మ్యాచ్ గెలిస్తే జట్టుకు 60 పాయింట్లు రావొచ్చు.. ఓడితే అదే స్థాయిలో నష్టం కూడా ఉంటుంది.
- ఓ మ్యాచ్ టై అయితే రెండు జట్లకు పాయింట్లు సమానంగా వస్తాయి. డ్రా అయితే మూడో వంతు పాయింట్లు లభిస్తాయి. ఉదాహరణకు భారత్-వెస్టిండీస్ సిరీస్‌లో విజయం/టై/డ్రాలకు వరుసగా 60/30/20 పాయింట్లు ఇస్తారు. అదే ఐదు మ్యాచ్‌ల యాషెస్‌లో అయితే వరుసగా 24/12/8 పాయింట్లు లభిస్తాయి.
- టెస్ట్ ఛాంపియన్‌షిప్ వల్ల ఐదురోజుల క్రికెట్ మరింత ఆసక్తికరంగా మారుతుందన్నది ఐసీసీ ఉద్దేశం. ఇకపై ఏ జట్టూ ఏ మ్యాచ్‌ను తేలిగ్గా తీసుకోదు. ప్రతి మ్యాచ్‌కూ విలువ ఉంటుంది. ఉదాహరణకు మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో ఓ జట్టు తొలి రెండు మ్యాచ్‌లు నెగ్గినా.. మూడో మ్యాచ్ నామమాత్రం కాదు. దానికీ పాయింట్లు ఉంటాయి కాబట్టి జట్లు సీరియస్‌గానే ఆడాల్సివుంటుంది. డ్రా కోసం కాకుండా.. జట్లు గెలుపు కోసమే ప్రయత్నించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

# కడుపు కట్టుకుంటే.. కర్పూరం చేశారు!

- కార్మికుల పొదుపు సొమ్ముకు రెక్కలు
- ఆర్టీసీ వాడుకున్న రూ. 520 కోట్ల ఊసేదీ
- రుణాల కోసం వేల మంది ఎదురుచూపులు
- వడ్డీ రూపంలో రూ. 45 కోట్లు కోల్పోయిన కార్మికులు
- పొదుపు సొసైటీ నుంచి వైదొలుగుతున్న సభ్యులు

ఈనాడు - హైదరాబాద్

అవసరాలకు పనికొస్తుందని కొందరు.. బిడ్డల చదువు సంధ్యలకు చేయూత అందుతుందని ఇంకొందరు.. అనారోగ్యం బారిన పడితే ఆదుకుంటుందని మరికొందరు.. ఇలా వేలాదిమంది ఆర్టీసీ కార్మికులు ఓ సహకార పరపతి సంఘాన్ని పెట్టుకుని నెలనెలా తమ జీతాల్లోంచి కొంత సొమ్ము దాచుకుంటుండగా.. ఆ సొమ్ము కాస్తా యాజమాన్యం ఖాతాలో కరిగిపోయింది. నెలనెలా కడుపు కట్టుకుని పొదుపు చేసుకున్న సొమ్ము అవసరంలో అందని పరిస్థితి ఏర్పడింది. రూ.కోటి కాదు రూ. పది కోట్లు కాదు.. ఏకంగా రూ. 520 కోట్లను వాడేసుకున్న యాజమాన్యం తిరిగి ఇవ్వకపోవడంతో కార్మికులకు రుణాలు ఇచ్చేందుకు ఆ పరపతి సంఘం కాస్తా బ్యాంకుల నుంచి అప్పులు తీసుకోవాల్సి వస్తోంది. ఇప్పటికే ఆర్టీసీ పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయింది. ఎప్పటికి బయటపడుతుందన్నది అంతుబట్టని ప్రశ్నగా మిగిలింది. ఈ నేపథ్యంలో అభద్రతతో కార్మికులు పొదుపు సంఘం నుంచి వైదొలగుతున్నారు.



### నెలకు రూ. 40 కోట్లు

ఆర్టీసీలో పని చేస్తున్న కార్మికులంతా కలిసి 1986లో సహకార పరపతి సంఘాన్ని (కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ- సీసీఎస్) ఏర్పాటు చేసుకున్నారు. తమ జీతభత్యాల నుంచి 7 శాతం మొత్తాన్ని ప్రతి నెలా ఈ సంఘంలో పొదుపు చేసుకుంటారు. ప్రస్తుతం ఇందులో 49,977 మంది సభ్యులున్నారు. కార్మికులు దాచుకున్న మొత్తానికి సీసీఎస్ 10 శాతం వడ్డీ చెల్లిస్తుంది. రుణాలు కావాలంటే వారికి 11 శాతానికి అప్పు ఇస్తుంది. ఇలా ఇప్పటివరకు కార్మికులకు సుమారు రూ. వెయ్యి కోట్ల వరకు అప్పులు ఇచ్చింది. వారి నుంచి తీసుకునే వడ్డీ సొమ్ముతో కార్మికులకు పెద్ద ఎత్తున సంక్షేమ కార్యక్రమాలను నిర్వహిస్తోంది.

### కత్తిరించి.. సొంత ఖాతాలోకి

ఆర్టీసీ యాజమాన్యమే కార్మికుల జీతాల నుంచి పొదుపు మొత్తాన్ని వసూలు చేసి, సీసీఎస్ ఖాతాలో జమ చేస్తుంది. ఇలా నెలకు రూ. 40 కోట్లను వసూలు చేస్తున్న ఆర్టీసీ.. 13 నెలలుగా ఆ సొమ్మును సొంత అవసరాలకు వాడేసుకుంటోంది. యాజమాన్యం సొమ్ము చెల్లించకపోవటంతో సీసీఎస్ కార్మికులకు అప్పులు ఇవ్వలేకపోతోంది. సంక్షేమ కార్యక్రమాలనూ అమలు చేయలేని పరిస్థితి నెలకొంది. రుణాల కోసం ఈ ఏడాది జనవరి నుంచి సుమారు 9,000 మంది ఎదురుచూస్తున్నారు. విధిలేక సీసీఎస్ వివిధ బ్యాంకుల నుంచి ఇప్పటి వరకు రూ. 200 కోట్లు రుణాలు తీసుకుని కార్మికులకు అప్పులు ఇచ్చింది. కార్మికుల పొదుపు మొత్తాన్ని తిరిగి ఇవ్వాలంటూ సొసైటీ ప్రతినిధులు యాజమాన్యానికి ఎన్ని వినతులు ఇచ్చినా ప్రయోజనం లేకపోవటంతో హైకోర్టును ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది.

### డిపాజిట్‌దారుల్లో ఆందోళన

బ్యాంకులతో పోలిస్తే డిపాజిట్లపై అధిక వడ్డీ ఇస్తుండటంతో పదవీ విరమణ చేసిన కార్మికులు సీసీఎస్‌లో సుమారు రూ. 250 కోట్ల వరకు డిపాజిట్లు చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో డిపాజిట్‌దారుల్లో ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. సుమారు 8,000 మంది కార్మికులు సీసీఎస్ నుంచి వైదొలగటం కార్మికుల్లో నెలకొన్న భయానికి మూలకారణం.

# నీళ్లు, విద్యుత్తు ముసుగులో దోపిడీ

- మధ్యమానేరు నిర్వాసితుల సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం
- సభలో అఖిలపక్ష నాయకులు



కొదురుపాకలో జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి. చిత్రంలో ఎల్.రమణ, కోదండరాం, చాడ వెంకట్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, బండి సంజయ్‌కుమార్ తదితరులు

**బోయినపల్లి, వేములవాడ గ్రామీణం, న్యూస్‌టుడే:** నీళ్లు, విద్యుత్తు ముసుగులో ప్రభుత్వం రూ.లక్షల కోట్ల దోపిడీకి పాల్పడుతోందని.. రాష్ట్రంలో ఏ ఒక్కరూ సంతోషంగా లేరని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, ఎంపీ రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం కొదురుపాకలో రాజరాజేశ్వర జలాశయం (మధ్యమానేరు) ముంపు నిర్వాసితుల ఐక్య వేదిక, అఖిలపక్షం ఆధ్వర్యంలో శుక్రవారం బహిరంగ సభ నిర్వహించారు. దీనికి ప్రతిపక్ష పార్టీల నేతలు హాజరయ్యారు. రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. "రూ. 38 వేల కోట్లతో నిర్మించాల్సిన కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ. 1.20 లక్షల కోట్లు వెచ్చించినా పూర్తి కాలేదు. నిర్వాసితుల ఇళ్ల నిర్మాణానికి రూ.5.4 లక్షల చొప్పున చెల్లిస్తానని చెప్పిన కేసీఆర్ మొండిచేయి చూపారు. రూ.వెయ్యి కోట్లు ఇస్తే వారిసమస్యలు పరిష్కారమవుతాయి. చింతమడకలో ఇంటికి రూ.10 లక్షల లబ్ధిచేకూర్చినప్పుడు.. సర్వం త్యాగం చేసిన నిర్వాసితులను ఎందుకు ఆదుకోరు?. ముంపు గ్రామంలో రాజ్యసభ సభ్యుడు సంతోష్‌కుమార్ కూలీగా పరిహారం తీసుకున్నారు, ఆయన సోదరి సౌమ్య, బంధువు గండ్ర రమణారావు ఆర్‌అండ్ఆర్ కింద ఇంటి స్థలం పట్టా, పరిహారం పొందారు.. కానీ, అసలైన నిర్వాసితులకు పరిహారం దక్కడంలేదు. నిర్వాసితులు పాదయాత్రగా హైదరాబాద్‌కు వచ్చి ఇందిరా పార్కు వద్ద ధర్నా చేయాలి. అందులో నేనూ పాల్గొంటా. బడ్జెట్ సమావేశాల్లో హక్కులు సాధించుకుందాం. కందికట్కూరును ముంపు గ్రామంగా ప్రకటిస్తానని చెప్పిన మంత్రి ఈటల తన పదవికి రాజీనామా చేసి నిర్వాసితులకు అండగా ఉండాలి"అనిపేర్కొన్నారు.

కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ మాట్లాడుతూ..నిర్వాసితులకు ఉపాధి కల్పించడంలో భాగంగా పరిశ్రమల ఏర్పాటుకు, పీఎం ఆవాస్‌యోజన కింద ఇళ్ల మంజూరుకు ప్రభుత్వం ప్రతిపాదనలు పంపిస్తే కేంద్రం నుంచి మంజూరు చేయిస్తానని చెప్పారు. హామీ నెరవేర్చకపోతే ఎంపీ పదవికి రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. నిర్వాసితులను కేసీఆర్ వద్దకు తీసుకెళ్లిన సమయంలో అది తన సతీమణి స్వగ్రామమని, సమస్యలు పరిష్కరిస్తానని ఆయన చెప్పినట్లు గుర్తుచేశారు. ఏళ్లు గడిచినా వారి సమస్యలు పరిష్కారం కావడంలేదన్నారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ కాళేశ్వరానికి జాతీయ హోదా రాకపోవడానికి కేసీఆర్, రాష్ట్ర ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. తెదేపా తెలంగాణ అధ్యక్షుడు రమణ మాట్లాడుతూ..సీఎం ఇచ్చిన హామీ నెరవేర్చడానికి రూ.600కోట్లు అవసరమవుతాయని, ఎందుకివ్వడం లేదన్నారు. తెజస అధ్యక్షుడు కోదండరాం మాట్లాడుతూ ఇక్కడి నుంచి ఇసుక తరలించగావచ్చిన డబ్బులతో నిర్వాసితుల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చవచ్చునిఅభిప్రాయపడ్డారు. సభలో ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు, విమలక్క, మాజీ ఎంపీలు వివేక్, పొన్నం ప్రభాకర్, ముంపు గ్రామాల ఐక్యవేదిక అధ్యక్షుడు కూస రవీందర్, కార్యదర్శి పిల్లి కనకయ్య పాల్గొన్నారు.

## రేవంత్ హద్దు మీరి మాట్లాడారు

- తెరాస నేతలు వేణుగోపాలచారి, కిషన్‌రావు

**ఈనాడు, హైదరాబాద్:** ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలకు అనుగుణంగా తెలంగాణలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేసిన ట్రాన్స్‌కో, జెన్‌కోల సీఎండీ డి.ప్రభాకర్‌రావుపై కాంగ్రెస్ ఎంపీ రేవంత్‌రెడ్డి అడ్డగోలు ఆరోపణలు చేస్తున్నారని, దిగజారి మాట్లాడుతున్నారని దిల్లీలో ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి, కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలాచారి ధ్వజమెత్తారు. ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న ఒక అధికారిపై ఇష్టారీతిన వ్యాఖ్యలు చేసిన రేవంత్‌ను కాంగ్రెస్ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఆగ్రోస్ ఛైర్మన్ లింగంపల్లి కిషన్‌రావుతో కలిసి శుక్రవారం తెలంగాణభవన్‌లో ఆయన మాట్లాడారు.

### ప్రభాకర్‌రావుపై వ్యాఖ్యలు సిగ్గుచేటు

సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు అంకితభావంతో పనిచేస్తూ విద్యుత్ రంగాన్ని అభివృద్ధిలోకి తీసుకొచ్చిన ప్రభాకర్‌రావుపై ఎంపీ రేవంత్‌రెడ్డి దారుణంగా మాట్లాడడం సిగ్గుచేటని తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి పేర్కొంది. శుక్రవారం హైదరాబాద్ కవాడిగూడలోని మఠంలో బ్రాహ్మణ సేవా సమితి అత్యవసర సమావేశంలో రేవంత్ వ్యాఖ్యలు ఖండించారు.

## పర్యావరణ పర్యాటక పార్కుకు నేడు ఎంపీ సంతోష్ శంకుస్థాపన

**ఈనాడు, హైదరాబాద్:** కీసరగుట్ట అటవీ ప్రాంతంలో తెరాస రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్‌కుమార్ నగర అటవీ, పర్యావరణ పర్యాటక పార్కు, మొక్కల పెంపకం చేపట్టనున్నారు. ఇందుకోసం తన నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి రూ. 2.95 కోట్లను వెచ్చించాలని నిర్ణయిస్తూ అటవీ శాఖ అధికారులకు లేఖ ఇచ్చారు. తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ జన్మదినం సందర్భంగా ఇచ్చిన పిలుపు మేరకు కీసరగుట్ట అటవీప్రాంతాన్ని సంతోష్ దత్తత తీసుకున్నారు. శనివారం ఉదయం 10 గంటలకు నగర అటవీ, పర్యావరణ పర్యాటక పార్కుకు ఆయన శంకుస్థాపన చేయనున్నారు. 10 వేల మొక్కలతో హరితహారం కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు.

### సీఎంకు ఉజ్వల ప్రస్థానం పుస్తకం

తాను రచించిన ఉజ్వల ప్రస్థానం, బంగారుబాట పుస్తకాలను సీఎం పౌరసంబంధాల అధికారి విజయ్‌కుమార్ శుక్రవారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌కు అందజేశారు. విజయకుమార్‌ను కేసీఆర్ అభినందించారు.

## అవినీతిపై చర్చకు ఈటల సిద్ధమా?

టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి కౌశిక్‌రెడ్డి సవాల్

**హుజూరాబాద్, న్యూస్‌టుడే:** మంత్రి ఈటల రాజేందర్ అవినీతిపై బహిరంగచర్చకు తాము సిద్ధమని, ఆయనే వేదిక, తేదీ, సమయం చెబితే ఆధారాలతో సహా నిరూపిస్తామని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి పాడి కౌశిక్‌రెడ్డి చెప్పారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ..తెరాస కార్యకర్తల సమావేశంలో తాను అవినీతిపరుడ్ని కాదని, ఎవరి వద్దనైనా రూ.5వేలు తీసుకున్నట్లు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని ఈటల చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. పౌరసరఫరాలశాఖ మంత్రిగా ఉన్నప్పుడు రైస్‌మిల్లర్లతో ఈటల కుమ్మక్కై క్వింటాలు బియ్యం ధర రూ. 15 నుంచి రూ. 30కి, బాయిల్డ్‌రైస్ ధర రూ. 25 నుంచి రూ. 50కి పెంచారని, దీనివల్ల ప్రభుత్వంపై రూ. 270కోట్ల భారం పడిందన్నారు. లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తప్పుడు పత్రాలు సృష్టించి రూ. 1,670కోట్లు చెల్లించాలని కేంద్ర ప్రభుత్వానికి నివేదికలు పంపించారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో రూ. 600కోట్ల కుంభకోణం జరిగిందని రేవంత్‌రెడ్డి ఆధారాలతో లేఖ పంపించడంతో కేంద్రం బిల్లుల చెల్లింపులు నిలిపివేసి ధాన్యం కొనుగోళ్లపై రైతులవారీగా వివరాలు పంపించాలని ఆదేశించిందన్నారు.

## వేగ నియంత్రణపై ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

**ఈనాడు, హైదరాబాద్:** రాష్ట్రంలో నడుస్తున్న వాహనాలు వేగ నియంత్రణ పరికరాలను వినియోగించకపోవడంపై రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. మితిమీరిన వేగం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, కేంద్ర చట్టం ప్రకారం వాహనాలు వేగ నియంత్రణ పరికరాలను (స్పీడ్ లిమిటింగ్ డివైజెస్- ఎస్ఎల్‌డీ) వినియోగించకపోవడాన్ని సవాలు చేస్తూ హైదరాబాద్‌కు చెందిన ది రైట్ సొసైటీ అనే స్వచ్ఛంద సంస్థ తరఫున అధ్యక్షుడు ఎ.వెంకటేశ్వరరెడ్డి ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. శుక్రవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆర్.ఎస్.చౌహాన్, జస్టిస్ ఎ.అభిషేక్‌రెడ్డిలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది బి.రచనారెడ్డి వాదనలు వినిపించారు. 'వాహనాల అతి వేగం వల్ల ప్రమాదాలు జరిగి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. రహదారి భద్రతపై జస్టిస్ రాధాకృష్ణన్ కమిటీ సిఫార్సుల మేరకు కేంద్ర రవాణా శాఖ జారీ చేసిన మార్గదర్శకాలను తెలంగాణ ప్రభుత్వం అమలు చేయడంలేదు. ఎస్ఎల్‌డీలను ప్రవేశపెట్టలేదు' అని వివరించారు. వాదనలను విన్న ధర్మాసనం రవాణా శాఖ ముఖ్యకార్యదర్శి, కమిషనర్లకు నోటీసులు జారీ చేస్తూ పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణను 2 వారాలకు వాయిదా వేసింది.

## విద్యుత్ వినియోగంలో మళ్లీ రికార్డు

**11,669 మెగావాట్లకు చేరిన డిమాండ్**

**ఈనాడు, హైదరాబాద్:** విద్యుత్ వినియోగంలో రోజుకొక కొత్త రికార్డు నమోదవుతోంది. తాజాగా శుక్రవారం 11,669 మెగావాట్ల డిమాండ్ నమోదైంది. గత 3 రోజులుగా రాష్ట్ర చరిత్రలో అత్యధిక డిమాండ్ ఉంటున్న సంగతి తెలిసిందే. గురువారం 11,606 మెగావాట్లు ఉండగా శుక్రవారం మరో 63 పెరిగింది. వ్యవసాయానికి వినియోగం అధికంగా ఉన్నందున డిమాండ్ పెరిగినట్లు విద్యుత్ పంపిణీ సంస్థలు తెలిపాయి.

# మీ రాజకీయాలు మీరు చేసుకోండి

- ఉద్యోగుల జోలికి రావొద్దు
- రేవంత్‌రెడ్డి క్షమాపణలు చెప్పేవరకు పోరాటం
- విద్యుత్తు ఉద్యోగుల నిరసన ర్యాలీ



ఖైరతాబాద్‌లోని విద్యుత్ సౌధ నుంచి గన్‌పార్క్ వరకు ర్యాలీ వెళ్తున్న విద్యుత్ ఉద్యోగులు

**ఖైరతాబాద్, వడ్డేపల్లి (హన్మకొండ), న్యూస్‌టుడే:** విద్యుత్తు సంస్థల సీఎండీ ప్రభాకర్‌రావుపై చేసిన వ్యాఖ్యలను మల్కాజిగిరి ఎంపీ రేవంత్‌రెడ్డి వెంటనే ఉపసంహరించుకుని, బహిరంగ క్షమాపణ చెప్పాలని విద్యుత్తు ఉద్యోగ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలకు నిరసనగా విద్యుత్ ఉద్యోగ సంఘాలు హైదరాబాద్‌లో శుక్రవారం ర్యాలీ చేపట్టాయి. ఖైరతాబాద్‌లోని విద్యుత్‌సౌధ నుంచి పాదయాత్రగా అసెంబ్లీ ముందున్న గన్‌పార్కు దాకా వెళ్లి అక్కడ నివాళులర్పించారు. మింట్ కాంపౌండ్‌లోని అంబేడ్కర్ కూడలిలో ఏర్పాటు చేసిన సభలో టీఎస్‌పీఈఏ నేతలు రత్నాకర్‌రావు, సదానందం, టీఈఈఏ నేత శివాజీ, టీపీడీఈఏ నేత బీసీరెడ్డి, అకౌంట్స్ అసోసియేషన్‌నేత అంజయ్య, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నేత మేడి రమేష్, బీసీ సంఘం నేత కుమారస్వామి, ఓసీ సంఘంనేత భానుప్రసాద్, 1104 నేత సాయిబాబా, 327 నేత రమేష్ తదితరులు మాట్లాడారు. విద్యుత్తుసంస్థల అభివృద్ధికి, ఉత్తమ సేవల కోసం కృషి చేసిన ప్రభాకర్‌రావుపై ఎంపీ స్థానంలో ఉన్న వ్యక్తి తప్పుడు ఆరోపణలు చేయడం ఉద్యోగులను బాధపెట్టిందన్నారు. ప్రభాకర్‌రావుపై చేసిన వ్యాఖ్యలను పార్లమెంటు స్పీకర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. మీ రాజకీయాలు మీరు చేసుకోండి తప్ప ఉద్యోగుల జోలికి రావొద్దని కోరారు. ఆరోపణలకు ఆధారాలుంటే రండి.. చర్చా వేదిక పెడదామని పిలుపునిచ్చారు. ఎస్టీ అసోసియేషన్ నేత రాంజీ, ఏఈఈల సంఘం నేత రాజేంద్రప్రసాద్, టీబీఈఏ నేత నెహ్రూ, మహిళా సంఘం నేత నాగ తులసిరాణి, టీఆర్‌వీకేఎస్ నేత ప్రకాష్, హెచ్-82 నేత సాయిలు తదితరులు పాల్గొన్నారు.

**రేవంత్ ఇంటికి కరెంట్ కట్ చేస్తాం:** రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై హన్మకొండలోని టీఎస్ఎన్పీడీసీఎల్ డిస్కం ప్రధాన కార్యాలయం ఉద్యోగులు నక్కలగుట్టలోని విద్యుత్ భవన్ నుంచి విధులు బహిష్కరించి ఏకశిలపార్కు వరకు ప్రదర్శన నిర్వహించారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్, కుడా ఛైర్మన్ మర్రియాదవ్‌రెడ్డి, మాజీ ఎంపీ సీతారాంనాయక్ వీరికి సంఘీభావం తెలిపారు. ఏకశిల పార్క్ వద్ద సమావేశంలో ఎన్పీడీసీఎల్ విద్యుత్ ఉద్యోగుల ఐకాస నేత వి.తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పేవరకు ఆందోళన కొనసాగిస్తామన్నారు. అవసరమైతే రాష్ట్రవ్యాప్త ఆందోళన చేపడతామని, రేవంత్‌రెడ్డి ఇంటికి విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. మరోవైపు రెండు రోజులుగా చేపడుతున్న ఆందోళనలో పాల్గొన్న ఉద్యోగినిపై ఎన్పీడీసీఎల్‌కు చెందిన ఓ జిల్లా స్థాయి ఉన్నతాధికారి వాట్సాప్ గ్రూపులో పోస్టు చేసిన వ్యాఖ్య ఎన్పీడీసీఎల్ వాట్సాప్ గ్రూపులతో పాటు, సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

## విద్యుత్ ఒప్పందాలపై శ్వేతపత్రం విడుదల చేయాలి

- భాజపా రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్

**గన్‌ఫౌండ్రీ, న్యూస్‌టుడే:** రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే విద్యుత్ ఒప్పందాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ సీఎం కేసీఆర్‌ను డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై సిట్టింగ్ న్యాయమూర్తితో విచారణ జరిపిస్తే ఆధారాలతో సహా నిరూపించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. లేకుంటే గవర్నర్, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ వ్యవహారంలో కాంగ్రెస్ నేతలు అధికారులను లక్ష్యంగా చేసుకుని సమస్యను పక్కదారి పట్టించేందుకు ప్రయత్నించడం దురదృష్టకరమన్నారు. అధికారులపై రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. భాజపా రాష్ట్రశాఖ ఆధ్వర్యంలో తెలంగాణ విద్యుత్ రంగ సమస్యలపై శుక్రవారం నాంపల్లిలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి రాకేశ్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో లక్ష్మణ్ మాట్లాడుతూ సౌరవిద్యుత్‌కు సంబంధించి కేంద్రం రాయితీలు ప్రకటించినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం అదనంగా చెల్లించిందని ఆరోపించారు. ఏపీ ప్రభుత్వ మాజీ సీఎస్ ఐవైఆర్ కృష్ణారావు మాట్లాడుతూ..విద్యుత్ రంగం దీర్ఘకాలిక సుస్థిరతపై తెలంగాణ ప్రభుత్వం సరైన నిర్ణయాలు తీసుకోలేదన్నారు. సౌర విద్యుత్ నిపుణులు వెంకట్ మాట్లాడుతూ సౌర విద్యుత్ అమ్మకాల్లో ఇష్టమైన వారికే ప్రభుత్వం మేలు చేకూర్చిందని ఆరోపించారు. ఏపీలో రూ.2.90కు యూనిట్ విద్యుత్ లభిస్తుంటే.. తెలంగాణలో రూ.5.70కు తీసుకోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. సీనియర్‌జర్నలిస్టు వేణుగోపాల్‌రావు, విద్యుత్‌రంగ నిపుణులు నర్సింహారెడ్డి, విశ్రాంత ఐఏఎస్ అధికారి దాసరి శ్రీనివాసులు, మాజీ మంత్రులు డీకే అరుణ, బాబూమోహన్, విజయరామారావు, విశ్రాంత ఎస్ఈ సుందర్‌రెడ్డి, పలు రంగాల నిపుణులు పాల్గొన్నారు.

## మంత్రి ఈటల నివాసం వద్ద సందడి

**ఈనాడు, హైదరాబాద్, మేడ్చల్ రూరల్, న్యూస్‌టుడే:** వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ ఇంటి వద్ద శుక్రవారం అభిమానులు, పార్టీ కార్యకర్తల సందడి నెలకొంది. గురువారం హుజూరాబాద్‌లో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యాన్ని సంతరించుకున్న నేపథ్యంలో శామీర్‌పేటలోని ఈటల ఇంటి వద్దకు ఉదయం వివిధ సంఘాల నాయకులు, పార్టీ కార్యకర్తలు, మహిళా సంఘాల నేతలు భారీగా తరలివచ్చారు. హుజూరాబాద్ నియోజకవర్గం నుంచి సన్నిహితులు వచ్చారు. కార్యకర్తల సమావేశంలో ఈటల చేసిన వ్యాఖ్యలు, తర్వాత వాటిపై ఆయన ఇచ్చిన స్పష్టతపై చర్చించారు. పలువురు తమ అభిప్రాయాలను వెల్లడించారు. మానకొండూరు తెరాస ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మంత్రితో కొంతసేపు మాట్లాడి వెళ్లిపోయారు.

## గుర్తింపు లేని కులాలపై సర్వేను 16లోగా పూర్తి చేయండి

**ఈనాడు, హైదరాబాద్:** రాష్ట్రంలోని గుర్తింపు లేని కులాలను బీసీ జాబితాలో చేర్చేందుకు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను త్వరగా పూర్తి చేయాలని బీసీ కమిషన్ ఛైర్మన్ రాములు కోరారు. ఈ నివేదికను సెప్టెంబరు 16లోగా అందించాలని గణాంకశాఖ అధికారులను ఆయన ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సంక్షేమభవన్‌లో 101 మంది గణాంకశాఖ అధికారులతో కమిషన్ సమీక్ష సమావేశం నిర్వహించింది. బీఎస్ రాములుతో పాటు సభ్యులు వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, ఆంజనేయగౌడ్, కార్యదర్శి అనితా రాజేంద్రలు ఇందులో పాల్గొన్నారు.

## ఐఐటీ ధన్‌బాద్, జీఎస్ఐ ఒప్పందం

**ఈనాడు, హైదరాబాద్:** ఖనిజాల అన్వేషణకు సంయుక్త పరిశోధన చేపట్టేందుకు ఐఐటీ ధన్‌బాద్, హైదరాబాద్‌లోని జియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా(జీఎస్ఐ) శుక్రవారం ఎంఓయూ కుదుర్చుకున్నాయి. జీఎస్ఐ అధికారులు ఐఐటీ ధన్‌బాద్ సహాయంతో ఖనిజాల అన్వేషణ లక్ష్యంగా పరిశోధన చేపడతారు. ఐఐటీ ధన్‌బాద్ వారికి పీహెచ్‌డీ అందిస్తుంది. ఏడుగురు జీఎస్ఐ అధికారులు పీహెచ్‌డీలో ప్రవేశం పొందనున్నారు. కార్యక్రమంలో ఐఐటీ సంచాలకుడు రాజీవ్ శేఖర్, జీఎస్ఐ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ సీహెచ్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## దేశ జీడీపీ తగ్గుదల ఆందోళనకరం

- పూర్తిగా మాంద్యంగా మారే ప్రమాదం ఉంది
- తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆందోళన

**ఈనాడు, హైదరాబాద్:** దేశ జీడీపీ ఐదేళ్లలో ఎప్పుడూ లేనంతగా తగ్గడం ఆందోళనకర పరిణామమేనని తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అభిప్రాయపడ్డారు. తాను ఆర్థికవేత్తను కానని, కానీ జీడీపీ మొదటి త్రైమాసికంలో 5.8% నుంచి 5 శాతానికి తగ్గిందన్న సమాచారంపై ఆందోళన చెందుతున్నట్లు తెలిపారు. ఇది పూర్తిస్థాయి మాంద్యంగా మారే ప్రమాదం ఉందని, దీనిని నివారించడానికి కేంద్ర ప్రభుత్వం వద్ద తగిన పరిష్కారాలు, సమాధానాలు, ఉపాయాలు ఉన్నాయా? ఎవరైనా ఆలోచిస్తున్నారా? అని శుక్రవారం ఆయన ట్విటర్‌లో ప్రశ్నించారు.

**కానిస్టేబుల్ ఫలితాల వెల్లడికి చొరవ:** తెలంగాణలో పోలీసు కానిస్టేబుల్ పరీక్ష ఫలితాల వెల్లడిలో జాప్యంపై హోం మంత్రి మహమూద్‌అలీ, డీజీపీ మహేందర్‌రెడ్డిలతో చర్చించి, ప్రక్రియను వేగవంతం చేయాలని కోరతానని కేటీఆర్ తెలిపారు. తాము పరీక్షలు రాసి, ఫలితాల కోసం ఎదురుచూస్తున్నామని, వాటి వెల్లడికి చొరవ తీసుకోవాలని ఓ నిరుద్యోగి చేసిన వినతిపై కేటీఆర్ స్పందించి, ఈ మేరకు సమాధానమిచ్చారు.



## మధ్యమానేరు గేట్లు నుంచి నీరు విడుదల

బోయినపల్లి మండలం మాన్వాడ వద్ద నిర్మించిన మధ్యమానేరు జలాశయం గేట్లను శుక్రవారం రాత్రి ఈఎన్‌సీ అనిల్‌కుమార్, సిరిసిల్ల ఎస్పీ రాహుల్ హెగ్డే ఎత్తి దిగువనకు నీరు విడుదల చేశారు. నీటిని విడుదల చేస్తున్నట్లు మూడు సార్లు సైరన్ వేయడంతో మాన్వాడ, ఇల్లంతకుంట మండలం కందికట్కూరు ప్రజలు పెద్ద ఎత్తున జలాశయం వద్దకు చేరుకున్నారు. –న్యూస్‌టుడే, బోయినపల్లి

## ప్రాజెక్టులకు 11శాతం వడ్డీతో రుణాలా?

- 'పాలమూరు' పేరుతో కొత్త నాటకానికి తెరలేపిన కేసీఆర్
- కాంగ్రెస్ శాసనసభాపక్ష నేత భట్టి విక్రమార్క



**హైదరాబాద్, న్యూస్‌టుడే:** సాగునీటి ప్రాజెక్టులకు తక్కువ వడ్డీకి రుణాలు ఇచ్చే సంస్థలను కాదని, కార్పొరేషన్ల పేరుతో 11 శాతం వడ్డీకి రుణాలు తీసుకోవాల్సిన అవసరం ఏమొచ్చిందని కాంగ్రెస్ శాసనసభాపక్ష నేత భట్టి విక్రమార్క ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శుక్రవారం అసెంబ్లీ మీడియాహాలులో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు రుణాల మొత్తం తీరే సరికి దాదాపు రూ.2లక్షల కోట్లు అవుతుందని, ఈభారం ప్రజల మీద పడదా? అని నిలదీశారు. కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తయిందని, అయిదారు నెలల్లో పాలమూరు ప్రాజెక్టునూ పూర్తి చేస్తామంటూ సీఎం కేసీఆర్ మరో కొత్త నాటకానికి తెరతీశారని విమర్శించారు. 25 శాతం పనులే జరిగిన కాళేశ్వరం ప్రాజెక్టును మొత్తం పూర్తయిందంటూ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఒక్క ఎకరాకైనా నీళ్లిచ్చారా? అని ప్రశ్నించారు. పాలమూరు పర్యటనలో ముఖ్యమంత్రి కేసీఆర్.. కాంగ్రెస్ నేతలను దద్దమ్మలు, సన్నాసులు అనడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావుపై ఎంపీ రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో విద్యుత్ ఉద్యోగులు చేపట్టిన ఆందోళనపై భట్టి స్పందించారు. ప్రభుత్వానికి, ప్రతిపక్షానికి మధ్య ప్రభాకర్‌రావు ఎందుకు తలదూర్చారని ప్రశ్నించారు. ఒప్పందాలు కుదుర్చుకున్న ప్రభుత్వం కానీ, సంబంధిత మంత్రి, సీఎం కానీ స్పందించాల్సి ఉండగా ఆయన మీడియా సమావేశం ఎందుకు పెట్టారన్నారు.

### ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడంలో యువజన కాంగ్రెస్ శ్రేణులు ముందుండాలని భట్టి పిలుపునిచ్చారు. శుక్రవారం ఇందిరాభవన్‌లో యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం రాష్ట్ర అధ్యక్షుడు అనిల్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. దీనికి ఆల్ ఇండియా యువజన కాంగ్రెస్ ఇన్‌ఛార్జి, ఏఐసీసీ కార్యదర్శి క్రిష్ణ అలెవెరు, తెలంగాణ ఇన్‌ఛార్జి జేబీ మాథ్యూస్, జిల్లాల అధ్యక్షులు, పదాధికారులు హాజరయ్యారు.

## ప్రైవేటు డిగ్రీ కళాశాలల తరలింపుపై కమిటీ!

**ఈనాడు, హైదరాబాద్:** ప్రైవేటు డిగ్రీ కళాశాలల తరలింపు ఇష్టారాజ్యంగా మారుతున్నందున అధ్యయనం చేసి స్పష్టమైన మార్గదర్శకాలు, నిబంధనల రూపకల్పనకు తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి.. విశ్వవిద్యాలయాల రిజిస్ట్రార్లతో కమిటీని నియమించనుంది. ప్రస్తుతం కళాశాలల తరలింపుపై ఉన్నత విద్యామండలికి కొన్నిసార్లు సమాచారం కూడా ఉండటం లేదు.

## అవినీతి నుంచి కేసీఆర్ తప్పించుకోలేరు: నాగం

**హైదరాబాద్, న్యూస్‌టుడే:** ప్రాజెక్టుల్లో జరిగిన అవినీతి నుంచి సీఎం కేసీఆర్ తప్పించుకోలేరని మాజీమంత్రి నాగం జనార్దన్‌రెడ్డి అన్నారు. అవినీతికి పాల్పడిన ఎందరో ముఖ్యమంత్రులు జైలుకు వెళ్లారు.. ప్రభుత్వం మారిన మరుక్షణం కేసీఆర్, మంత్రులు, సహకరించిన అధికారులకూ అదే పరిస్థితి ఎదురవుతుందని చెప్పారు. శుక్రవారం ఆయన గాంధీభవన్‌లో మాట్లాడారు.

APGVB ANDHRA PRADESH GRAMEENA VIKAS BANK
Head office :: Warangal
NOTICE INVITING TENDERS
Proposed FIRE HYDRANT SYSTEM, FIRE ALARM SYSTEM & FIRE EXTINGUISHERS & SOLAR HEATING SYSTEM at our Sangareddy Buildings, Dist. Sangareddy, Telangana State. (Refer Tender Notice No.13 & 14, Dated: 30/08/2019).
We invite sealed Tenders for FIRE HYDRANT SYSTEM, FIRE ALARM SYSTEM & FIRE EXTINGUISHERS & SOLAR HEATING SYSTEM at Sangareddy for APGVB. For details, see tender documents placed in our Banks' website: www.apgvbank.in. The last date of submission of tender is 21-09-2019 at HO, Warangal.
General Manager (I)

| | | |
|---|---|---|
| సెన్సెక్స్ ▲ 264 | 37333 | |
| నిఫ్టీ ▲ 75 | 11023 | |
| డోజోన్స్ 26380 ▲ 18 | | |
| నాస్‌డాక్ 7947 ▼ 27 | | |
| రూపాయి 71.42 ▲ 38 పైసలు | (ఒక అమెరికా డాలరుకు) | |
| ముడి చమురు 60.41 ▼ | (బ్రెంట్ ధర డాలర్లలో) | |

అమెరికా కాలమానం ప్రకారం శుక్రవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).



### ఘనం (+)

| నిఫ్టీ | 30న | మార్పు% |
|---|---|---|
| YES BANK | 59.95 | 4.44 |
| SUN PHARMA | 450.40 | 3.62 |
| INDUSIND BANK | 1395.75 | 3.35 |
| ZEE ENTERTAINMENT | 373.10 | 3.04 |
| TATA STEEL | 344.90 | 2.79 |
| HUL | 1881.90 | 2.67 |
| HINDALCO | 184.45 | 2.64 |

### గ్రహణం (-)

| నిఫ్టీ | 30న | మార్పు% |
|---|---|---|
| BHARTI INFRATEL | 250.45 | -3.10 |
| COAL INDIA | 184.75 | -2.25 |
| POWER GRID CORP. | 200.50 | -2.10 |
| EICHER MOTORS | 16258.45 | -1.69 |
| ONGC | 121.20 | -1.66 |
| HCL TECH | 1100.35 | -1.56 |
| KOTAK MAHI BANK | 1431.45 | -1.34 |

### విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)



| కరెన్సీ | కొనుగోలు | అమ్మకం | | | |
|---|---|---|---|---|---|
| అమెరికా డాలరు | 65.28 | 75.70 | బ్రెహ్రెయిన్ దీనార్ | 176.44 | 202.13 |
| పౌండ్ స్టెర్లింగ్ | 79.51 | 92.20 | కువైట్ దీనార్ | 195.40 | 242.92 |
| యూరో | 72.09 | 83.62 | ఒమన్ రియాల్ | 172.91 | 198.07 |
| జపనీస్ యెన్/100 | 61.31 | 71.10 | సౌదీ రియాల్ | 17.32 | 20.57 |
| ఆస్ట్రేలియా డాలరు | 43.81 | 50.69 | యూఏఈ దిర్హమ్ | 17.71 | 20.77 |
| సింగపూర్ డాలరు | 46.99 | 55.67 | మలేషియా రింగిట్ | 15.1493 | 18.63 |
| థాయ్ బాత్/100 | 212.88 | 254.51 | చైనీస్ యువాన్ | 7.1 | 11.52 |

### శుక్రవారం నిఫ్టీ కదలికలు




# లాభాంతం

- రాణించిన బ్యాంకింగ్, ఎఫ్ఎమ్‌సీజీ షేర్లు
- 264 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్

రెండు రోజుల నష్టాల అనంతరం సూచీలకు మళ్లీ లాభాల కళ సంతరించుకుంది. వృద్ధికి ఊతమిచ్చేందుకు ప్రభుత్వం మరిన్ని సంస్కరణలు చేపట్టొచ్చన్న ఆశలు ఇందుకు దోహదం చేశాయి. అంతర్జాతీయ మార్కెట్లు లాభాల్లో కదలాడటం, రూపాయి బలపడటం లాంటి అంశాలు కూడా మార్కెట్ సెంటిమెంట్ బలపడటానికి తోడ్పడ్డాయి. నిన్న భారీగా నష్టపోయిన బ్యాంకింగ్ షేర్లు తిరిగి లాభాల్లోకి రావడం... ఎఫ్ఎమ్‌సీజీ, లోహ షేర్లు రాణించడమూ సూచీల పరుగుకు కారణమైంది. అయితే మధ్యలో నష్టాల్లోకి జారుకున్నప్పటికీ.. సూచీలు అంతే వేగంగా పుంజుకోవడం గమనార్హం.

సానుకూలంగా మొదలై..




ఉదయం సెన్సెక్స్ 37,222.26 పాయింట్ల వద్ద సానుకూలంగానే ప్రారంభమైంది. ఆ తర్వాత కాసేపటికే నష్టాల్లోకి జారుకుంది. ఒకానొకదశలో 36,829.81 పాయింట్ల వద్ద ఇంట్రాడే కనిష్ఠానికి దిగివచ్చింది. మధ్యాహ్నం తర్వాత కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీ తిరిగి లాభాల బాట పట్టింది. చివరకు 263.86 పాయింట్లు పెరిగి 37,332.79 పాయింట్ల వద్ద ముగిసింది. రోజు మొత్తం మీద సూచీ 568 పాయింట్లు ఊగిసలాడటం గమనార్హం. నిఫ్టీ కూడా 74.95 పాయింట్లు పెరిగి 11,023.25 పాయింట్ల వద్ద స్థిరపడింది. వారం మొత్తం మీద చూస్తే సెన్సెక్స్ 631.63 పాయింట్లు, నిఫ్టీ 193.90 పాయింట్లు మేర పెరిగాయి.

**ఎనిమిది డీలా..**

సెన్సెక్స్‌లో 8 షేర్లు డీలాపడగా.. మిగిలిన 22 కంపెనీల షేర్లు లాభాలను మూటకట్టుకున్నాయి. అత్యధికంగా యెస్ బ్యాంక్ 3.75% పెరిగింది. సన్‌ఫార్మా (3.68%), ఇండస్‌ఇండ్ బ్యాంక్ (3.41%), టాటా స్టీల్ (2.8%), హిందుస్థాన్ యునిలీవర్ (2.72%), వేదాంతా (2.58%), టాటా మోటార్స్ (2.1%), హెచ్‌డీఎఫ్‌సీ (1.78%) షేర్లు రాణించిన వాటిలో ఉన్నాయి. ఇక పవర్ గ్రిడ్, ఓఎన్‌జీసీ, హెచ్‌సీఎల్ టెక్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఎల్అండ్‌టీ, ఎన్‌టీపీసీ షేర్లు 1-2% వరకు నష్టపోయాయి. బీఎస్ఈ రంగాల సూచీల్లో లోహ, ఎఫ్ఎమ్‌సీజీ, ఆరోగ్య సంరక్షణ, స్థిరాస్తి, ఆర్థిక, సాంకేతికత, ఐటీ రంగాలు 1.77% మేర రాణించాయి. విద్యుత్, భారీ యంత్రపరికరాలు, చమురు-గ్యాస్, సూచీలు 0.6% వరకు నష్టపోయాయి.

# జీడీపీ లబోదిబో

- ఆరేళ్ల కనిష్ఠానికి వృద్ధి రేటు
- ఏప్రిల్- జూన్‌లో 5 శాతమే



దిల్లీ: ఏప్రిల్- జూన్‌లో భారత ఆర్థికవ్యవస్థ నిరాశాజనక పనితీరు కనబర్చింది. దేశ జీడీపీ వృద్ధి ఆరేళ్ల కనిష్ఠానికి పడిపోయింది. 5 శాతానికి వృద్ధి రేటు పడిపోయిందని శుక్రవారం అధికారిక గణాంకాలు వెల్లడించాయి. 2012-14లో నమోదైన 4.3 శాతం తర్వాత ఇదే అత్యంత తక్కువ వృద్ధి రేటు. తయారీ రంగం నెమ్మదించడం, వ్యవసాయ ఉత్పత్తిలో క్షీణత లాంటివి దేశ వృద్ధిని వెనక్కి లాగేశాయి. 2018-19 ఏప్రిల్- జూన్‌లో జీడీపీ వృద్ధి 8 శాతంగా నమోదైంది. దేశ జీడీపీ వృద్ధిపై నేషనల్ స్టాటిస్టిక్స్ ఆఫీస్ విడుదల చేసిన వివరాలు ఇలా..

- 2019-20 తొలి త్రైమాసికంలో స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) విలువను రూ.35.85 లక్షల కోట్లుగా (2011-12 స్థిర ధరల వద్ద) అంచనావేశారు. 2018-19లో ఇదే సమయంలో ఈ విలువ రూ.34.14 లక్షల కోట్లుగా ఉంది. అంటే జీడీపీ 5 శాతం పెరిగిందన్నమాట.
- పెట్టుబడులకు ప్రామాణికంగా భావించే జీఎఫ్‌ఎస్‌ఎఫ్ (గ్రాస్ ఫిక్స్‌డ్ కేపిటల్ ఫార్మేషన్) విలువను రూ.11.66 లక్షల కోట్లుగా లెక్కగట్టారు. కిందటేడాది ఈ విలువ రూ.111.21 లక్షల కోట్లు.
- తయారీ రంగ జీవీఏ (స్థూల విలువ జోడింపు) వృద్ధి 0.6 శాతానికి క్షీణించింది. ఏడాదిక్రితం ఇదే సమయంలో ఈ రంగ వృద్ధి రేటు 12.1 శాతంగా ఉంది.
- వ్యవసాయ రంగ వృద్ధి రేటు కూడా కిందటేడాది ఇదే సమయంలో నమోదైన 5.1 శాతం నుంచి గణనీయంగా తగ్గి 2 శాతానికి పరిమితమైంది.
- నిర్మాణ రంగ వృద్ధి రేటు 5.7 శాతానికి నెమ్మదించగా.. గనుల రంగ వృద్ధి రేటు 2..7 శాతానికి పెరిగింది. ఏడాదిక్రితం ఇదే సమయంలో ఈ రెండు రంగాల వృద్ధి రేట్లు వరుసగా 9.6%, 2.7 శాతంగా నమోదయ్యాయి.

**దేశీయ, అంతర్జాతీయ పరిణామాలే కారణం**

వృద్ధి నెమ్మదించడానికి దేశీయ పరిణామాలతో పాటు అంతర్జాతీయ అంశాలూ కారణమయ్యాయని ముఖ్య ఆర్థిక సలహాదారు కె.వి.సుబ్రమణియన్ అన్నారు. ఆర్థిక వ్యవస్థ వృద్ధిని తిరిగి గాడిలో పెట్టేందుకు ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందని చెప్పారు. త్వరలోనే అధిక వృద్ధి రేటు దిశగా భారత ఆర్థిక వ్యవస్థ ముందుకు సాగుతుందనే నమ్మకం తనకు ఉందని అన్నారు. ద్రవ్యలోటు నియంత్రణకు కూడా ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. వృద్ధి 5 శాతానికి పడిపోవడాన్ని తీవ్రంగా ఆలోచించాల్సిన విషయంగా ప్రభుత్వం భావించి, తక్షణ చర్యలు చేపట్టాలని బయోకాన్ ఛైర్‌పర్సన్ కిరణ్ మజుందార్ షా అన్నారు.

## ద్రవ్యలోటు రూ.5.47 లక్షల కోట్లు

- బడ్జెట్ అంచనాలో 77.8 శాతానికి చేరిక

దిల్లీ: జులై చివరినాటికి ద్రవ్యలోటు 5.47 లక్షల కోట్లను చేరింది. 2019-20 బడ్జెట్ అంచనాలో ఇది 77.8 శాతం. ఏడాదిక్రితం ఇదే సమయంలో ద్రవ్యలోటు అప్పటి బడ్జెట్ అంచనాలో 86.5 శాతంగా నమోదైంది. ప్రభుత్వ వ్యయాలు, ఆదాయాల మధ్య వ్యత్యాసాన్ని ద్రవ్యలోటుగా పరిగణిస్తారు. 2019-20 ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యలోటు రూ.7.03 లక్షల కోట్లుగా ఉండొచ్చని ప్రభుత్వం బడ్జెట్లో అంచనా వేసింది. తొలి నాలుగు నెలల్లోనే ఈ అంచనాలో రూ.5,47,605 కోట్లు అంటే 77.8 శాతానికి ద్రవ్యలోటు చేరింది. అలాగే గత ఆర్థిక సంవత్సరం మాదిరే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2019-20) కూడా ద్రవ్యలోటును జీడీపీలో 3.3 శాతం లోపే నియంత్రించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. కంట్రోలర్ జనరల్ ఆఫ్ అకౌంట్స్ శుక్రవారం విడుదల చేసిన గణాంకాల వివరాలు ఇలా..

- జులై చివరినాటికి ఆదాయ రూపేణా రూ.3.82 లక్షల కోట్లు వచ్చాయి. పూర్తి ఆర్థిక సంవత్సరానికి ఆదాయాన్ని రూ.19.62 లక్షల కోట్లుగా ప్రభుత్వం అంచనా వేసింది. అంటే బడ్జెట్ అంచనాలో 19.5 శాతంగా నమోదైందన్నమాట. ఏడాదిక్రితం ఇదే సమయంలో కూడా ఇంతే శాతం మేర ఆదాయం నమోదైంది.
- మొత్తం వ్యయాలు రూ.9.47 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. బడ్జెట్ అంచనాలో (రూ.27.86 లక్షల కోట్లు) ఇది 31.8 శాతం. ఏడాదిక్రితం ఇదే సమయంలో మొత్తం వ్యయాలు బడ్జెట్ అంచనాలో 36.4 శాతంగా ఉంది.
- మూలధన వ్యయాలు బడ్జెట్ అంచనాలో 31.8 శాతంగా నమోదు కాగా.. కిందటేడాది ఇదే సమయంలో ఇది 37.1 శాతంగా ఉంది.

# ఉత్పత్తి రెట్టింపు.. లాభం నాలుగింతలు

రూ.లక్ష కోట్లతో ఓఎన్‌జీసీ పెట్టుబడి ప్రణాళిక

దిల్లీ: దేశీయ, అంతర్జాతీయ చమురు క్షేత్రాల నుంచి ఉత్పత్తిని రెట్టింపు చేసుకునే దిశగా ఓఎన్‌జీసీ అడుగులు వేస్తోంది. రిఫైనింగ్ సామర్థ్యాన్ని మూడింతలు పెంచుకునేందుకూ కసరత్తు చేస్తోంది. తద్వారా 2040 నాటికి లాభాలను నాలుగు రెట్లు పెంచుకోవాలని అనుకుంటోంది. ఇందుకుగాను 1500-1600 కోట్ల డాలర్ల (దాదాపు రూ.1,00,000 కోట్లు) పెట్టుబడిని ప్రణాళికను శుక్రవారం ప్రకటించింది. 'ఎనర్జీ స్ట్రాటజీ- 2040' ప్రణాళికతో ఓఎన్‌జీసీ సరికొత్త రూపు సంతరించుకోనుందని సంస్థ ఛైర్మన్, ఎండీ శశి శంకర్ తెలిపారు. ఈ ప్రణాళికలో భాగంగా ఆదాయం, ఉత్పత్తి, సామర్థ్యాన్ని పెంచుకునేందుకు పై లక్ష్యాలను నిర్దేశించుకుందని వెల్లడించారు. ఓ వైపు చమురు, గ్యాస్‌లో పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెడుతూనే హైడ్రోకార్బన్లపైనా ఓఎన్‌జీసీ దృష్టిని కేంద్రీకరించిందని పేర్కొన్నారు. వరుసగా నాలుగో సంవత్సరం కూడా చమురు గ్యాస్ ఉత్పత్తి పెరిగి 24.75 బిలియన్ క్యూబిక్ మీటర్లకు (బీసీఎం) చేరిందని చెప్పారు. 2024 కల్లా ఇది 32 బీసీఎంకు, 2040 కల్లా 40 బీసీఎంకు పెంచుకోవాలని అనుకుంటున్నట్లు చెప్పారు. 2040 కల్లా ప్రస్తుత లాభంలో నాలుగు రెట్ల వృద్ధిని సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఇందులో 10 శాతం చమురు- గ్యాసేతర విభాగాల నుంచి ఆర్జించాలని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుత మార్కెట్ విలువను కూడా 5-6 రెట్లు పెంచుకోవాలని ఓఎన్‌జీసీ లక్ష్యంగా నిర్దేశించుకుంది. అలాగే ప్రస్తుతం ఉన్న చమురు క్షేత్రాల్లో చాలా వరకు పాతవి కావడంతో ప్రాజెక్టుల పునరుద్ధరణకు పెట్టుబడులు పెట్టనున్నట్లు చెప్పారు. చమురు-గ్యాస్ ఉత్పత్తిని పెంచుకునేందుకు 27 ప్రధాన ప్రాజెక్టుల కోసం రూ.86,000 కోట్లు వెచ్చించాలని ఓఎన్‌జీసీ అనుకుంటోందని తెలిపారు. వీటితో పాటు విదేశీ చమురు క్షేత్రాల్లో, పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుల్లో, రిఫైనింగ్ సామర్థ్య విస్తరణకు కలిపి మొత్తంగా 1500- 1600 కోట్లు పెట్టుబడిగా పెట్టాలని ఓఎన్‌జీసీ ప్రణాళికలో పెట్టుకుందని వెల్లడించారు.




శుక్రవారం జరిగిన హెరిటేజ్ ఫుడ్స్ ఏజీఎంలో మాట్లాడుతున్న కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నారా బ్రాహ్మణి. చిత్రంలో నారా భువనేశ్వరి, కంపెనీ ప్రతినిధులు

# రోజుకు 25 లక్షల లీటర్ల పాల సేకరణ లక్ష్యం

- 2024 నాటికి సాధిస్తాం
- హెరిటేజ్ ఫుడ్స్ ఏజీఎంలో నారా బ్రాహ్మణి వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: పాడి రైతుల నుంచి రోజుకు 25 లక్షల లీటర్ల పాలు సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు, దీన్ని 2024 సంవత్సరం నాటికి సాధిస్తామని హెరిటేజ్ ఫుడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నారా బ్రాహ్మణి తెలిపారు. శుక్రవారం నాడు ఇక్కడ జరిగిన కంపెనీ వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం) లో ఆమె మాట్లాడుతూ 30 లక్షల కుటుంబాలకు పాలు అందించాలనేది తమ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రస్తుతం తమ కంపెనీ రోజుకు 19.6 లక్షల లీటర్ల పాలు సేకరిస్తున్నట్లు వివరించారు. 2018-19 ఆర్థిక సంవత్సరంలో అంచనాల కంటే మిన్నగా పనిచేసినట్లు, వాటాదార్లకు అధిక ప్రయోజనం చేకూర్చినట్లు తెలిపారు. మార్కెటింగ్- పంపిణీ కార్యకలాపాలపై అధికంగా దృష్టి కేంద్రీకరిస్తూ కంపెనీ ఉత్పత్తులను ఎక్కువ మంది వినియోగదార్లకు చేరువ చేసే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఎప్పటికప్పుడు కొత్త ఉత్పత్తులను ప్రవేశపెట్టటంతో పాటు తయారీ కార్యకలాపాల్లో అత్యుత్తమ సామర్థ్యాన్ని అందుకునేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. హెరిటేజ్ ఫుడ్స్‌కు ప్రస్తుతం రోజుకు 18.70 లక్షల లీటర్ల చిల్లింగ్ సామర్థ్యం ఉంది. అదే సమయంలో ఈ కంపెనీ 25.70 లక్షల లీటర్ల పాలను ప్రాసెస్ చేయగలదు. అంతేగాక రోజుకు 17.15 లక్షల లీటర్ల ప్యాకేజింగ్ సామర్థ్యం దీనికి ఉంది. దేశవ్యాప్తంగా ఇరవై రాష్ట్రాల్లో ఈ సంస్థ వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తోంది. 2018-19 ఆర్థిక సంవత్సరానికి వాటాదార్లకు 40 శాతం డివిడెండ్ (రూ.5 ముఖ విలువ కల ఒక్కో షేర్‌పై రూ.2 చొప్పున) చెల్లించేందుకు ఏజీఎంలో అనుమతి లభించింది. కంపెనీ బోర్డులో డైరెక్టర్‌గా వి.నాగరాజ నాయుడు, నాన్-ఎగ్జిక్యూటివ్ ఇండిపెండెంట్ డైరెక్టర్‌గా విష్ణు రాజులను తిరిగి నియమించటానికి ఏజీఎం ఆమోదముద్ర వేసింది.

# ఐటీ రిటర్న్‌ల గడువును పొడిగించలేదు

ఆ వార్తలు అవాస్తవం • దాఖలుకు నేడే చివరి రోజు

దిల్లీ: ఆదాయపు పన్ను (ఐటీ) రిటర్న్‌ల గడువు తేదీని మళ్లీ పొడిగించారంటూ సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తలను ఆదాయపు పన్ను (ఐటీ) విభాగం కొట్టిపారేసింది. రిటర్న్‌ల దాఖలుకు నేడే చివరి రోజు (ఆగస్టు 31) అని స్పష్టం చేసింది. 'ఐటీ రిటర్న్‌ల గడువు తేదీని మరో నెల రోజులు పొడిగించారంటూ సామాజిక మాధ్యమాల ద్వారా తప్పుడు ప్రచారం జరుగుతున్న విషయం మా దృష్టికి వచ్చింది ఇందులో ఎటువంటి నిజం లేదని మేం స్పష్టం చేస్తున్నాం. అందువల్ల గడువు తేదీ 31.08.2019లోగా రిటర్న్‌లు దాఖలు చేయాల్సిందిగా పన్ను చెల్లింపుదార్లకు మేం సూచన చేస్తున్నామ'ని ఐటీ విభాగం తన అధికారిక ట్విటర్ ఖాతాలో వెల్లడించింది. సెప్టెంబరు 30వ తేదీ వరకు రిటర్న్‌ల గడువును పొడిగిస్తూ ఆగస్టు 29వ తేదీన ఓ నోటీసును జారీ చేసిందంటూ వాట్సప్, ట్విటర్ సహా పలు సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం జరగడంతో పై విధంగా ఆదాయపు పన్ను విభాగం స్పష్టత ఇచ్చింది.

## ఐడీబీఐ బ్యాంక్ రెపో అనుసంధాన గృహ, వాహన వడ్డీ రేట్లు

8.3% నుంచి ప్రారంభం

దిల్లీ: రెపో అనుసంధానిత గృహ, వాహన వడ్డీ రేట్లను అందుబాటులోకి తేనున్నట్లు ఐడీబీఐ బ్యాంక్ వెల్లడించింది. వార్షిక వడ్డీ రేట్లు 8.3 శాతం నుంచి ప్రారంభం అవుతాయని పేర్కొంది. ఆర్‌బీఐ రెపో రేటును ప్రామాణికం చేసుకొని 'సువిధా ప్లస్ హోమ్ లోన్', 'సువిధా ప్లస్ ఆటో లోన్' పథకాలను తీసుకొని రానున్నట్లు ఐడీబీఐ బ్యాంక్ ఒక ప్రకటనలో తెలిపింది. సెప్టెంబరు 10 నుంచి వినియోగదారులకు ఇవి అందుబాటులోకి వస్తాయని పేర్కొంది. మంచి రుణ చెల్లింపు స్కోరు, వార్షిక ఆదాయం కనిష్ఠంగా రూ.6 లక్షలున్న కొత్త వినియోగదారుల కోసం ఈ రుణ పథకాలు తేనున్నట్లు తెలిపింది. 35 ఏళ్ల వరకు కాలపరిమితికి రూ.75 లక్షల వరకు గృహ రుణం ఇవ్వనున్నట్లు పేర్కొంది. ఏడేళ్ల వరకు కాలపరిమితికి రూ.25లక్షల వరకు వాహన రుణాలు పొందొచ్చని వెల్లడించింది. గృహ రుణాలకు వార్షిక వడ్డీ రేటు 8.3% నుంచి, వాహన రుణాలకు 8.9 శాతం నుంచి ప్రారంభం అవుతాయని బ్యాంకు వెల్లడించింది.




సూపర్‌క్రీట్ విడుదల కార్యక్రమంలో మాట్లాడుతున్న రామ్‌కో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బాలాజీ.కె.మూర్తి

# 'సూపర్‌క్రీట్' పర్యావరణహితం: రామ్‌కో

ఈనాడు, హైదరాబాద్: నిర్మాణాలను పగుళ్లు లేకుండా చూడటంతోపాటు, పర్యావరణహితంగానూ ఉండేందుకు ఉపయోగపడే ప్రీమియం సిమెంటు సూపర్‌క్రీట్‌ను రామ్‌కో సిమెంట్స్ తెలుగు రాష్ట్రాల విపణిలోకి విడుదల చేసింది. ఈ బ్లెండెడ్ సిమెంటు సూపర్‌క్రీట్ ఆవిష్కరణతో రామ్‌కో సిమెంట్స్ అన్ని రకాల సిమెంటు అవసరాలను తీర్చేందుకు సిద్ధమయ్యింది. ప్రధానంగా అత్యున్నత నాణ్యత, బలం కలిగిన కాంక్రీట్‌తో దీర్ఘకాలిక మన్నిక సైతం ఉంటుంది. సూపర్‌క్రీట్ విడుదల సందర్భంగా రామ్‌కో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (మార్కెటింగ్) బాలాజీ కె మూర్తి మాట్లాడుతూ.. ఈ ప్రీమియం సూపర్‌క్రీట్ సిమెంటు కృత్రిమ ఇసుకతో (ఎం-శాండ్) కూడా మన్నికైన కాంక్రీట్‌ను అందిస్తుందని తెలిపారు. ఉన్నత శ్రేణి కాంక్రీట్ కోసం ఓపీసీ 53 గ్రేడ్‌కు ప్రత్యామ్నాయంగా సూపర్‌క్రీట్‌ను ఉపయోగించవచ్చని వెల్లడించారు. ప్రత్యేకమైన బీఓపీపీ సంచుల్లో దీన్ని విడుదల చేస్తున్నామని, దీనివల్ల సిమెంటు కారిపోవడం అనే సమస్య తలెత్తదని వివరించారు. ఇప్పటికే దీన్ని తమిళనాడు, కేరళలలో అందిస్తున్నామని, అక్కడ మంచి ఆదరణ లభించిందని పేర్కొన్నారు. సొంతంగా ఇళ్లు కట్టుకుంటున్నవారి సంఖ్య పెరుగుతోందని, ఈ నేపథ్యంలో సిమెంటు గిరాకీకి పెద్దగా ఇబ్బందేమీ ఉండటం లేదని తెలిపారు. ముఖ్యంగా 2,000 చదరపు అడుగుల విస్తీర్ణంలోని ఇళ్లతోపాటు, ప్రభుత్వ గృహ నిర్మాణం కూడా పెరుగుతోందన్నారు. నగదు లభ్యత ఇతర కారణాల వల్ల పెద్ద నిర్మాణ సంస్థలు కొత్త ప్రాజెక్టుల విషయంలో ఆచి చూసే ధోరణి అవలంబిస్తున్నట్లు తెలుస్తోందని తెలిపారు.

# చత్తీస్‌గఢ్ స్టీలు ప్లాంటు వచ్చే ఏడాది ప్రారంభం

- ఎన్ఎండీసీ ఛైర్మన్

ఎన్. బైజేంద్ర కుమార్ వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: ప్రభుత్వ రంగ ఖనిజ సంస్థ అయిన ఎన్ఎండీసీ లిమిటెడ్ చత్తీస్‌గఢ్‌లో ఏర్పాటు చేస్తున్న స్టీలు ప్లాంటు నిర్మాణం పూర్తయ్యే దశలో ఉంది. ఏటా 3 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యం కల ఈ ప్లాంటు నిర్మాణం పూర్తకాబోతోందని, వచ్చే ఏడాది చివర్లో దీన్ని ప్రారంభిస్తామని ఎన్ఎండీసీ ఛైర్మన్ ఎన్.బైజేంద్ర కుమార్ ఇక్కడ కంపెనీ ఏజీఎం (వాటాదార్ల సర్వసభ్య సమావేశం) లో వెల్లడించారు. ఇనుప ఖనిజం, స్టీలు ఉత్పత్తి రంగాల్లో వస్తున్న మార్పులను ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. ఇనుప ఖనిజాన్ని ఉత్పత్తి చేయటంలో మనదేశం ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా నాలుగో స్థానంలో ఉంది. మొదటి మూడు స్థానాల్లో ఆస్ట్రేలియా, బ్రెజిల్, చైనా ఉన్నాయి. 2018-19 ఆర్థిక సంవత్సరంలో మనదేశం 210 మిలియన్ టన్నుల ఇనుప ఖనిజాన్ని ఉత్పత్తి చేసింది. ఇందులో ఎన్ఎండీసీ వాటా 32.4 మిలియన్ టన్నులు ఉండటం ప్రత్యేకత.

దేశీయ అవసరాలు పెరిగిపోవటంతో ఎన్ఎండీసీ లిమిటెడ్ ఇనుప ఖనిజం ఉత్పత్తిని గణనీయంగా పెంచాలని భావిస్తోంది. ఏటా 67 మిలియన్ టన్నుల ఖనిజాన్ని ఉత్పత్తి చేయాలని నిర్ణయించుకొని ఆ దిశగా సన్నాహాలు చేస్తున్నట్లు బైజేంద్ర కుమార్ తెలిపారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న గనులను ఇంకా విస్తరిస్తున్నట్లు, మరోపక్క చత్తీస్‌ఘఢ్ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థతో కలిసి వచ్చే నాలుగైదేళ్లలో 10 మిలియన్ టన్నుల ఖనిజాన్ని ఉత్పత్తి చేయనున్నట్లు వెల్లడించారు. అదే సమయంలో కొత్త గనుల కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. కేవలం ఇనుప ఖనిజం, స్టీలు ఉత్పత్తికే పరిమితం కాకుండా ఇతర లోహాలపై ఎన్ఎండీసీ దృష్టి సారించింది. ముఖ్యంగా టాంజానియాలో బంగారం తవ్వకాలు చేపట్టాలని నిర్ణయించింది. టాంజానియాలో ప్రయోగాత్మకంగా బంగారం కర్మాగారాన్ని నెలకొల్పనున్నట్లు సీఎండీ తెలిపారు. అదేవిధంగా ఆస్ట్రేలియాలోని లెగసీ ఐరన్‌ఓర్ లిమిటెడ్‌కు ఉన్న గనుల్ల ఇనుప ఖనిజంతో పాటు బంగారం, ఇతర ప్రాథమిక లోహాలు, టంగ్‌స్టన్ తవ్వకాలు చేపట్టనున్నట్లు వివరించారు. లెగసీ ఐరన్‌ఓర్ లిమిటెడ్‌లో ఎన్ఎండీసీకి 78.6 శాతం వాటా ఉంది. మొజాంబిక్‌లోని ఐసీవీఎల్ గత ఆర్థిక సంవత్సరంలో ఒక మిలియన్ టన్నుల కోకింగ్ కోల్ ఉత్పత్తి చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సంస్థలో ఎన్ఎండీసీ, సెయిల్, ఆర్ఐఎన్ఎల్ భాగస్వాములుగా ఉన్నాయి.

ఎన్నో సవాళ్లు ఎదురైనప్పటికీ గత ఆర్థిక సంవత్సరంలో, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో మెరుగైన పనితీరు కనబరచినట్లు బైజేంద్ర కుమార్ విశ్లేషించారు.

## బీఎస్ఈలో వారం గడువు ఎఫ్అండ్ఓ ఈక్విటీ కాంట్రాక్టులు

సెప్టెంబరు 19 నుంచి అందుబాటులోకి

దిల్లీ: ఈక్విటీ డెరివేటివ్ విభాగంలో వారం రోజులు గడువుండే ఫ్యూచర్, ఆప్షన్ల (ఎఫ్అండ్ఓ) కాంట్రాక్టులను బొంబే స్టాక్ ఎక్స్ఛేంజీ (బీఎస్ఈ) తీసుకొని రానుంది. వారంతో గడువు తీరిపోయే 7 ఫ్యూచర్లు, 7 ఆప్షన్ల షేర్ల కాంట్రాక్టులను 2019 సెప్టెంబరు 19 నుంచి అందుబాటులోకి తేనున్నట్లు ఎక్స్ఛేంజీ ఒక ప్రకటనలో వెల్లడించింది. ప్రతి గురువారం ఈ వారం కాంట్రాక్టుల గడువు తీరిపోతుందని పేర్కొంది. ఒకవేళ గురువారం నాడు సెలవు వస్తే ఆ మరుసటి రోజు గడువు ముగుస్తుంది. అలాగే పాత వాటి గడువు తీరాక ఆ మరుసటి ట్రేడింగ్ రోజు నుంచి కొత్త కాంట్రాక్టులు అందుబాటులోకి వస్తాయని పేర్కొంది. ప్రస్తుతమున్న షేర్ల ఫ్యూచర్లు, ఆప్షన్లకు ఎంతైతే లాట్ పరిమాణం, స్ట్రైక్ ప్రైస్ (లక్షిత ధరలు)లు ఉన్నాయో వారం గడువు డెరివేటివ్ కాంట్రాక్టులకు కూడా అవే కొనసాగుతాయని వెల్లడించింది.

### 30వ తేదీకి ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)



(100కు రూపాయలలో) కోడిగుడ్లు

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 330 | నమక్కల్ | 359 |
| చిల్లరగా(ఒక గుడ్డు) | 3.90 | 31వ తేదీకి | |
| బెంగళూరు | 348 | వరంగల్ | 333 |
| విజయవాడ | 342 | విశాఖపట్నం | 361 |
| గోదావరి | 342 | చెన్నై | 360 |
| | | చిత్తూరు | 353 |

# ప్రభుత్వ బ్యాంకులు.. భారీ సంస్కరణలు



ఆర్థిక వ్యవస్థ మందగమనం నుంచి కోలుకోవడానికి ప్రభుత్వం మెరుగైన మందులు వేస్తూనే ఉంది. తిరిగి వృద్ధి దిశగా ప్రగతి రథాన్ని పరుగులు తీయించడానికి గత వారం రోజుల్లో పలు ఉద్దీపన చర్యలను ప్రకటించిన ప్రభుత్వం తాజాగా బ్యాంకు విలీనాలను ప్రకటించింది. తద్వారా బ్యాంకింగ్ వ్యవస్థను బలోపేతం చేయాలని భావిస్తోంది. గత శుక్రవారం వాహన వంటి పలు రంగాలకు ఉద్దీపన చర్యలు ప్రకటించిన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామనే ఈ శుక్రవారం కూడా బ్యాంకింగ్ సంస్కరణలకు తెరలేపారు. ముఖ్యంగా అంతర్జాతీయ స్థాయిలో పెద్ద బ్యాంకులు ఉండాలన్న ప్రభుత్వ ఉద్దేశానికి తగినట్లుగా.. నాలుగు విలీనాలను ప్రకటించారు. గత ఆర్థిక సంవత్సరం బ్యాంకు మోసాలు 74 శాతం పెరిగాయని ఆర్‌బీఐ తన వార్షిక నివేదికలో ప్రకటించిన మరుసటి రోజే 10 బ్యాంకులను విలీనం చేసి 4 దిగ్గజ బ్యాంకులను తయారు చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో 12 ప్రభుత్వ రంగ బ్యాంకులు మాత్రమే మిగులుతాయి.

ఈనాడు బిజినెస్

### పీఎన్‌బీ+ ఓబీసీ+ యునైటెడ్ బ్యాంక్

| | పీఎన్‌బీ | ఓబీసీ | యునైటెడ్ బ్యాంక్ | విలీనానంతర బ్యాంకు |
|---|---|---|---|---|
| మొత్తం వ్యాపారం (రూ.కోట్లలో) | 11,82,224 | 4,04,194 | 2,08,106 | 17,94,526 |
| స్థూల రుణాలు (రూ.కోట్లలో) | 5,06,194 | 1,71,549 | 73,123 | 7,50,867 |
| డిపాజిట్లు (రూ.కోట్లలో) | 6,76,030 | 2,32,645 | 1,34,983 | 10,43,659 |
| దేశీయ శాఖలు | 6,992 | 2,390 | 2,055 | 11,437 |
| నికర నిరర్థక ఆస్తుల నిష్పత్తి | 6.55% | 5.93% | 8.67% | 6.61% |
| ఉద్యోగులు | 65,116 | 21,729 | 13,804 | 1,00,649 |

### యూనియన్ బ్యాంక్+ ఆంధ్రా బ్యాంక్+ కార్పొరేషన్ బ్యాంక్

| | యూనియన్ బ్యాంక్ | ఆంధ్రా బ్యాంక్ | కార్పొరేషన్ బ్యాంక్ | విలీనానంతర బ్యాంకు |
|---|---|---|---|---|
| మొత్తం వ్యాపారం (రూ.కోట్లలో) | 7,41,307 | 3,98,511 | 3,19,616 | 14,59,434 |
| స్థూల రుణాలు (రూ.కోట్లలో) | 3,25,392 | 1,78,690 | 1,35,048 | 6,39,130 |
| డిపాజిట్లు (రూ.కోట్లలో) | 4,15,915 | 2,19,821 | 1,84,568 | 8,20,304 |
| దేశీయ శాఖలు | 4,292 | 2,885 | 2,432 | 9,609 |
| నికర నిరర్థక ఆస్తుల నిష్పత్తి | 6.85% | 5.73% | 5.71% | 6.3% |
| ఉద్యోగులు | 37,262 | 20,346 | 17,776 | 75,384 |

### ఇండియన్ బ్యాంక్+ అలహాబాద్ బ్యాంక్

| | ఇండియన్ బ్యాంక్ | అలహాబాద్ బ్యాంక్ | విలీనానంతర బ్యాంకు |
|---|---|---|---|
| మొత్తం వ్యాపారం (రూ.కోట్లలో) | 4,29,972 | 3,77,887 | 8,07,859 |
| స్థూల రుణాలు (రూ.కోట్లలో) | 1,87,896 | 1,63,552 | 3,51,448 |
| డిపాజిట్లు (రూ.కోట్లలో) | 2,42,076 | 2,14,335 | 4,56,411 |
| దేశీయ శాఖలు | 2,875 | 3,229 | 6,104 |
| నికర నిరర్థక ఆస్తుల నిష్పత్తి | 3.75% | 5.22% | 4.39% |
| ఉద్యోగులు | 19,604 | 23,210 | 42,814 |

### కెనరా బ్యాంక్+ సిండికేట్ బ్యాంక్

| | కెనరా బ్యాంక్ | సిండికేట్ బ్యాంక్ | విలీనానంతర బ్యాంకు |
|---|---|---|---|
| మొత్తం వ్యాపారం (రూ.కోట్లలో) | 10,43,249 | 4,77,046 | 15,20,295 |
| స్థూల రుణాలు (రూ.కోట్లలో) | 4,44,216 | 2,17,149 | 6,61,365 |
| డిపాజిట్లు (రూ.కోట్లలో) | 5,99,033 | 2,59,897 | 8,58,930 |
| దేశీయ శాఖలు | 6,310 | 4,032 | 10,342 |
| నికర నిరర్థక ఆస్తుల నిష్పత్తి | 5.37% | 6.16% | 5.62% |
| ఉద్యోగులు | 58,350 | 31,535 | 89,885 |

# మిగిలేవి 12 బ్యాంకులే

## లాభాలు

- ప్రతిపాదిత విలీనం వల్ల ప్రభుత్వ రంగ బ్యాంకుల సంఖ్య తగ్గుతోంది. దీనివల్ల భవిష్యత్తులో వాటికి మూలధనం సమకూర్చటం, పర్యవేక్షణ- పనితీరు లక్ష్యాల నిర్దేశం... వంటి పనులు సులువు అవుతాయి.
- మనదేశ ఆర్థిక వ్యవస్థ వేగంగా విస్తరిస్తోంది. ఈ క్రమంలో పెద్ద పెద్ద వ్యాపార సంస్థలకు పెద్ద మొత్తాల్లో రుణాలు అవసరం అవుతాయి. చిన్న బ్యాంకులు భారీ రుణాలు ఇవ్వలేవు. విలీనం వల్ల ఏర్పడే పెద్ద బ్యాంకుల ఆస్తి అప్పుల పట్టీలు పెద్దవిగా ఉంటాయి. కాబట్టి పెద్ద వ్యాపార సంస్థలకు అవసరమైన అప్పులు ఇచ్చే శక్తియుక్తులు వాటికి సమకూరతాయి.
- పెద్ద బ్యాంకులు అయితే ప్రతిసారి తమ మూలధన అవసరాలకు ప్రభుత్వం మీద ఆధారపడకుండా బహిరంగ మార్కెట్ నుంచి నిధులు సమీకరించగలుగుతాయి.
- ఆర్థికంగా ఏమైనా ఇబ్బందులు ఎదురైనప్పటికీ పెద్ద బ్యాంకులు తట్టుకోగలుగుతాయి. చిన్న బ్యాంకులకు అటువంటి సానుకూలత ఉండదు.
- పెద్ద సైజు కారణంగా పనితీరులో, ఇతరత్రా అన్ని రకాలుగా పెద్ద బ్యాంకులు సమర్థంగా వ్యవహరించగలవు. రెండు మూడు బ్యాంకులు కలిసి ఒకటి అవుతున్నందున నిర్వహణ వ్యయాలు తగ్గుతాయి. శాఖల విషయంలో, ఏటీఎం కేంద్రాల విషయంలో హేతుబద్ధత సాధించవచ్చు. దగ్గర దగ్గర ఉండే శాఖలు, ఏటీఎంలను తగ్గించుకోవచ్చు.
- మొండి బాకీల సమస్యను అధిగమించటానికి అవకాశాలు మెండుగా ఉంటాయి.

## సవాళ్లు

- ప్రస్తుతం విలీనం అవుతున్న బ్యాంకుల్లో కొన్ని బలహీనమైన బ్యాంకులున్నాయి. వాటికి తగినంతగా మూలధనం కూడా లేదు. విలీనం తర్వాత ఈ బలహీనతను వాటిని తనలో కలుపుకున్న బ్యాంకు భరించాల్సి వస్తుంది. ఇదొక పెద్ద సమస్య.
- ఉదాహరణకు పీసీఏ (ప్రాంప్ట్ కరెక్టివ్ యాక్షన్) కింద ఉన్న బలహీనమైన దేనా బ్యాంకును బలమైన బ్యాంకు అయిన బ్యాంక్ ఆఫ్ బరోడాలో కలిపారు. ఇందులో కలిసిన విజయా బ్యాంకు కూడా బలమైనదే. కానీ ఆ తర్వాత దేనా బ్యాంకు ఇబ్బందులను బ్యాంక్ ఆఫ్ బరోడా మోయాల్సి వస్తోంది.
- రెండు మూడు బ్యాంకులను కలపాలంటే సాఫ్ట్‌వేర్ నుంచి సిబ్బంది, పని సంస్కృతి... అన్నీ సమస్యలే అవుతాయి. వాటిని అధిగమించటం ఎంతో కష్టమైన పని. విలీనం తర్వాత ఒకటి- రెండేళ్లు ఈ సర్దుబాట్లతోనే సరిపోతుంది. ముఖ్యంగా సిబ్బంది బదిలీలు, ప్రమోషన్లు, పనితీరు మదింపు... వంటి సవాళ్లను ఎదుర్కొనాల్సి వస్తుంది.
- చిన్న బ్యాంకులకు వినియోగదార్లతో వ్యక్తిగత సంబంధ బాంధవ్యాలు ఉంటాయి. పెద్ద బ్యాంకులకు ఇటువంటి సానుకూలత ఉండదు. ఎవరూ ఎవరినీ పట్టించుకోనట్లుగా పరిస్థితి ఉంటుంది. ఈ పరిస్థితుల్లో కొందరు వినియోగదార్లు వేరే బ్యాంకులకు వెళ్లిపోవచ్చు.
- పెద్ద బ్యాంకులు ఏర్పాటు కావటం వినియోగదార్లకు నష్టదాయకం. ఒక రకంగా ఏకస్వామ్యం వచ్చినట్లే. అన్ని విషయాల్లో వినియోగదార్లపై పెత్తనం సాగించే అవకాశం ఉంటుంది. తమ వ్యాపారం, లాభాలు తప్పిస్తే... వినియోగదార్ల ప్రయోజనాలను పట్టించుకోకపోవచ్చు.
- బ్యాంకులను విలీనం చేయటం వల్ల మొండి బాకీలు వాస్తవంగా తగ్గకపోవచ్చు. ఖాతా పుస్తకాల్లో మొండిబాకీల భారం తగ్గినట్లు కనిపిస్తుంది. కానీ జరగాల్సిన నష్టం జరుగుతుంది.

## ప్రజలకు ప్రయోజనకరమేనా...?

- మీకు ఖాతా ఉన్న బ్యాంకు వేరే బ్యాంకులో కలిసిపోతుంటే మీకు కొంత శ్రమ ఎదురైనట్లే. ముందుగా బ్యాంకు పాసు పుస్తకం మార్చుకోవాలి. ఆ తర్వాత చెక్‌బుక్ మారిపోతుంది. దాని కోసం రెండు మూడు సార్లు మీరు బ్యాంకును వెళ్లాల్సి వస్తుంది.
- వేరు వేరు లావాదేవీల కోసం మీరు మీ బ్యాంకు ఖాతా వివరాలను (ఖాతా సంఖ్య, శాఖ పేరు, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్... వంటివి) ఎక్కడెక్కడో సమర్పించి ఉంటారు. ఆ వివరాలు మార్చాల్సి వస్తుంది. అప్రమత్తంగా వ్యవహరిస్తే సరేకాని లేనిపక్షంలో మన ఖాతాకు రావాలసిన సొమ్ము రాకపోవటం, లేదా చేయాల్సి చెల్లింపులు నిలిచిపోవటం జరుగుతుంది. ఎస్‌బీఐలో దాని అనుబంధ బ్యాంకులు కలిసినప్పుడు ఖాతాదార్లు ఇటువంటి ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దాదాపు 1300 శాఖల ఐఎఫ్ఎస్‌సీ కోడ్లు, ఇతర వివరాలు మారాయి. దీనివల్ల చాలా కాలం పాటు ఎంతో మంది ఖాతాల్లో ఆటో డెబిట్లు, ఆటో క్రెడిట్లు నిలిచిపోయాయి.
- క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డు లను వెనక్కి ఇచ్చి మళ్లీ కొత్తవి తీసుకోవలసి వస్తుంది.
- మీకు ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఉంటే వాటిని తీసుకువెళ్లి మారిన బ్యాంకు రికార్డుల్లో సరిచూసుకోవటం మేలు. లేనిపక్షంలో భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురు కావచ్చు.
- తీసుకున్న అప్పులపై ఒక్కో బ్యాంకు ఒక్కో వడ్డీరేటు వసూలు చేస్తుంది. ఒకవేళ ఒక ఖాతాదారుడు అప్పు తీసుకున్న బ్యాంకు వేరే బ్యాంకులో కలిసిపోతే వడ్డీరేట్లలో మార్పు వస్తుంది. ఇది వినియోగదారుడికి ఒక్కోసారి మేలు చేసేదిగా లేక నష్టం చేసేదిగా ఉండవచ్చు.
- ఇక ఆయా బ్యాంకుల్లో వాటాదార్లుగా (షేర్ హోల్డర్స్) ఉన్న వారికి నష్టభయం అధికంగా ఉంటుంది. వారికి ఇప్పుడున్న ఈక్విటీ షేర్ల స్థానంలో కొత్తగా విలీన బ్యాంకు షేర్లు వస్తాయి. అందుకు మార్పిడి నిష్పత్తిని నిర్ణయిస్తారు. ఈ నిష్పత్తి మదుపరులకు ప్రయోజనం కలిగించేదిగా ఉండకపోవచ్చు. అటువంటి పరిస్థితుల్లో మదుపరులు పెట్టిన పెట్టుబడికి తగినంత ప్రతిఫలం లేకపోగా పెట్టుబడి సైతం కొంత కోల్పోవలసి వస్తుంది. ఏదైనా ఒక బ్యాంకు ఇటీవల లాభాల్లోకి రావటాన్ని గమనించి ఇంకా భవిష్యత్తు బాగుంటుందని అంచనా వేసి ఆ బ్యాంకు షేర్లు కొనుగోలు చేసిన మదుపరులకు ఈ విలీన నిర్ణయం మింగుడు పడనిదే. వారి పెట్టుబడి ప్రణాళికలు ప్రస్తుత విలీనంతో దెబ్బతినవచ్చు. ముఖ్యంగా దీర్ఘకాలిక మదుపరులు తమ పెట్టుబడి నిర్ణయాలను మార్చుకోవలసి వస్తుంది.
- రెండు మూడు బ్యాంకులు కలిసి ఒకే బ్యాంకు కావటం వల్ల ఒక ప్రయోజనం ఉంది. ఆ బ్యాంకుకు విస్తృతమైన శాఖలు/ ఏటీఎం కేంద్రాల నెట్‌వర్క్ ఏర్పడుతుంది కాబట్టి ఎక్కడి వెళ్లినా ఖాతాదార్లకు సంబంధిత బ్యాంకు సేవలు అందుబాటులో ఉంటాయి. లావాదేవీల నిర్వహణ సులువు అవుతుంది. ఉదాహరణకు పీఎన్‌బీలో, ఓబీసీ, యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కలిస్తే... దానికి 11,437 శాఖలు ఉన్నట్లు అవుతుంది. అప్పుడు దేశంలో ఏ మూలకు వెళ్లినా... దాదాపుగా ఒక పీఎన్‌బీ శాఖ కనిపిస్తుంది.

# బ్యాంకు బోర్డులకు మరింత స్వేచ్ఛ

తాజాగా ప్రకటించిన బ్యాంకింగ్ సంస్కరణల్లో బ్యాంకు బోర్డులకు మరిన్ని అధికారాలను కట్టబెట్టారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శుక్రవారమిక్కడ జరిగిన మీడియా సమావేశంలో పలు చర్యలు ప్రకటించారు. అందులో భాగంగా బ్యాంకు బోర్డులకు స్వేచ్ఛను ఇవ్వనున్నారు. పదవీ విరమణ చేసిన, వైదొలగిన వారి స్థానాల్లో ఎవరిని తీసుకోవాలన్న ప్రణాళికలను సొంతంగా చేసుకోవచ్చు. ఇంకా..

### డైరెక్టర్ల విషయంలో..

- స్వతంత్ర డైరెక్టర్లకు సంబంధించి బోర్డు సమావేశాలకు వారు హాజరైనపుడు ఇవ్వాల్సిన ఫీజు(సిట్టింగ్ ఫీజు)ను నిర్ణయించుకోవడానికి బోర్డులకు అధికారం ఇస్తారు.
- అనధికార డైరెక్టర్లు కూడా స్వతంత్ర డైరెక్టర్ల తరహాలోనే తమ విధులను నిర్వహించుకోవచ్చు.
- జనరల్ మేనేజర్(జీఎమ్), ఆ పైస్థాయి వ్యక్తులకు పదవీ కాలాన్ని 2 ఏళ్ల పాటు సర్దుబాటు చేసే అధికారమూ బోర్డులకు ఉంటుంది.
- సీనియర్ ఎగ్జిక్యూటివ్ స్థాయిల్లో ఉన్న అందరికీ వ్యక్తిగత అభివృద్ధి ప్రణాళికల వ్యవస్థను బోర్డులే నిర్ణయిస్తాయి.
- మేనేజ్‌మెంట్ కమిటీల్లో ఉన్న డైరెక్టర్లు మరింత సమర్థంగా పనిచేయడానికి దీర్ఘకాల పదవీ కాలాన్ని ఇవ్వవచ్చు.
- పెద్ద బ్యాంకుల్లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ల సంఖ్యను నాలుగుకు పెంచారు. తద్వారా కార్యకలాపాలపై, సాంకేతికతపై దృష్టి సారించేందుకు వీలు కల్పించారు.

### ఆఫీసర్ల నియామకం

- తొలి సారిగా చీఫ్ రిస్క్ ఆఫీసర్స్‌ను నియమించుకోవడానికి వెసులుబాటు కల్పించారు. అత్యుత్తమ నైపుణ్యాలున్న వారిని ఆకర్షించడానికి మార్కెట్ ఆధారిత పారితోషికం కూడా ఇచ్చే అధికారాన్ని కట్టబెట్టారు.
- జనరల్ మేనేజర్.. ఆ పైస్థాయి వ్యక్తులు అంటే మేనేజింగ్ డైరెక్టర్ స్థాయిలో ఉన్న వ్యక్తుల పనితీరునూ బ్యాంకుల బోర్డు కమిటీ మదించవచ్చు. తద్వారా మేనేజ్‌మెంట్‌ను బోర్డుకు బాధ్యుల్ని చేయవచ్చు.
- బ్యాంకుల స్థిరీకరణ అనంతరం.. వ్యాపార అవసరాలకు అనుగుణంగా చీఫ్ జనరల్ మేనేజర్(సీజీఎమ్) స్థాయిని సృష్టించుకునేందుకు బోర్డులకు వెసలుబాటు ఉంటుంది.

### 18 బ్యాంకుల్లో.. 14 లాభాల్లోనే

18 ప్రభుత్వ రంగ బ్యాంకు(పీఎస్‌బీ)ల్లో 14 బ్యాంకులు లాభాల్లో ఉన్నాయని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. మీడియా సమావేశంలో భాగంగా ఆమె ఇంకా పలు విషయాలను పంచుకున్నారు. 'డిసెంబరు 2018లో స్థూల నిరర్థక ఆస్తులు రూ.8.65 లక్షల కోట్లుగా ఉండగా.. ఇపుడు రూ.7.9 లక్షల కోట్లకు పరిమితమయ్యాయి. రుణ రికవరీ సైతం రికార్డు స్థాయిలో రూ.1.21 లక్షల కోట్లకు చేరుకుంద'ని సీతారామన్ అన్నారు. ఆమె ఇంకా ఏమన్నారంటే..

'ఎనిమిది ప్రభుత్వ రంగ బ్యాంకులు ఇప్పటికే రెపో అనుసంధానిత రుణ రేట్లను ప్రకటించారు. ద్రవ్యలభ్యత అవసరాల కోసం నాలుగు బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ(ఎన్‌బీఎఫ్‌సీ)లు ప్రభుత్వ రంగ బ్యాంకులతో ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఎన్‌బీఎఫ్‌సీలు, గృహ రుణ సంస్థ(హెచ్‌ఎఫ్‌సీ)లకు హామీ ఇచ్చిన సహాయం త్వరలోనే అందుతుంది. 3.38 లక్షల డొల్ల కంపెనీలను మూసివేశాం. హామీ పథకం కింద ఎన్‌బీఎఫ్‌సీలకు బ్యాంకులు రూ.3,300 కోట్ల సహాయాన్ని అందించాయి. రికవరీ స్థాయి రూ.1,21,076 కోట్లకు చేరుకుంది.

# భోగరాజు భాగ్యలక్ష్మి కనబడదిక..



ఆంధ్రా బ్యాంకు... కోట్లాది మంది తెలుగు ప్రజలకు చిరపరిచితమైన పేరు. దేశంలోని ప్రధాన నగరాలతో పాటు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ నగరాలు, పట్టణాలు, మూరుమూల పల్లెల్లో సైతం కనిపించే ఈ బ్యాంకు త్వరలో కనుమరుగు కానుంది. ప్రభుత్వ రంగ బ్యాంకుల విలీనాల్లో భాగంగా దీనిని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ) లో విలీనం చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో పాటు కార్పొరేషన్ బ్యాంకును కూడా యూబీఐలో కలపనున్నారు. తద్వారా పెద్ద బ్యాంకు ఏర్పడుతున్నప్పటికీ ప్రాంతీయ ఉనికి, తొమ్మిదిన్నర దశాబ్దాల ప్రస్థానం కల ఆంధ్రా బ్యాంకు చరిత్ర పుటలకు పరిమితం అయిపోతుంది. తెలుగు రాష్ట్రాల్లో ఉన్న రెండు ప్రభుత్వ బ్యాంకుల్లో ఒకటైన స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ (ఎస్‌బీహెచ్) కొంతకాలం క్రితం ఎస్‌బీఐలో కలిసి పోయింది. ఇక మిగిలిన ఆంధ్రా బ్యాంకు కూడా ఇప్పుడు అదే బాటలో ఉంది. వచ్చే ఆరు నెలల నుంచి ఏడాది కాలం వ్యవధిలో విలీన ప్రక్రియ పూర్తవుతుందని సంబంధిత వర్గాలు అంచనా వేస్తున్నాయి.

### మచిలీపట్నం నుంచి ప్రస్థానం....

| | |
|---|---|
| స్థాపన | 1923 నవంబరు 20. |
| ఎక్కడ | మచిలీపట్నం, కృష్ణా జిల్లా |
| వ్యవస్థాపకుడు | భోగరాజు పట్టాభి సీతారామయ్య |
| జాతీయీకరణ | 1980లో... |
| ప్రస్తుత కేంద్ర కార్యాలయం | హైదరాబాద్ |
| కేంద్ర ప్రభుత్వ వాటా | 87.81% |
| ఇతర ప్రధాన వాటాదార్లు | ఎల్ఐసీ (2.64%) |
| స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు | ఎన్ఎస్ఈ, బీఎస్ఈ |
| విదేశీ కార్యాలయాలు | దుబాయ్, న్యూజెర్సీ |

### 1923లో ప్రారంభం.. 1980లో జాతీయం

ఆంధ్రా బ్యాంకు 1923 నవంబరు 20న కృష్ణా జిల్లా మచిలీపట్నం కేంద్రంగా ప్రారంభమైంది. భోగరాజు పట్టాభి సీతారామయ్య దీని వ్యవస్థాపకుడు. లక్ష రూపాయిల ప్రాథమిక మూలధనంతో ప్రారంభమైన ఈ బ్యాంకు ఆ తర్వాత శాఖోపశాఖలుగా విస్తరించింది. 1980 నాటికి దేశంలోని ముఖ్యమైన ప్రైవేటు బ్యాంకుల్లో ఒకటిగా నిలిచింది. ప్రభుత్వం 1969లో ఒక దఫా, 1980లో రెండో దఫా బ్యాంకులను జాతీయం చేసిన విషయం విదితమే. ఆంధ్రా బ్యాంకు 1980లో జాతీయం అయింది. అక్కడి నుంచి ప్రభుత్వ రంగ బ్యాంకుగా శరవేగంగా ఎదిగింది. రాష్ట్రానికి లీడ్ బ్యాంకుగా వ్యవహరిస్తూ వ్యవసాయాభివృద్ధికి ఇతోధికంగా కృషి చేసింది. తొలుత ప్రధానంగా తెలుగు రాష్ట్రాలకు, తమిళనాడు, కర్ణాటకలో అధికంగా వ్యాపార కార్యకలాపాలు సాగించినప్పటికీ మలిదశలో దేశవ్యాప్తంగా విస్తరించింది. గత దశాబ్దకాలంలో దేశవ్యాప్తంగా ఆంధ్రా బ్యాంకు శాఖలు ఏర్పాటయ్యాయి. ఉత్తర భారతదేశంలో, ఈశాన్య భారతంలో ఆంధ్రా బ్యాంకు శాఖలు పెద్దఎత్తున ప్రారంభమయ్యాయి. తద్వారా ఆంధ్రా బ్యాంకు ఒక పెద్ద జాతీయ బ్యాంకుగా విస్తరించినట్లు అయింది. ప్రస్తుతం దాదాపు రూ.4 లక్షల కోట్ల మొత్తం వ్యాపారాన్ని నిర్వహిస్తూ బ్యాంకింగ్ రంగంలో క్రియాశీలకంగా వ్యవహరిస్తోంది. ఆంధ్రా బ్యాంకు సారథ్యంలోని ప్రాంతీయ గ్రామీణ బ్యాంకు అయిన చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు కృష్ణా, గుంటూరు జిల్లాలతో పాటు ఉభయగోదావరి జిల్లాల్లో కార్యకలాపాలు సాగిస్తోంది. ఆంధ్రా బ్యాంకుకు కొన్ని అనుబంధ సంస్థలు కూడా ఉన్నాయి. ఇండియా ఫస్ట్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ ఇందులో ఒకటి. బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూకే సంస్థ అయిన లీగల్ అండ్ జనరల్‌తో కలిసి ఈ బీమా కంపెనీని ఆంధ్రా బ్యాంకు ఏర్పాటు చేసింది. దీన్లో ఆంధ్రా బ్యాంకుకు 30 శాతం వాటా ఉంది.

### చేటు తెచ్చిన నష్టాలు

ఎంతో ఘనచరిత్ర కల ఆంధ్రా బ్యాంకును గత కొన్నేళ్లలో నష్టాలు చుట్టుముట్టాయి. తగినంత పర్యవేక్షణ లేకపోవటం, కార్పొరేట్ సంస్థలకు ఇష్టానుసారం రుణాలు మంజూరు చేయటం... అందులో కొన్ని వసూలు కాకపోవటంతో రాని బాకీల భారం పెరిగిపోయింది. రెండు దఫాలుగా కేంద్ర ప్రభుత్వం ఇతర ప్రభుత్వ బ్యాంకులతో పాటు ఆంధ్రా బ్యాంకుకు కూడా మూలధనాన్ని సమకూర్చింది. అయినా ఇబ్బందులు తప్పలేదు. 2005 నుంచి 2012 మధ్యకాలంలో విద్యుత్తు, మౌలిక సదుపాయాలు, టెక్స్‌టైల్స్... తదితర రంగాల్లోని కంపెనీలకు ఈ బ్యాంకు పెద్దఎత్తున ఇచ్చిన రుణాల్లో ఎక్కువ భాగం నిరర్థక ఆస్తులు అయ్యాయి. గుజరాత్‌కు చెందిన స్టెర్లింగ్ బయోటెక్ గ్రూపు సంస్థలకు కొన్ని ఇతర బ్యాంకులతో కలిసి ఆంధ్రా బ్యాంకు ఇచ్చిన అసలు, దానిపై వడ్డీ కలిపి దాదాపు రూ.5,000 కోట్లకు పైగా వసూలు కావలసి ఉండగా, ఆ సొమ్ము రాక... దాని కోసం న్యాయస్థానాల చుట్టూ తిరుగుతున్న పరిస్థితి కనిపిస్తుంది. ఇటువంటి మొండి బాకీల కేసులు ఎన్నో ఉన్నాయి. దీనివల్ల ఆంధ్రా బ్యాంకుకు కొంతకాలంగా నష్టాలు పెరిగిపోయాయి. 2018-19 ఆర్థిక సంవత్సరానికి రూ.2,786 కోట్ల నికర నష్టాన్ని నమోదు చేయాల్సి వచ్చిందంటే నష్టాలు ఏ స్థాయిలో ఎదురైందీ స్పష్టమవుతుంది. ఈ ఇబ్బందుల నుంచి కోలుకొని ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికానికి లాభాలు నమోదు చేసే పరిస్థితి వచ్చింది. క్రితం ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో రూ.540 కోట్ల నికర నష్టం ఉండగా, ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో రూ.52 కోట్ల నికరలాభాన్ని ఆర్జించింది. ఇటీవలి కాలంలో తీసుకున్న దిద్దుబాటు చర్యలతో భవిష్యత్తు బాగానే ఉంటుందనే అభిప్రాయాన్ని బ్యాంకు ప్రస్తుత యాజమాన్యం వ్యక్తం చేస్తోంది.

– ఈనాడు, హైదరాబాద్

### ఆంధ్రా బ్యాంకు ముఖ చిత్రం

| | |
|---|---|
| మొత్తం వ్యాపారం | 3,96,970 |
| మొత్తం రుణాలు | 1,80,258 |
| డిపాజిట్లు | 2,16,721 |
| కాసా (కరెంటు,సేవింగ్స్ డిపాజిట్లు) నిష్పత్తి | 31.44% |
| పీసీఆర్ నిష్పత్తి | 74.45% |
| నికర ఎన్‌పీఏ నిష్పత్తి | 5.67% |
| శాఖలు | 2,904 |
| ఉద్యోగుల సంఖ్య | 20,346 |

(మొత్తం వ్యాపారం, రుణాలు, డిపాజిట్లు- రూ.కోట్లలో...)

# ఛాంపియన్



యుఎస్ ఓపెన్‌లో నాలుగో సీడ్ హలెప్ కథ ముగిసింది. అన్‌సీడెడ్ టౌన్‌సెండ్ రెండో రౌండ్లో ఆమెకు షాకిచ్చింది. పురుషుల సింగిల్స్‌లో రెండో సీడ్ నాదల్, ఆరో సీడ్ జ్వెరెవ్ ముందంజ వేశారు.

## హలెప్ ఔట్

- క్వాలిఫయర్ చేతిలో పరాజయం
- మూడో రౌండ్లో జ్వెరెవ్, నాదల్
- యుఎస్ ఓపెన్

న్యూయార్క్: యుఎస్ ఓపెన్ నుంచి మహిళల రెండో సీడ్ సిమోనా హలెప్ (రొమేనియా) నిష్క్రమించింది. హోరాహోరీగా సాగిన రెండో రౌండ్లో అమెరికా క్వాలిఫయర్ టేలర్ టౌన్‌సెండ్ 2-6, 6-3, 7-6 (7-4)తో వింబుల్డన్ ఛాంపియన్ హలెప్‌కు షాకిచ్చింది. తొలి సెట్‌ను అలవోకగా గెలుచుకున్న హలెప్.. రెండో సెట్ ఆరంభంలోనే రెండు సర్వీసులు కోల్పోయింది. ఆ సెట్‌ను గెలుచుకున్న టౌన్‌సెండ్ పోరాటాన్ని కొనసాగించింది. రసవత్తరంగా సాగిన నిర్ణయాత్మక మూడో సెట్లో హలెప్.. ఓ మ్యాచ్ పాయింట్‌ను వృథా చేసుకుంది. టైబ్రేక్‌లో 4-4తో సమంగా ఉన్న దశలో టౌన్‌సెండ్ వరుసగా మూడు పాయింట్లు సాధించి విజేతగా నిలిచింది. మ్యాచ్‌లో టౌన్‌సెండ్ 39 విన్నర్లు కొట్టింది. మరోవైపు అమెరికా యువ సంచలనం గాఫ్, వోజ్నియాకి (డెన్మార్క్) కూడా మూడో రౌండ్లో ప్రవేశించారు. గాఫ్ 6-4, 4-6, 6-4తో బాబోస్ (హంగేరి)పై నెగ్గగా.. వోజ్నియాకి 4-6, 6-3, 6-4తో కోలిన్స్ (అమెరికా)ను ఓడించింది. ఇతర మ్యాచ్‌ల్లో కెనిన్ (అమెరికా) 7-6 (7-4), 6-0తో సీగ్మండ్ (జర్మనీ)పై, కొంటా (బ్రిటన్) 6-1, 6-0)తో గస్పర్యాన్ (రష్యా)పై, సెవత్సొవా (లాత్వియా) 3-6, 6-1, 6-3తో స్వియాటెక్ (పోలెండ్)పై, క్రిస్టీ (రొమేనియా) 3-6, 6-4, 6-2తో బొల్సోవా (స్పెయిన్)పై విజయం సాధించారు.

పురుషుల సింగిల్స్‌లో అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ) అతికష్టంపై మూడో రౌండ్‌కు చేరుకున్నాడు. సువ్వా నేనా అన్నట్లు ఐదు సెట్లపాటు హోరాహోరీగా సాగిన రెండో రౌండ్లో అతడు 6-3, 3-6, 6-2, 2-6, 6-3తో టియాఫో (అమెరికా)ను ఓడించాడు. కొకినాకిస్ (బ్రిటన్) నుంచి రఫెల్ నాదల్ (స్పెయిన్)కు వాకోవర్ లభించింది. ఇతర రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో ఐదో సీడ్ మెద్వెదెవ్ (రష్యా) 6-3, 7-5, 5-7, 6-3తో డెలియన్ (బొలీవియా)పై, సిలిచ్ (క్రొయేషియా) 4-6, 6-3, 7-5, 6-3తో స్టెబె (జర్మనీ)పై, ఇస్నర్ (అమెరికా) 6-3, 7-6 (7-4), 7-6 (7-5)తో స్ట్రఫ్ (జర్మనీ)పై, వావ్రింకా (స్విట్జర్లాండ్) 6-4, 6-3, 6-7 (3-7), 6-3తో చార్డీ (ఫ్రాన్స్)పై, మోన్‌ఫిల్స్ (ఫ్రాన్స్) 6-3, 6-2, 6-2తో కొపిల్ (రొమేనియా)పై నెగ్గారు.



భారత్, వెస్టిండీస్ మధ్య చివరిదైన రెండో టెస్టు ఆసక్తికరంగా సాగుతోంది. మంచి బౌన్స్ లభిస్తున్న పిచ్‌పై విండీస్ బౌలర్లు రాణిస్తుంటే.. భారత బ్యాట్స్‌మెన్ ప్రతిఘటిస్తున్నారు. కడపటి వార్తలందేసరికి భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 52 ఓవర్లలో 3 వికెట్లకు 136 పరుగులు చేసింది. మయాంక్ అర్ధశతకం సాధించగా.. కోహ్లి (41), రహానె (10) క్రీజులో ఉన్నారు. అందరి దృష్టిని ఆకర్షిస్తూ అరంగేట్రం చేసిన భారీకాయుడు కార్న్‌వాల్.. భారత్‌ను దెబ్బతీశాడు. కీలక బ్యాట్స్‌మన్ పుజారాను ఔట్ చేయడమే కాకుండా.. రెండు క్యాచ్‌లూ అందుకున్నాడు.

మయాంక్ అగర్వాల్ (55)

## మెరిసిన మయాంక్

కడపటి వార్తలందేసరికి భారత్ 136/3 • వెస్టిండీస్‌తో రెండో టెస్టు • కార్న్‌వాల్ అరంగేట్రం

కింగ్‌స్టన్

రెండో టెస్టులో పైచేయి కోసం భారత్, వెస్టిండీస్ గట్టిగా ప్రయత్నిస్తున్నాయి. తొలి రోజు, శుక్రవారం కడపటి వార్తలందేసరికి భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 3 వికెట్ల నష్టానికి 136 పరుగులు చేసింది. మయాంక్ అగర్వాల్ (55; 127 బంతుల్లో 7×4) రాణించగా.. పుజారా (6) వైఫల్యాన్ని కొనసాగించాడు. రాహుల్ (13) కూడా విఫలమయ్యాడు. కోహ్లి, రహానె ఆడుతున్నారు. కార్న్‌వాల్ 14 ఓవర్లలో 34 పరుగులిచ్చి ఒక వికెట్ పడగొట్టాడు.

**46కే రెండు:** తొలి టెస్టులో లాగే భారత్‌కు సరైన ఆరంభం దక్కలేదు. పిచ్‌పై కాస్త పచ్చిక ఉండడంతో వెస్టిండీస్ కెప్టెన్ హోల్డర్ టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్నాడు. బ్యాటింగ్ కష్టంగా ఉండడంతో ఓపెనర్లు రాహుల్, మయాంక్ అగర్వాల్ తొలి అరగంట పాటు.. కొత్త బంతి బౌలర్లు గాబ్రియల్, రోచ్‌లను చాలా జాగ్రత్తగా ఎదుర్కొన్నారు. కానీ భారత్ 14 పరుగుల తేడాతో రెండు వికెట్లు కోల్పోయింది. ఏడో ఓవర్లో బౌలింగ్‌కు దిగిన హోల్డర్ మంచి బౌన్స్ రాబట్టాడు. రాహుల్‌ను ఔట్ చేయడం ద్వారా తన జట్టుకు తొలి వికెట్‌ను అందించాడు. రాహుల్ స్లిప్‌లో కార్న్‌వాల్‌కు ఎడ్జ్ ఇచ్చాడు. మరోవైపు తొలి మ్యాచ్ ఆడుతున్న కార్న్‌వాల్ తన కట్టుదిట్టమైన ఆఫ్‌స్పిన్‌తో బ్యాట్స్‌మెన్ పరుగుల కోసం చెమటోడ్చేలా చేశాడు. అసౌకర్యంగా కనిపించిన పుజారా.. తన 15వ బంతికి గానీ ఖాతా తెరవలేకపోయాడు. ఆ తర్వాత ఎంతోసేపు నిలవలేకపోయాడు. ఆరు పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద కార్న్‌వాల్‌కు వికెటిచ్చి వెనుదిరిగాడు. అప్పటికి భారత్ స్కోరు 46/2. కానీ మయాంక్, కోహ్లి వెంటనే మరో వికెట్ పడకుండా జాగ్రత్త పడ్డారు. మయాంక్ మొదట్లో కాస్త ఇబ్బందిపడ్డా మ్యాచ్ సాగుతున్నకొద్దీ మరింత సాధికారికంగా ఆడాడు. వీలైనప్పుడు బౌండరీలు రాబట్టాడు. కార్న్‌వాల్ బౌలింగ్‌లో కాస్త అసౌకర్యంగా కనిపించినా కోహ్లి కూడా పట్టుదలగా నిలిచాడు. లంచ్ సమయానికి స్కోరు 72/2. విరామం తర్వాత బ్యాట్స్‌మెన్ ఇద్దరూ వేగం పెంచారు. కోహ్లి చకచకా మూడు బౌండరీలు బాదాడు. రోచ్ ఓవర్లో రెండు ఫోర్లతో మయాంక్ అర్ధశతకం పూర్తి చేసుకున్నాడు. కానీ కాసేపటికే హోల్డర్ బౌలింగ్‌లో ఔటయ్యాడు.



కార్న్‌వాల్

### వచ్చాడు... పట్టాడు.. పడగొట్టాడు

*విండీస్ భారీకాయుడు రకీమ్ కార్న్‌వాల్ అరంగేట్రం చేసేశాడు. ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ వార్విక్ ఆర్మ్‌స్ట్రాంగ్ (133-139 కిలోలు) రికార్డును బద్దలు కొడుతూ టెస్టు క్రికెట్ ఆడిన అత్యంత బరువైన క్రికెటర్‌గా నిలిచాడు. 6.6 అడుగుల ఈ ఆఫ్‌స్పిన్ ఆల్‌రౌండర్ బరువు 140 కిలోలు. కమిన్స్ స్థానంతో అతడు వెస్టిండీస్ తుది జట్టులో స్థానం సంపాదించాడు. తన ఆఫ్‌స్పిన్‌తో ప్రభావం చూపించాడు కూడా. మంచి బౌన్స్ రాబట్టిన కార్న్‌వాల్ కటుదిట్టంగా బౌలింగ్ చేశాడు. పుజారాను ఔట్ చేయడం ద్వారా తన తొలి అంతర్జాతీయ వికెట్‌ను చేజిక్కించుకున్నాడు. బాగా బౌన్సయిన కార్న్‌వాల్ బంతిని కట్ చేసిన పుజారా.. నేరుగా పాయింట్లో బ్రూక్స్ చేతికి చిక్కాడు. భారీ సిక్స్‌లు కొట్టగల కార్న్‌వాల్.. ఇటీవలి కాలంలో విండీస్ దేశవాళీ క్రికెట్లో చాలా నిలకడగా రాణించాడు. 2018-19 వెస్టిండీస్ ఛాంపియన్‌షిప్‌లో 17.68 సగటుతో 54 వికెట్లు పడగొట్టాడు. మొత్తంగా 55 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌ల్లో 260 పడగొట్టిన కార్న్‌వాల్.. 2224 పరుగులు సాధించాడు.*

### లైవ్‌లో కుప్పకూలిన వివ్ రిచర్డ్స్



*కింగ్‌స్టన్:* వెస్టిండీస్ దిగ్గజం వివియన్ రిచర్డ్స్ అస్వస్థతకు గురయ్యాడు. టీమ్‌ఇండియా, వెస్టిండీస్ రెండో టెస్టు మ్యాచ్ ఆరంభానికి ముందు టీవీ విశ్లేషణ కార్యక్రమంలో పాల్గొన్న అతను ఉన్నట్లుండి కుప్పకూలాడు. 67 ఏళ్ల రిచర్డ్స్‌ను వెంటనే స్ట్రెచర్‌పై పడుకోబెట్టి ఆసుపత్రికి తరలించారు. అతడి ఆరోగ్య పరిస్థితిపై పూర్తి వివరాలు తెలియరాలేదు. రిచర్డ్స్ డీహైడ్రేషన్‌కు గురై ఉంటాడని భావిస్తున్నారు. చికిత్స అనంతరం రిచర్డ్స్ మైదానానికి తిరిగొచ్చినట్లు తెలిసింది.



## అభిషేక్‌కు స్వర్ణం

షూటింగ్ ప్రపంచకప్

రియో డిజనీరో: ఐఎస్‌ఎస్‌ఎఫ్ షూటింగ్ ప్రపంచకప్‌లో భారత షూటర్ల పతకాల వేట కొనసాగుతోంది. పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టోల్ విభాగంలో అభిషేక్ వర్మ పసిడితో సత్తాచాటాడు. మరో భారత షూటర్ సౌరభ్ చౌదరీ కాంస్యం సొంతం చేసుకున్నాడు. ఎనిమిది మంది షూటర్లు పోటీపడ్డ ఫైనల్లో 244.2 పాయింట్లతో అభిషేక్ అగ్రస్థానంలో నిలిచాడు. 221.9 పాయింట్లతో సౌరభ్ మూడో స్థానాన్ని దక్కించుకున్నాడు. టర్కీ షూటర్ ఇస్మాయిల్ (243.1) రజతం గెలుచుకున్నాడు. అంతకుముందు అర్హత రౌండ్లలో 584 పాయింట్లతో అభిషేక్ నాలుగో స్థానంలో, 582 పాయింట్లతో సౌరభ్ ఐదో స్థానంలో నిలిచి పతక పోరుకు చేరారు. ఈ ఏడాది ఇప్పటి వరకు జరిగిన నాలుగు ప్రపంచకప్‌ల్లోనూ పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టోల్ విభాగంలో స్వర్ణాలన్నీ భారత ఖాతాలోకే చేరాయి. ఇప్పటికే ఈ విభాగంలో అభిషేక్, సౌరభ్ రెండు ఒలింపిక్స్ కోటా స్థానాలు సంపాదించిన సంగతి తెలిసిందే.

## ఫెదరర్ ఖాతాలో మరో రికార్డు

న్యూయార్క్: టెన్నిస్ దిగ్గజం రోజర్ ఫెదరర్ ఖాతాలో మరో రికార్డు చేరింది. ప్రపంచ టూర్ ఫైనల్స్ ఏటీపీ టోర్నీకి రికార్డు స్థాయిలో 17వ సారి అర్హత సాధించి చరిత్ర సృష్టించాడు. గత ఏడాదే జిమ్మీ కానర్స్ (16 సార్లు) రికార్డును సమం చేసిన అతను ఈసారి దాన్ని అధిగమించాడు. యుఎస్ ఓపెన్ తొలి రౌండ్లో భారత కుర్రాడు సుమిత్ నాగాల్‌పై గెలిచిన ఫెదరర్.. ఈ సీజన్‌లో 40 విజయాలతో ప్రపంచ టూర్ ఫైనల్స్ ఆడే అవకాశం దక్కించుకున్నాడు. గత 19 ఏళ్లలో ఒక్కసారి (2016) మినహా ప్రతి సీజన్‌లోనూ అతను కనీసం 40 మ్యాచ్‌లు గెలిచాడు. ఫెదరర్ ఇప్పటి వరకు ఆరుసార్లు (2003, 2004, 2006, 2007, 2010, 2011) ప్రపంచ టూర్ ఫైనల్స్‌లో విజేతగా నిలిచాడు.

## యాషెస్ మొత్తానికి అండర్సన్ దూరం



లండన్: ఇంగ్లాండ్ సీనియర్ ఫాస్ట్‌బౌలర్ జేమ్స్ అండర్సన్ యాషెస్ సిరీస్ మొత్తానికి దూరమయ్యాడు. సిరీస్ తొలి మ్యాచ్‌లో బౌలింగ్ చేస్తూ పిక్క గాయానికి గురైన అండర్సన్.. మ్యాచ్ నుంచి అర్ధాంతరంగా తప్పుకున్నాడు. తర్వాతి రెండు టెస్టులకూ అండర్సన్ అందుబాటులోకి రాలేదు. నాలుగో టెస్టులో ఆడాలంటే ముందు ఫిట్‌నెస్ నిరూపించుకోవాల్సి ఉండగా.. అందుకోసం అండర్సన్ లాంకషైర్ తరఫున దేశవాళీ మ్యాచ్ ఆడుతుండగా పిక్క గాయం తిరగబెట్టింది. దీంతో యాషెస్ మొత్తానికి అతను దూరమయ్యాడు. అండర్సన్ స్థానంలో ఆల్‌రౌండర్ ఓవర్టన్‌ను జట్టులోకి తీసుకున్నారు. మూడో టెస్టులో నెగ్గి సిరీస్‌ను ఇంగ్లాండ్ 1-1తో సమం చేసిన సంగతి తెలిసిందే. నాలుగో టెస్టు ఓల్డ్‌ట్రాఫోర్డ్‌లో బుధవారం ఆరంభమవుతుంది.

## శంకర్ స్థానంలో ధావన్

దిల్లీ: దక్షిణాఫ్రికా-ఎ జట్టుతో భారత్-ఎ వన్డే సిరీస్‌లో టీమ్‌ఇండియా ఓపెనర్ శిఖర్ ధావన్ ఆడబోతున్నాడు. ఐదు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో ఆడుతున్న ఆల్‌రౌండర్ విజయ్ శంకర్ గాయపడటంతో అతడి స్థానంలో చివరి రెండు మ్యాచ్‌లకు ధావన్ ఎంపికయ్యాడు. కొంత కాలంగా ఫిట్‌నెస్, ఫామ్ సమస్యలతో ఇబ్బంది పడుతున్న ధావన్.. ఈ సిరీస్‌లో ఆడి సత్తా చాటుకోవాలనుకుంటున్నాడు. వెస్టిండీస్‌తో 3 టీ20ల్లో 1, 23, 3 పరుగులు చేసిన ధావన్.. రెండు వన్డేల్లో 2, 36 పరుగులకు పరిమితం అయ్యాడు.

## స్మిత్ ఒక్కడే ఏమీ చేయలేడు



*మాంచెస్టర్:* ఆస్ట్రేలియా అగ్రశ్రేణి బ్యాట్స్‌మన్ స్టీవ్ స్మిత్, ఇంగ్లాండ్ పేస్ సంచలనం జోఫ్రా ఆర్చర్ మధ్య మాటల యుద్ధం యాషెస్ సమరాన్ని మరింత వేడెక్కిస్తోంది. "ఆర్చర్‌కు నన్ను ఔట్ చేయడం సాధ్యం కాలేదు. అందుకే బౌన్సర్లతో నా తలకు గురిపెట్టాడు" అంటూ స్మిత్ చేసిన వ్యాఖ్యలకు ఆర్చర్ ఘాటుగా సమాధానమిచ్చాడు. 'స్మిత్ క్రీజులో లేకపోతే అతణ్ని ఎలా ఔట్ చేయగలను? లార్డ్స్ టెస్టులో మెడకు బంతి తగలడంతో పెవిలియన్ వెళ్లి.. తిరిగి బ్యాటింగ్‌కు వచ్చిన అతనికి బౌలింగ్ చేయాలి అనుకున్నా. కానీ నేను తిరిగి బౌలింగ్‌కు వచ్చే ముందే అతను ఔటై వెనుదిరిగాడు. స్మిత్ ఒక్కడినే కాదు.. మిగతా పది మందినీ ఔట్ చేస్తాం. అయినా అతను ఒంటరిగా క్రీజులో నిలిచి ఏమీ చేయలేడు. అయినా ఒక్క బ్యాట్స్‌మన్‌తో పోరు కోసం నేను ఇక్కడ లేను. యాషెస్ గెలవడం కోసమే ఆడుతున్నా" అన్నాడు.



## టైటాన్స్ మళ్లీ ఓడింది

- పుణెరి చేతిలో చిత్తు
- ప్రొ కబడ్డీ లీగ్

దిల్లీ: గత నాలుగు మ్యాచ్‌ల్లో మూడు విజయాలు, ఓ టైతో గాడిన పడినట్లే కనిపించిన తెలుగు టైటాన్స్ తిరిగి ఓటమి బాట పట్టింది. పుణెరితో మ్యాచ్‌లో ఓ దశలో ఆధిక్యంలో నిలిచి కూడా ఆ తర్వాత పట్టు విడిచిన ఆ జట్టు ప్రొ కబడ్డీ ఏడో సీజన్‌లో ఆరో పరాజయాన్ని ఖాతాలో వేసుకుంది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో టైటాన్స్ 27-34 తేడాతో పుణెరి పల్టాన్ చేతిలో ఓడింది. రైడింగ్‌లో సిద్ధార్థ్ దేశాయ్ (7) మెరిసినా కూడా అతని ప్రదర్శన జట్టును గట్టెక్కించలేకపోయింది. ట్యాక్లింగ్‌లో అరుణ్ (6), విశాల్ భరద్వాజ్ (5) పోరాటం వృథా అయింది. మ్యాచ్‌ను టైటాన్స్ పేలవంగా మొదలెట్టింది. చూస్తుండగానే ప్రత్యర్థి జట్టు 5-0తో ఆధిక్యం సంపాదించింది. విశాల్ సూపర్ ట్యాకిల్‌తో పుంజుకున్న టైటాన్స్.. ప్రత్యర్థిని అందుకోవడమే కాకుండా 16 నిమిషాలు ముగిసేసరికి 13-10తో ఆధిక్యంలో నిలిచింది. కానీ ఆధిక్యాన్ని నిలుపుకోవడంలో విఫలమైన ఆ జట్టు ఆలౌటై 14-17తో తొలి అర్ధభాగాన్ని ముగించింది. విరామం తర్వాత తమ పోరాటాన్ని కొనసాగించిన టైటాన్స్ 19-21తో ప్రత్యర్థికి సమీపంగా వెళ్లగలిగింది. వెంటనే మంజీత్ (9) సూపర్ రైడ్‌తో పుణెరి 25-19తో మరోసారి దూకుడు ప్రదర్శించింది. టైటాన్స్ అక్కడితోనే ఆగిపోయింది. పాయింట్లు సాధించడంలో విఫలమై పరాజయం దిశగా సాగింది. మరో రెండు నిమిషాల్లో మ్యాచ్ ముగుస్తుందనగా 25-33తో వెనకబడి ఓటమి ఖరారు చేసుకుంది. పుణెరి తరఫున మంజీత్‌తో పాటు నితిన్ తోమర్ (8) ఆకట్టుకున్నాడు. ఇప్పటి వరకు ఆడిన 11 మ్యాచ్‌ల్లో కేవలం మూడింట్లో మాత్రమే గెలిచిన టైటాన్స్ 24 పాయింట్లతో చివరి నుంచి రెండోస్థానంలో కొనసాగుతోంది. మరో మ్యాచ్‌లో దబంగ్ దిల్లీ 38-35 తేడాతో పట్నా పైరేట్స్‌పై విజయం సాధించింది. దిల్లీ జట్టులో నవీన్ కుమార్ (16) రైడింగ్‌లో సత్తాచాటాడు. పట్నా తరఫున పర్దీప్ నర్వాల్ (18) చెలరేగినా ఫలితం లేకపోయింది.

### ప్రొ కబడ్డీ లీగ్‌లో ఈనాడు

*బెంగళూరు బుల్స్ × గుజరాత్ ఫార్చ్యూన్‌జెయింట్స్ (రా.7:30 నుంచి)*

*యు ముంబా × జైపూర్ పింక్ పాంథర్స్ (రా.8:30 నుంచి)*



శుక్రవారం తల్లిదండ్రులతో కలిసి తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ప్రపంచ బ్యాడ్మింటన్ స్వర్ణ విజేత పి.వి.సింధు



ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్యం గెలవడంతో పాటు అర్జున అవార్డు అందుకున్న సాయిప్రణీత్‌ను సత్కరిస్తున్న తెలంగాణ గవర్నర్ నరసింహన్ దంపతులు

# దస్త్రం.. దక్షిణడుగుతోంది



- కొత్త చట్టంపై ప్రభుత్వ దృష్టి
- మ్యుటేషన్‌పై ముప్పుతిప్పలు అందుకే
- రైతుల్ని గోస పెడుతున్న రెవెన్యూ
- రాష్ట్రంలో ఘోరంగా సేవల తీరు

ఈనాడు, హైదరాబాద్

భూ యాజమాన్య హక్కు పొందడానికి రైతులు తహసీల్దారు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. క్షేత్ర స్థాయి సేవల్లో తీవ్ర జాప్యం చోటుచేసుకుంటుండటమే దీనికి కారణం. రాష్ట్రంలో నెలకు రెండు లక్షల రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. భూముల రిజిస్ట్రేషన్లే ఎక్కువ. భూమి కొనుగోలు చేసిన వ్యక్తి విక్రయించిన వ్యక్తి నుంచి భూ యాజమాన్య హక్కును బదిలీ చేయించుకోవాలి. రిజిస్ట్రేషన్ల శాఖ వద్ద భూ రిజిస్ట్రేషన్ పూర్తయ్యాక భూమికి సంబంధించిన పట్టా పాసు పుస్తకాలతో తహసీల్దారుకు దరఖాస్తు చేసుకుంటే యాజమాన్య హక్కు బదిలీని పూర్తి చేస్తారు. దీన్నే మ్యుటేషన్‌గా పిలుస్తారు. తహసీల్దారు నుంచి దిగువ స్థాయికి ప్రక్రియ చేరుకున్నాక తీవ్ర జాప్యం జరుగుతోంది. ఇక్కడే అక్రమానికి బీజం పడుతోంది. ఎంతోకొంత చేతిలో పెడితేనే దస్త్రం కదులుతోంది. లేదంటే నెలల తరబడి నానాల్సిందే.

### మైదాన ప్రాంతాల్లో భారీ డిమాండ్

రంగారెడ్డి, సంగారెడ్డి, మెదక్, కరీంనగర్, సూర్యాపేట, ఖమ్మం, మహబూబ్‌నగర్, నిజామాబాద్, హైదరాబాద్, వరంగల్ జిల్లాల్లోని పట్టణ ప్రాంతాలు, ప్రధాన రహదారుల వెంబడి ఉన్న భూముల మ్యుటేషన్ సేవలకు కనీసం ఎకరాకు రూ.పది వేలకు తగ్గకుండా సమర్పించుకోవాల్సిందే. కొత్త పట్టా పాసుపుస్తకం జారీ ప్రక్రియలోనూ కొందరు సిబ్బంది చేతులు తడిపితేనే పనిచేస్తున్నారన్న ఆరోపణలు పెద్దఎత్తున వస్తున్నాయి. భూ దస్త్రాల ప్రక్షాళన కార్యక్రమం అనంతరం నిఘా వర్గాలతో ప్రభుత్వం విచారణ చేపట్టగా క్షేత్రస్థాయిలో అవినీతి బహిర్గతమయింది. దీంతో భూ సంబంధిత సేవల్లో పారదర్శకత, గ్రామ రెవెన్యూ అధికారి పాత్ర లేకుండా మ్యుటేషన్లు వెనువెంటనే పూర్తయ్యేలా చర్యలు చేపడుతోంది.

- మ్యుటేషన్ చేయాలని రైతుల నుంచి అర్జీ రాగానే తహసీల్దారు నోటీసు జారీచేస్తారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, గ్రామ రెవెన్యూ అధికారి విచారించి నివేదిక అందించాలి. వారిచ్చే నివేదికను ఆధారం చేసుకుని తహసీల్దారు రెవెన్యూ మాతృ దస్త్రంలో (1 బిలో) క్రయవిక్రయాలు చోటుచేసుకున్న భూముల విస్తీర్ణాన్ని మార్చి కొత్త పాసుపుస్తకం జారీకి ఆదేశాలు ఇస్తారు.
- రాష్ట్రంలో రెవెన్యూ చట్టం ప్రకారం 45 రోజుల్లో భూ యాజమాన్య హక్కు బదిలీ పూర్తి చేయాలి. దీన్ని ఏడాది క్రితం ప్రభుత్వం ప్రత్యేక ఆదేశాల ద్వారా 15 రోజులకు కుదించింది. రాష్ట్రంలో వాస్తవ పరిస్థితులు... రైతుల వేదనల ప్రకారం రెవెన్యూ యంత్రాంగం ఈ గడువుల్ని గాలికొదిలేసినట్టు స్పష్టమవుతోంది.

దిగువ స్థాయిలోనే అక్రమం: పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌కు చెందిన రైతు బోయిరి భీమయ్య తన అన్న క్రిష్టయ్య వద్ద 20 గుంటల వ్యవసాయ భూమి కొన్నారు. రిజిస్ట్రేషన్ పూర్తయి ఆరు నెలలు గడుస్తోంది. ఆ భూమిని తన ఖాతాలో కలిపి పాసుపుస్తకం ఇవ్వాలని తహసీల్దారు కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా ఆన్‌లైన్‌లో వివరాలు రావడం లేదంటూ అధికారులు సమాధానం చెబుతున్నారని ఆయన వాపోతున్నారు. తహసీల్దారు మధుసూదన్ మాత్రం తమకు మ్యుటేషన్ దరఖాస్తే రాలేదని అన్నారు.

## శారీరక దృఢత్వంతోనే సంపన్న భారతం

- సముద్ర ఉత్పత్తులను మించిన పోషకాహారం లేదు
- ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు



రొయ్యల ఆహారం కొత్త బ్రాండ్‌ను ఆవిష్కరిస్తున్న ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు. పక్కన ఏపీ, తెలంగాణ మంత్రులు మోపిదేవి వెంకటరమణ, శ్రీనివాస్‌యాదవ్, ఎంపెడా అధ్యక్షుడు శ్రీనివాస్

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: భారత్‌లో ఆహారం సమృద్ధిగా ఉన్నప్పటికీ, సముద్ర ఉత్పత్తులను మించిన పోషకాహారం మరొకటి లేదని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. ఆక్వా రంగంలో ప్రపంచంలో రెండో స్థానం నుంచి తొలిస్థానానికి చేరేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. హైటెక్స్‌లో శుక్రవారం సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల అభివృద్ధి సంస్థ(ఎంపెడా) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 5వ ఆక్వా ఆక్వేరియా ఇండియా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రధాని మోదీ ప్రారంభించిన 'ఫిట్ ఇండియా' కార్యక్రమాన్ని ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లాలని చెప్పారు. మనం శారీరకంగా దృఢంగా ఉన్నప్పుడే సంపన్న దేశ నిర్మాణం సాధ్యమవుతుందని చెప్పారు. మత్స్యకారుల కోసం తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన కార్యక్రమాలు బాగున్నాయని అభినందించారు. నాలుగేళ్లలో రాష్ట్రంలో మత్స్యరంగం ఎంతో పురోగతి సాధించిందని.. తొలి ఏడాది 40 కోట్ల చేప పిల్లలు పంపిణీ చేస్తే, ఈ ఏడాది 80 కోట్ల పిల్లల్ని జలాశయాల్లో వదిలేందుకు సిద్ధంగా ఉన్నామని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. ఆక్వా రంగంలో విశేష కృషి చేసిన పది మంది రైతులకు పురస్కారాలు అందజేశారు. ఎంపీలు బండ ప్రకాశ్, రంజిత్‌రెడ్డి, ఎంపెడా అధ్యక్షుడు శ్రీనివాస్‌తోపాటు పద్మనాభయ్య, సంజయ్ రాహుల్ పాల్గొన్నారు. జిల్లాల నుంచి పెద్దఎత్తున ప్రదర్శనకు హాజరైన మత్స్యకారులు స్టాల్స్ వద్ద సందడి చేశారు. తెలాపియా(గొరస) చేపల పెంపకానికి ఉద్దేశించిన వ్యవస్థ(ఆర్ఏఎస్) ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దీని గురించి తెలుసుకోవడానికి మత్స్యకారులు బారులుతీరారు.

## నెల్లూరులో ప్రాచీన తెలుగు అధ్యయన కేంద్రం

- మైసూరు నుంచి తరలించాలని కేంద్రం నిర్ణయం
- ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చొరవే కారణం

ఈనాడు, హైదరాబాద్: ప్రతిష్ఠాత్మక ప్రాచీన తెలుగు అధ్యయన కేంద్రం నెల్లూరుకు తరలిరానుంది. కేంద్ర ప్రభుత్వం తెలుగు కేంద్రం ఏర్పాటుకు గతంలో అనుమతిచ్చినా, తెలుగు రాష్ట్రాల నడుమ ఏకాభిప్రాయం కుదరకపోవటంతో, కర్ణాటకలోని మైసూరులో దాన్ని ప్రారంభించారు. తాజాగా దాన్ని ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరుకు తరలించాలని కేంద్ర మానవ వనరులశాఖ నిర్ణయించింది. ప్రస్తుతానికి కేంద్రాన్ని ఆంధ్రప్రదేశ్‌కు మార్చారని, ఇతర పాలనాపరమైన అంశాలు త్వరలో చేపట్టనున్నట్లు సంబంధిత అధికారి ఒకరు తెలిపారు. ప్రస్తుతం మైసూరులోని భారతీయ బాషా కేంద్రీయ సంస్థ(సీఐఐఎల్)లో పనిచేస్తున్న కేంద్రానికి పూర్తి స్థాయి ప్రాజెక్టు సంచాలకుడిగా ఆచార్య డి.మునిరత్నం నాయుడు వ్యవహరిస్తున్నారు. అందులో మరో తొమ్మిది మంది పనిచేస్తున్నారు.

### కేంద్రం తరలింపు వెనుక...

నెల రోజుల క్రితం మైసూరులో సీఐఐఎల్ స్వర్ణోత్సవాలను ప్రారంభించిన ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు అదే ప్రాంగణంలో నడుపుతున్న ప్రాచీన తెలుగు కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం ఈనెల 17వ తేదీన కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి రమేష్ పోఖ్రియాల్‌ను పిలిచి నెల్లూరులో ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న రీజినల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్(ఆర్ఐఈ) ఏర్పాటుపై చర్చించారు. ఈ సందర్భంగా తెలుగు కేంద్రం తరలింపుపైనా చర్చించినట్లు సమాచారం.

## సింగరేణి, విద్యుత్ సంస్థల్లో సమ్మెలపై నిషేధం పొడిగింపు

ఈనాడు, హైదరాబాద్ : సింగరేణితోపాటు రాష్ట్రంలోని అన్ని విద్యుత్ సంస్థల్లో సమ్మెలపై నిషేధం గడువును మరో ఆరు నెలలు పొడిగిస్తూ రాష్ట్ర ఇంధన శాఖ వేర్వేరు ఉత్తర్వులను జారీచేసింది. విద్యుత్తు, బొగ్గు ఉత్పత్తి, సరఫరా అనేవి నిత్యావసర సేవల నిర్వహణ చట్టం కిందకు వస్తాయి కాబట్టి సమ్మెలు నిషేధించడం ఆనవాయితీ. ప్రతి 6 నెలలకు గడువు పూర్తికాగానే ఇలా ఉత్తర్వులిస్తారు.

## చిన్నారుల నోటిలో టీకా

- ఇక సర్కారు వైద్యంలో అందుబాటులోకి
- డయేరియాను నిలువరించటమే లక్ష్యం

ఈనాడు, హైదరాబాద్: డయేరియా(నీళ్ల విరేచనాలు)ను నిలువరించేందుకు తొలిసారిగా సర్కారు వైద్యంలో రోటా వైరస్ టీకాను ప్రవేశపెట్టనున్నారు. వచ్చేనెల 5న దీనిని అందుబాటులోకి తీసుకురానున్నారు. ప్రైవేటు వైద్యంలో ఈ టీకా ఇప్పటికే అందుబాటులో ఉన్నా ప్రభుత్వ ఆసుపత్రుల్లో లేదు. నీళ్ల విరేచనాలకు వేర్వేరు కారణాలున్నా.. ప్రధానంగా రోటా వైరస్ కారణంగా ఏర్పడే విరేచనాలు చిన్నారుల్లో మృత్యుశాపంగా మారుతున్నాయి. సిరంజి ద్వారా 2.5 ఎం.ఎల్. టీకా ద్రావణాన్ని తీసుకొని చిన్నారుల నోటిలో నేరుగా వేస్తారు. శిశువుకు 6, 10, 14 వారాల వయసున్నప్పుడు ఇతర టీకాలతో పాటు రోటా వైరస్ టీకాను వేస్తారు. ఈ టీకాకు బూస్టర్ డోసు అవసరం లేదు. మూడు మోతాదులు సరిపోతాయి. వచ్చే గురువారం హైదరాబాద్‌లోనే రోటా వైరస్ టీకా ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు వైద్యఆరోగ్యశాఖ సన్నాహాలు చేస్తోంది.

## తెలంగాణకు 59.01.. ఏపీకి 152 టీఎంసీలు

- కృష్ణా నదీ యాజమాన్య బోర్డు ఉత్తర్వులు
- శ్రీశైలం, సాగర్‌లలో 257.54 టీఎంసీల నికర జలాలు

ఈనాడు, హైదరాబాద్: శ్రీశైలం, నాగార్జున సాగర్ జలాశయాల నుంచి తెలుగు రాష్ట్రాలకు నీటి కేటాయింపులు చేస్తూ శుక్రవారం కృష్ణా నదీ యాజమాన్య బోర్డు ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు బోర్డు సభ్య కార్యదర్శి పరమేశం ఆదేశాలు ఇచ్చారు. సెప్టెంబరు నెల వరకు కేటాయించిన వాటాలను రెండు రాష్ట్రాలకు విడుదల చేయాలని ఆయా జలాశయాల ముఖ్య ఇంజినీర్లను ఆదేశించారు. రెండు జలాశయాల్లో కనీస నీటి మట్టానికి మించి 257.54 టీఎంసీల నికర జలాలు ఉన్నాయి.

◆ తెలంగాణ తాగు, సాగు నీటి అవసరాలకు రెండు జలాశయాల నుంచి 59.01 టీఎంసీలు కేటాయించారు. శ్రీశైలం జలాశయం నుంచి మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా తాగు, సాగునీటికి 14.50 టీఎంసీలు కేటాయించారు. నాగార్జున సాగర్ జలాశయం కింద మొత్తం 44.51 టీఎంసీల జలాలు ఇచ్చారు. ఎడమ కాలువకు 26.06 టీఎంసీలు, ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టుకు 10.47 టీఎంసీలు, హైదరాబాద్ తాగునీటి అవసరాలకు 5.90 టీఎంసీలు, మిషన్ భగీరథ అవసరాలకు 2.08 టీఎంసీలు కేటాయించారు.

◆ ఆంధ్రప్రదేశ్‌కు రెండు జలాశయాల నుంచి 152 టీఎంసీల కేటాయింపు జరిగింది. శ్రీశైలం నుంచి 100 టీఎంసీలు ఇవ్వగా ఇందులో పోతిరెడ్డిపాడుతో పాటు చెన్నై తాగునీటి అవసరాలకు కలిపి 88 టీఎంసీలు కేటాయించారు. హంద్రీనీవా సుజల స్రవంతి, ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకానికి కలిపి 12 టీఎంసీలు ఇచ్చారు. నాగార్జున సాగర్ జలాశయం కింద 52 టీఎంసీలు కేటాయించగా కుడి కాలువ కింద 32 టీఎంసీలు, ఎడమ కాలువ కింద 5 టీఎంసీలు, కృష్ణా డెల్టా అవసరాలకు 15 టీఎంసీల కేటాయింపులు చేశారు.

| జలాశయం | ప్రస్తుతం నీటి మట్టం (అడుగుల్లో) | కనీస నీటి మట్టం (అడుగుల్లో) | అందుబాటులో ఉన్న నికర జలాలు (టీఎంసీల్లో) |
|---|---|---|---|
| శ్రీశైలం | 878.90 | 834 | 128.369 |
| నాగార్జునసాగర్ | 571.70 | 510 | 129.171 |

## విద్యా దానం చేస్తారా?

- బోధన సేవపై ఆసక్తి ఉన్న వారికి ప్రత్యేక అవకాశం
- 'విద్యాంజలి' కార్యక్రమానికి శ్రీకారం

దేవరుప్పుల, న్యూస్‌టుడే: పాఠ్యాంశాలు, సాంస్కృతిక అంశాలలో ప్రవేశం ఉండి.. బోధనపై ఆసక్తి ఉన్న ఎన్జీవోలు, విశ్రాంత ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థుల సేవలు వినియోగించుకోవడానికి విద్యా శాఖ 'విద్యాంజలి' పేరుతో ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పాఠ్యాంశాలతో పాటు విద్యార్థినులకు ఆత్మ రక్షణ విద్యలు, కుట్టు పనులు, ఆటలు, పాటలు, నాటికలు, కోలాటం వంటి అంశాలను తమ ఖాళీ సమయంలో నేర్పించాలనే తపన ఉన్న ఔత్సాహికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరింది. ఎలాంటి భత్యాలు ఆశించకుండా తమకు తెలిసిన విద్య నేర్పాలనుకునే ఔత్సాహికులు తమ వివరాలను 'విద్యాంజలి' పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని సూచించింది. ఆడ పిల్లల విద్యాలయాలకు సంబంధించి సాధ్యమైనంత వరకు మహిళా ఔత్సాహికుల ఎంపికకే ప్రాధాన్యమివ్వాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఈ నెల 13న ఉత్తర్వులు జారీ చేశారు. పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకున్న వారికి.. కుదిరిన సమయంలోనే బోధనకు అవకాశం కల్పిస్తారు.

## డెంగీపై తక్షణ చర్యలేంటి?

- నివారణకు ఏం చేస్తున్నారు?
- వివరాలు సమర్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించిన హైకోర్టు
- అత్యవసర పరిస్థితిగా భావించాలని సూచన



ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో విస్తృతంగా వ్యాపిస్తున్న డెంగీ వ్యాధి నివారణకు ఏం చర్యలు తీసుకుంటున్నారో తెలియజేయాలని తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే 1440 మంది దీని బారిన పడినట్టు పత్రికల్లో చదివామని, ఇది ప్రారంభం మాత్రమేనని వ్యాఖ్యానించింది. 'రక్షణకు ఏం చర్యలు చేపట్టారో తెలియజేయండి. కార్చిచ్చులా వ్యాపించే అవకాశం ఉందని పత్రికలు పేర్కొంటున్నాయి. నియంత్రణకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది' అని పేర్కొంది. డెంగీ వ్యాధి నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడాన్ని సవాలు చేస్తూ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కొంపల్లికి చెందిన డాక్టర్ ఎం.కరుణ ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆర్.ఎస్. చౌహాన్, జస్టిస్ ఎ.అభిషేక్‌రెడ్డిలతో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ న్యాయవాది పవన్‌కుమార్ వాదనలు వినిపించారు. జిల్లా కలెక్టర్ల నేతృత్వంలో కమిటీల ఏర్పాటు, దోమల నివారణ చర్యలు అవసరమన్నారు. ధర్మాసనం స్పందిస్తూ డెంగీ వ్యాధి అంశాన్ని అత్యవసర పరిస్థితిగా భావించి చర్యలు తీసుకునేలా ప్రభుత్వానికి చెప్పాలని అడ్వొకేట్ జనరల్ బి.ఎస్.ప్రసాద్‌కు సూచించింది. ఇప్పటికే డెంగీ సోకినవారి రక్షణకు ఏం చర్యలు తీసుకున్నారు, భవిష్యత్తులో రాకుండా నివారణకు ఏం చర్యలు తీసుకుంటున్నారో చెప్పాలంటూ ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ విచారణను సెప్టెంబరు 7వ తేదీకి వాయిదా వేసింది.

## ఔషధ సంస్థలకు ముకుతాడు

- సరఫరాలో జాప్యం చేస్తే నిషేధమే
- ఆరోగ్య శాఖ కీలక నిర్ణయం

ఈనాడు, హైదరాబాద్: ప్రభుత్వ ఆసుపత్రులకు అవసరమైన ఔషధాలను సరఫరా చేయడంలో కొన్ని సంస్థలు ఉద్దేశపూర్వకంగానే జాప్యం చేస్తున్నాయని వైద్యారోగ్యశాఖ గుర్తించింది. గతంలో ఔషధ కొనుగోలు ప్రక్రియలో తక్కువ ధరను ప్రతిపాదించి, అధిక సంఖ్యలో ఔషధాల సరఫరాకు అర్హత సాధించిన సంస్థల్లో కొన్ని ఈ తరహా వ్యవహారాలకు పాల్పడుతున్నట్లుగా నిర్ధారించింది. నిరుపేద రోగులకు ఇబ్బందులు కలిగేలా వ్యవహరిస్తున్న ఈ సంస్థలకు ముకుతాడు వేయాలనే నిర్ణయానికొచ్చింది. ఇందులో భాగంగానే ఇటీవల తెలంగాణ రాష్ట్ర వైద్యసేవలు మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (టీఎస్ఎంఎస్ఐడీసీ) ఆధ్వర్యంలో ఔషధ ఉత్పత్తి సంస్థల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఈ విషయంపై ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు స్పష్టమైన సంకేతాలిచ్చారు. నిర్దేశించిన గడువులోగా ఔషధాలను సరఫరా చేయడానికి ముందుకు రాకపోతే.. టెండరులో తర్వాత స్థానాల్లో ఉన్న సంస్థలకు ప్రాధాన్యమివ్వాలని నిర్ణయించారు.

## 2న అల్పపీడనం

### రేపు, ఎల్లుండి భారీ వర్షాలు

ఈనాడు, హైదరాబాద్ : బంగాళాఖాతం ఈశాన్య ప్రాంతంలో వచ్చే సోమవారం (సెప్టెంబరు 2) అల్పపీడనం ఏర్పడే అవకాశాలున్నాయని వాతావరణ కేంద్రం అధికారి రాజారావు తెలిపారు. తమిళనాడు కోస్తా ప్రాంతంపై, ఒడిశాపై 5.8 కిలోమీటర్ల ఎత్తున ఉపరితల ఆవర్తనాలున్నాయి. వీటి ప్రభావంతో అల్పపీడనం ఏర్పడుతుందని అంచనా. వీటి వల్లే తెలంగాణలో పలుచోట్ల వర్షాలు కురుస్తున్నాయి. ఆది, సోమవారాల్లో భారీ వర్షాలు పడే అవకాశాలున్నాయి. శుక్రవారం పగలు రాష్ట్రంలోని 551 ప్రాంతాల్లో వర్షాలు పడ్డాయి. అత్యధికంగా కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా లోనవెల్లిలో 93, కంగ్టి(సంగారెడ్డి)లో 67.5, తిమ్మారావుపేట(ఖమ్మం)లో 66, వైదేహీనగర్(హైదరాబాద్ నగరం)లో 56.8, కొండాపూర్(సంగారెడ్డి)లో 53.5, మాచెర్లలో 51.3 మిల్లీమీటర్ల చొప్పున వర్షం కురిసింది.

## వర్క్స్, అకౌంట్స్ శాఖలో పదోన్నతులకు మార్గం సుగమం

ఈనాడు, హైదరాబాద్ : రాష్ట్ర వర్క్స్, అకౌంట్స్ శాఖలో 30 సంవత్సరాలుగా అపరిష్కృతంగా ఉన్న పదోన్నతులకు మార్గం సుగమమైంది. ఆబ్కారీ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ చొరవతో ఈ సమస్య ఎట్టకేలకు పరిష్కారమైంది. పదోన్నతులకు కింది స్థాయి అధికారుల మధ్య నిష్పత్తిని నిర్ధారిస్తూ సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు కారెం రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజేందర్, టీజీవోల ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, టీజీవో రవాణాధికారుల నేత రవీంద్రకుమార్, వర్క్స్, అకౌంట్స్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బి.శంకర్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్ తదితరులు మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఉద్యోగుల పక్షపాతి అని, ఆయన వారికి అన్ని విధాలుగా అనుకూల నిర్ణయాలు తీసుకుంటున్నారని తెలిపారు.

## ఏపీ హైకోర్టు సీజేగా జస్టిస్ జేకే మహేశ్వరి

- మధ్యప్రదేశ్ హైకోర్టు నుంచి బదిలీ
- ఇదివరకు సిఫార్సు చేసిన జస్టిస్ విక్రమ్‌నాథ్ గుజరాత్‌కు
- సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు



జస్టిస్ మహేశ్వరి

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ప్రస్తుతం మధ్యప్రదేశ్ హైకోర్టులో సేవలందిస్తున్న జస్టిస్ జేకే మహేశ్వరిని నియమించాలని సుప్రీంకోర్టు కొలీజియం నిర్ణయించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్‌గొగొయి నేతృత్వంలోని కొలీజియం దేశంలోని మొత్తం ఎనిమిది హైకోర్టులకు ప్రధాన న్యాయమూర్తుల పేర్లను ఖరారు చేసింది. అందులో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఉంది. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఏర్పడిన నాటినుంచి తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోనే కొనసాగుతోంది. ఈ ఏడాది ఏప్రిల్ 8న సుప్రీంకోర్టు కొలీజియం అలహాబాద్ హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ విక్రమ్‌నాథ్ పేరును సిఫార్సు చేస్తూ కేంద్ర ప్రభుత్వానికి పంపించింది. కేంద్రం ఆ పేరును పునఃపరిశీలించాలని కోరుతూ తిప్పి పంపడంతో కొలీజియం తాజాగా ఆయన్ని గుజరాత్ హైకోర్టుకు పంపి, ఆ స్థానంలో ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ జేకే మహేశ్వరి పేరును సిఫార్సు చేసింది. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే ఇదివరకు చేసిన ప్రతిపాదనను పక్కనపెట్టి, ఆ స్థానంలో జస్టిస్ మహేశ్వరిని సిఫార్సు చేస్తున్నట్లు కొలీజియం పేర్కొంది.

## ఆంగ్ల పదాల ఉచ్చారణకు ఇఫ్లూ యాప్

ఈనాడు, హైదరాబాద్: ఆంగ్ల పదాల ఉచ్చారణపై ఉచితంగా పాఠాలు చెప్పేందుకు హైదరాబాద్‌లోని ఇంగ్లిష్, ఫారెన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ (ఇఫ్లూ) 'ఇంగ్లిష్ ప్రో' పేరిట మొబైల్ యాప్‌ను రూపొందించింది. ఇందులో 4 మాడ్యూళ్లు, 20 పాఠాలు ఉన్నాయి. పదంపై క్లిక్ చేయగానే ఉచ్చారణ స్పష్టంగా వినిపించేలా తయారు చేశారు. చిన్న, పెద్ద ఫ్రీక్వెన్సీతో పలికే 400 రకాల పదాలు, 200 చిన్న వాక్యాలు పొందుపరిచారు. ఈ యాప్‌ను వారం, పది రోజుల్లో ప్రారంభించనున్నారు.

### సామాజిక బాధ్యతతో

"భారతీయ సంప్రదాయ ఆంగ్లాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో 'ఇంగ్లిష్ ఇన్ భారతీయ వే' పేరిట ఇంగ్లిష్ ప్రో యాప్‌ను రూపొందించాం. ఆంగ్ల భాషలో నైపుణ్యం సాధించేందుకు ఇది ఉపయోగపడుతుంది. దేశంలోనే మొదటిసారి విశ్వవిద్యాలయ సామాజిక బాధ్యత (యూఎస్ఆర్) కార్యక్రమం కింద ఈ యాప్‌ను తీసుకువచ్చాం. ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో ఆంగ్ల బోధనకు ఎంతో సహకారంగా ఉంటుంది" అని ఇఫ్లూ ఉపకులపతి ఆచార్య సురేష్‌కుమార్ 'ఈనాడు'కు వివరించారు.

## ఏడుగురికి డీఈవోలుగా పదోన్నతి!

ఈనాడు, హైదరాబాద్: పాఠశాల విద్యాశాఖలో ఏడుగురు అధికారులకు పూర్తిస్థాయి డీఈవోలుగా పదోన్నతి లభించనుంది. ఈ మేరకు శాఖా పదోన్నతుల కమిటీ(డీపీసీ) ఆమోదం తెలిపినట్లు విద్యాశాఖ వర్గాలు తెలిపాయి. మొత్తం తొమ్మిది మందికి పదోన్నతి లభించాల్సి ఉండగా అందులో ఒకరికి తిరస్కరించారు. మరొక స్థానానికి అర్హులు లేకపోవడంతో క్యారీ ఫార్వర్డ్(వచ్చే సారికి) చేశారు. పదోన్నతులు పొందే వారిలో దుర్గాప్రసాద్(నిజామాబాద్), రేవతిరెడ్డి(ఎస్‌సీఈఆర్‌టీ), వెంకటేశ్వర్లు(జగిత్యాల), రోహిణి(యాదాద్రి), జగన్నాథం(హైదరాబాద్ డీఈఓ కార్యాలయం ఏడీ), ఉషారాణి(రంగారెడ్డి), స్వర్ణలత(మహబూబ్‌నగర్ డైట్) ఉన్నారు. త్వరలో అధికారిక ఉత్తర్వులు వెలువడనున్నాయి.

## విద్యార్థులకు 'పారిశ్రామిక శిక్షణ'

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని డిగ్రీ, పాలిటెక్నిక్ విద్యార్థులను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌పై కళాశాల, సాంకేతిక విద్యాశాఖ శిక్షణ ఇవ్వనుంది. ఈ మేరకు 'ది ఇండస్ ఎంటర్‌ప్రెన్యూర్స్'(టై), హైదరాబాద్ విభాగంతో ఎంఓయూ కుదుర్చుకున్నారు. కళాశాల విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిత్తల్, టై బోర్డు సభ్యుడు సుబ్బరాజు పేరిచెర్ల సమక్షంలో విద్యాశాఖ అధికారులు, టై ప్రతినిధులు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. విభిన్న ఆలోచనలుండి.. పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని కోరుకునే వారికి టై సంస్థ శిక్షణ ఇస్తుంది. కార్యక్రమంలో సాంకేతిక విద్యాశాఖ ఆర్‌జేడీ రఘు, కళాశాల విద్యాశాఖ సంయుక్త సంచాలకురాలు మంజులత తదితరులు పాల్గొన్నారు.

## 'ట్రెసాలో టీజీటీఏ విలీనం పూర్తయింది'

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్ర రెవెన్యూ ఉద్యోగుల సంఘం (ట్రెసా)లో తెలంగాణ తహసీల్దార్ల సంఘం (టీజీటీఏ) విలీన ప్రక్రియ ఈ నెల 28వ తేదీన పూర్తయిందని ట్రెసా రాష్ట్ర అధ్యక్షుడు వంగ రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.గౌతంకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాజాగా కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు జరుగుతున్న ప్రచారాన్ని ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. టీజీటీఏకు చెందిన 90శాతం కార్యవర్గ సభ్యుల అభిప్రాయం మేరకే విలీనం చేపట్టినట్లు వారు తెలిపారు.

## జస్టిస్ పి.వి.సంజయ్‌కుమార్ బదిలీపై ఖండన

### హైకోర్టు బార్ అసోసియేషన్ ఏకగ్రీవ తీర్మానం

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ హైకోర్టులో సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ పి.వి.సంజయ్‌కుమార్‌ను పంజాబ్-హరియాణా హైకోర్టు జూనియర్ న్యాయమూర్తిగా బదిలీ చేయడాన్ని ఖండిస్తూ బార్ అసోసియేషన్ ఏకగ్రీవంగా తీర్మానించింది. ప్రస్తుతం జస్టిస్ పి.వి.సంజయ్‌కుమార్ ప్రధాన న్యాయమూర్తి తర్వాత సీనియర్ న్యాయమూర్తిగా కొనసాగుతున్నారు. హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సూర్యకరణ్‌రెడ్డి నేతృత్వంలో కార్యనిర్వాహక కమిటీ శుక్రవారం మధ్యాహ్నం 2.15 గంటలకు అసాధారణ సమావేశం నిర్వహించింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఎక్కడా తెలంగాణ రాష్ట్ర ప్రాతినిధ్యం లేనందున జస్టిస్ సంజయ్‌కుమార్‌ను ప్రధాన న్యాయమూర్తిగా నియమించకుండా జూనియర్ న్యాయమూర్తిగా బదిలీ చేయడం తగదని పేర్కొంది. ఈమేరకు బార్ అసోసియేషన్ కార్యదర్శి ఓ ప్రకటన విడుదల చేశారు.

## పోలీసుల వేధింపుల నుంచి రక్షించాలి

### జాతీయ బీసీ కమిషన్‌కు భాజపా నేత దిలీప్ ఫిర్యాదు

ఈనాడు, దిల్లీ: పోలీసుల వేధింపుల నుంచి భాజపా కార్యకర్తలను రక్షించాలని జాతీయ బీసీ కమిషన్ సభ్యుడు తల్లోజు ఆచారికి భాజపా నేత ఎన్.దిలీప్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు దిల్లీలో శుక్రవారం ఆయన వినతి పత్రం అందజేశారు. నాగర్‌కర్నూలు జిల్లా తెలకపల్లి మండలం అనంతసాగర్‌కు చెందిన చిలక పర్వతయ్య, ఆయన కుమారుడు ముత్యాలుపై తెలకపల్లి ఎస్సై వెంకటేష్ అక్రమ కేసులు బనాయించి చిత్రహింసలకు గురి చేశారని పేర్కొన్నారు. అధికార తెరాస నాయకుల ఆదేశాలతో ప్రతిపక్ష పార్టీల కార్యకర్తలను వేధిస్తున్న ఎస్సైపై చర్యలు తీసుకునేలా ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం దిలీప్ విలేకరులతో మాట్లాడుతూ.. ఎస్పీ నుంచి వివరాలు తీసుకుని న్యాయం చేస్తామని ఆచారి హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## పత్తి కొనుగోలుకు ఏర్పాట్లు చేయండి

### కలెక్టర్లకు వ్యవసాయశాఖ లేఖ

ఈనాడు, హైదరాబాద్: వచ్చే అక్టోబరు నుంచి మార్కెట్లకు రానున్న పత్తి పంటను మద్దతు ధరకు కొనేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్లకు వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి శుక్రవారం లేఖ రాశారు. భారత పత్తి సంస్థ(సీసీఐ) మద్దతు ధరకు కొనే కేంద్రాలకు అవసరమైన మౌలిక సదుపాయాలన్నీ కల్పించాలని సూచించారు. ఇందుకోసం కలెక్టర్ ఆధ్వర్యంలోని జిల్లా కమిటీ వచ్చే నెల 15లోగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

## 'సంఘం పేరును దుర్వినియోగపరిస్తే చర్యలు'

ఈనాడు, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా కొనసాగుతున్న జి.హర్షవర్ధన్‌రెడ్డి, అనుచరులు ఎవరైనా పీఆర్‌టీయూ తెలంగాణ పేరును దుర్వినియోగపరిస్తే క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఆ సంఘం రాష్ట్ర సమావేశం తీర్మానించింది. అన్ని జిల్లాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శుల సమావేశంలో శుక్రవారం రాష్ట్ర అధ్యక్షుడు అంజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి చెన్నయ్య మాట్లాడుతూ- హర్షవర్ధన్‌రెడ్డికి పీఆర్‌టీయూ తెలంగాణతో సంబంధం లేదన్నారు. వ్యవస్థాపక అధ్యక్షుడినంటూ సంఘానికి రాష్ట్రస్థాయి కొత్త కార్యవర్గాన్ని ఆయన ఇటీవల ప్రకటించడం విదితమే.

## హామీలను విస్మరించారు: టీఎస్‌టీయూ

ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పింఛనుదార్లకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం విస్మరించిందని టీఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్లా, ప్రధాన కార్యదర్శి చందూరి రాజిరెడ్డి ఆరోపించారు. వారు హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన సంఘ అత్యవసర సమావేశంలో మాట్లాడారు.

## పురపాలక మేనేజర్లుగా పదోన్నతులు

రాష్ట్ర పురపాలకశాఖలోని 17 మంది సీనియర్ అసిస్టెంట్లకు మేనేజర్లు/రెవెన్యూ అధికారులుగా పదోన్నతి కల్పిస్తూ డైరెక్టర్ టి.కె.శ్రీదేవి ఆదేశాలు జారీచేశారు. తాత్కాలిక పదోన్నతులుగా పేర్కొంటూ వారిని వివిధ మున్సిపాలిటీలకు బదిలీ చేశారు.

## బీసీల బడ్జెట్ మొత్తాన్ని పెంచాలి: ఆర్.కృష్ణయ్య

బషీర్‌బాగ్, న్యూస్‌టుడే: త్వరలో ప్రవేశపెట్టనున్న 2019-20 బడ్జెట్‌లో బీసీల పద్దును ప్రభుత్వం రూ.20,000 కోట్లకు పెంచాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య కోరారు. ఈ మేరకు శుక్రవారం ముఖ్యమంత్రి కేసీఆర్‌కు లేఖ రాసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ కార్పొరేషన్ రాయితీ రుణాల కోసం రూ.10,000 కోట్లు; గురుకులాల అభివృద్ధి, కళాశాలల సొంత భవనాల ఏర్పాటుకు రూ.వెయ్యి కోట్లు కేటాయించాలన్నారు. నియోజకవర్గానికి రెండు వంతున బీసీ గురుకుల పాఠశాలలు మంజూరుచేయాలని కోరామన్నారు.

# గాంధీ జయంతికి ఘనంగా ఏర్పాట్లు

ఢిల్లీ: మహాత్మాగాంధీ 150వ జయంతిని పురస్కరించుకుని అక్టోబరు 2న అహ్మదాబాద్‌లోని సబర్మతి ఆశ్రమంలో భారీ స్థాయిలో వేడుకలు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. బాపూజీ జయంతి వేడుకల కమిటీ శుక్రవారం ప్రధాని మోదీ అధ్యక్షతన దిల్లీలో సమావేశమైంది. అక్టోబర్ 2న జాతిపిత స్మారకార్థం ఒక నాణాన్ని, స్టాంపులను విడుదల చేయాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. మహాత్ముని విగ్రహాలను 54 దేశాల్లో ఆవిష్కరించాలని, దేశ వ్యాప్తంగా శ్రమదానాలు నిర్వహించి ప్లాస్టిక్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేయాలని కూడా సంకల్పించారు. సమావేశంలో కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, అమిత్‌షా, నిర్మలా సీతారామన్, రాజ్యసభలో విపక్ష నేత గులాం నబీ ఆజాద్ పాల్గొన్నారు.

## 2 వరకు సీబీఐ అదుపులోనే చిదంబరం

ఢిల్లీ: కేంద్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి పి.చిదంబరం సెప్టెంబరు రెండో తేదీ వరకు సీబీఐ అదుపులోనే ఉండేలా శుక్రవారం ఇక్కడి ప్రత్యేక న్యాయస్థానం ఆదేశాలు ఇచ్చింది. చాలా పత్రాలపై విచారణ జరపాల్సి ఉన్నందున మరో అయిదు రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని సీబీఐ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ కె.ఎం.నటరాజ్ కోరారు.

## చిన్మయానంద్ కేసులో సుప్రీం ముందుకు యువతి

ఢిల్లీ: భాజపా నేత, కేంద్ర మాజీ మంత్రి చిన్మయానంద్ తనను లైంగికంగా వేధించారంటూ ఆరోపణలు చేసి, అదృశ్యమైన న్యాయవిద్య విద్యార్థిని... నాటకీయ పరిణామాల మధ్య సుప్రీంకోర్టుకు హాజరైంది. ఈ నెల 24 నుంచి కనిపించకుండాపోయిన ఆమె శుక్రవారం రాజస్థాన్‌లో ప్రత్యక్షమైంది. 'ఫ్రెండ్'తో కనిపించిన ఆమెను పోలీసులు వెంటబెట్టుకుని ఉత్తర్‌ప్రదేశ్‌కు పయనమయ్యారు. ఇంతలో... జస్టిస్ ఆర్.భానుమతి, జస్టిస్ ఎ.ఎస్.బోపన్నలతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ అంశంపై విచారణ చేపట్టింది. ఆమెను తమ ముందు హాజరుపరచాలని ఆదేశించింది. దృశ్య మాధ్యమం ద్వారా న్యాయమూర్తులు ఆమెతో మాట్లాడారు. సెప్టెంబరు 2న తదుపరి విచారణ చేపడతామని చెప్పారు.



## సెక్యూరిటీ గార్డులకు ఆర్‌ఎస్‌ఎస్ శిక్షణ ఇవ్వాలి

ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుల శారీరక, మానసిక దృఢత్వ పెంపుదలకు వారిని ఆర్‌ఎస్‌ఎస్ శాఖలకు పంపిస్తే మంచిది. అక్కడ శిక్షణ ఎంతో ఉన్నతంగా ఉంటుంది. వారు ఎంతోకొంత నేర్చుకుంటారు. గార్డులకు శిక్షణ తప్పనిసరి అని చెప్పడమే నా ఉద్దేశం.

– ప్రైవేట్ సెక్యూరిటీ పరిశ్రమ సదస్సులో రైల్వే శాఖ మంత్రి పీయూష్ గోయల్

# ఎదుటివారి మాటా విందాం

- భిన్నాభిప్రాయాలను గౌరవించే సంస్కారం అవసరం
- నిర్మాణాత్మక విమర్శలను స్వాగతిస్తా
- ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యలు
- భాషలతో దేశం అనుసంధానమవుతుందని వెల్లడి



దిల్లీలో శుక్రవారం 'ది యోగా ఇన్‌స్టిట్యూట్' డైరెక్టర్ హన్సా యోగేంద్రకు యోగా పురస్కారం అందజేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ

దిల్లీ: సమాజంలో భిన్న భావజాలాలు ఉన్న వ్యక్తుల మధ్య నిరంతరం సంభాషణలు సాగుతుండాలని ప్రధాని నరేంద్ర మోదీ ఆకాంక్షించారు. తాను నిర్మాణాత్మక విమర్శలను స్వాగతిస్తానని చెబుతూ ప్రజా జీవితంలో ఉన్నవారు ఇతరుల అభిప్రాయాలను వినాలని అన్నారు. కోచిలో శుక్రవారం జరిగిన మలయాళం మనోరమ న్యూస్ కాంక్లేవ్‌ను ఉద్దేశించి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. "ఈ సమావేశంలో పాల్గొన్నవారిలో ఎక్కువ మందికి నా భావజాలం ఉండకపోవచ్చు. అయితే చాలా మంది ఆలోచనపరులు ఇక్కడ ఉన్నారు. వారి నిర్మాణాత్మక విమర్శల కోసం ఎదురు చూస్తున్నా. ప్రజా జీవితంలో ఉన్నవారు సాధారణంగా తమ ఆలోచన విధానాలకు దగ్గరగా ఉండే వ్యక్తులు నిర్వహించే సదస్సుల్లోనే పాల్గొంటారు. ఎందుకంటే అదివారికి సౌకర్యంగా ఉంటుంది. కానీ భిన్నాభిప్రాయాలు ఉన్న వ్యక్తులు, సంఘాల మధ్య నిరంతరం చర్చలు జరుగుతుండాలి. ఎదుటివారి అభిప్రాయాలను విని, గౌరవించగలిగే సంస్కారం ప్రజా జీవితంలో ఉండాలి" అని అన్నారు. నూతన భారత్‌లో యువత విజయాలు సాధించాలంటే ఇంటి పేర్లు అవసరం లేదని, తమ పేరును సొంతంగా లిఖించుకోగలిగే సామర్థ్యం వారికి ఉంటే చాలని అన్నారు. భాషల ద్వారా దేశాన్ని ఏకం చేయవచ్చని చెప్పారు. పత్రికలు రోజూ ప్రతి పదాన్నీ 10-12 భాషల్లో ప్రచురిస్తే ప్రతి ఒక్కరూ ఏడాదిలో వివిధ భాషల్లో 300 పదాలను నేర్చుకుంటారని అన్నారు.

### ప్రాచీన ఆయుర్వేదంపై పరిశోధనలు

యోగా పురస్కారాల ప్రదానం సందర్భంగా జరిగిన మరో కార్యక్రమంలో ప్రధాని మోదీ ప్రసంగిస్తూ తీవ్రమైన వ్యాధుల నివారణకు సంబంధించి ప్రాచీన ఆయుర్వేదంలో విజ్ఞానం ఎంతో ఉందని అన్నారు. దీన్ని ఆధునిక శాస్త్రాలతో అనుసంధానం చేయాలని సూచించారు. బౌద్ధ వైద్య విధానమైన సోవ రిగ్పాను ఆయుష్‌లో భాగంగా చేర్చనున్నామని చెప్పారు. దీనిపై లద్దాఖ్‌లో అంతర్జాతీయ వైద్య కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. దేశమంతటా ఒకే తరహా సేవలు అందించేందుకు ఆయుష్ గ్రిడ్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. దేశంలో 12,500 ఆయుష్ కేంద్రాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. హరియాణాలోని పది పట్టణాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాలను ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు.

### ఖట్టర్‌జీ.. ఆయుర్వేద మందులు వాడండి

హరియాణాలోని పంచకులలో ఆయుర్వేద కేంద్రాన్ని ప్రారంభించిన సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ పాల్గొన్నారు. ఆయన గొంతు నొప్పితో బాధపడుతుండడాన్ని గమనించిన ప్రధాని మోదీ ఆయుర్వేద కేంద్రంలో చికిత్స చేయించుకోండని సూచించారు.



శ్రీనగర్‌లో శుక్రవారం భద్రతాదళాలు బాష్పవాయు గోళాలను ప్రయోగించడంతో పరుగులు తీస్తున్న నిరసనకారులు

## ఇమ్రాన్ ఖాన్ నోట మళ్లీ అణ్వాయుధాల మాట

ఇస్లామాబాద్: కష్టంలో ఉన్న కశ్మీరీలకు తుదిశ్వాస వరకూ తోడుంటామని పాకిస్థాన్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ అన్నారు. జమ్మూ-కశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తిని భారత ప్రభుత్వం రద్దు చేసినందుకు నిరసనగా శుక్రవారం పాకిస్థాన్ వ్యాప్తంగా నిరసనకారులు 'కశ్మీర్ అవర్' పేరుతో కార్యక్రమాలు చేపట్టారు. ఇస్లామాబాద్‌లోని కాన్‌స్టిట్యూషన్ అవెన్యూ వద్ద జరిగిన ముఖ్య కార్యక్రమంలో ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ పాల్గొన్నారు. "80 లక్షల మంది కశ్మీరీలు నాలుగు వారాలుగా అత్యంత క్లిష్టమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. పాకిస్థానీయులంతా వారికి బాసటగా నిలుస్తున్నారు. కశ్మీరీల ఆవేదనను, బాధను మేము పంచుకుంటాం. రెండు అణ్వాయుధ దేశాల మధ్య ఘర్షణలు యావత్ ప్రపంచానికి చేటు చేస్తాయని ప్రపంచ దేశాలు గ్రహించాలి" అని ఖాన్ అన్నారు. మధ్యాహ్నం 12 తర్వాత సుమారు అరగంట పాటు ట్రాఫిక్‌ను ఎక్కడికక్కడ నిలిపివేశారు. నిరసనకారులు జెండాలు పట్టుకుని, భారత్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

### మోదీకి వ్యతిరేకంగా మాట్లాడుతుండగా.. షాక్!

'కశ్మీర్ అవర్' ర్యాలీలో భారత ప్రధాని మోదీకి వ్యతిరేకంగా రైల్వే మంత్రి షేక్ రషీద్ అహ్మద్ మాట్లాడుతుండగా.. విద్యుదాఘాతానికి గురయ్యారు. దీంతో ఆయన వెంటనే తన ప్రసంగాన్ని ఆపేశారు. ఇందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో తెగ చక్కర్లు కొడుతోంది.

★ కశ్మీర్ లోయలోని అనేక ప్రాంతాలతోపాటు శ్రీనగర్‌లో శుక్రవారం ప్రార్థనలకు ముందు మరోసారి ఆంక్షలను అధికారులు విధించారు. 144వ సెక్షన్ కింద నిషేధాజ్ఞలు ప్రకటించారు. మరోవైపు రెండు రోజుల పర్యటన కోసం సైన్యాధిపతి జనరల్ బిపిన్ రావత్ శుక్రవారం శ్రీనగర్ చేరుకున్నారు. దేశంలోకి చొరబడేందుకు పెద్ద సంఖ్యలో ఉగ్రవాదులు నియంత్రణ రేఖ ఆవల సిద్ధంగా ఉన్నట్లు ఆయన తెలిపారు.

## జీడీపీ పతనం మోదీ నిర్వాకమే: కాంగ్రెస్

దిల్లీ: స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ) పతనం.. మోదీ కారణంగా తలెత్తిన విపత్తేనని, ప్రపంచ సమస్యల పాత్ర దీనిలో లేదని కాంగ్రెస్ పార్టీ విమర్శించింది. దేశంలో ఆర్థిక అత్యయిక పరిస్థితిని ప్రకటించాలని డిమాండ్ చేసింది. కాంగ్రెస్ ముఖ్య అధికార ప్రతినిధి రణదీప్ సూర్జేవాలా మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థ క్షీణత, ఆర్థిక మోసాల పెరుగుదలపై శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు.

## మూడోవంతు వదులుకుంటాం
### అయోధ్య కేసులో సుప్రీంకు తెలిపిన షియా వక్ఫ్ బోర్డు

దిల్లీ: అయోధ్యలోని 2.77 ఎకరాల వివాదాస్పద భూమిలో మూడోవంతు భూమిని మందిర నిర్మాణ నిమిత్తం హిందువులకు వదులుకోవడానికి సిద్ధమని షియా వక్ఫ్‌బోర్డ్ తరఫున న్యాయవాది దింగ్రా శుక్రవారం సుప్రీంకోర్టుకు తెలిపారు.

## నిప్పులు చిమ్ముతూ.. లావా వెదజల్లుతూ..

ఇటలీలోని స్ట్రాంబోలీ ద్వీపంలో 'స్ట్రాంబోలీ' అనే అగ్నిపర్వతం రెండు రోజుల క్రితం విస్ఫోటనం చెందింది. తొలుత విపరీతంగా బూడిదను వెదజల్లిన అగ్నిపర్వతం.. ప్రస్తుతం నిప్పులు కక్కుతోంది. చిచ్చుబుడ్డిలా నిరంతరం నిప్పు కణికలను వెదజల్లుతోంది. లావా భారీగా బయటకు వస్తోంది.



## ఐఫోన్లపై హ్యాకింగ్ ఆపరేషన్

వాషింగ్టన్: ఐఫోన్లను లక్ష్యంగా చేసుకుని రెండేళ్లపాటు విచక్షణారహితంగా సాగిన హ్యాకింగ్ ఆపరేషన్‌ను గూగుల్ భద్రతా నిపుణులు బయటపెట్టారు. ఫొటోలు, తదితర సమాచారాన్ని తస్కరించేందుకుగాను హానికారక సాఫ్ట్‌వేర్‌ను చొరబడేలా చేసేందుకు వెబ్‌సైట్లను ఉపయోగించినట్లు పేర్కొన్నారు. గూగుల్‌కు చెందిన భద్రతా కార్యదళం, సైబర్ నిపుణులు ప్రాజెక్ట్ జీరో బ్లాగ్‌లో రాసిన పోస్ట్‌లో ఈ అంశాలను వివరించారు.

## ఉపాధి అవకాశాలు దివ్యాంగుల హక్కు: సుప్రీంకోర్టు

దిల్లీ: దివ్యాంగులకు ఉపాధి అవకాశాలను హక్కులాగా కల్పించాలని, సానుభూతి ప్రాతిపదికన కాదని సుప్రీంకోర్టు పేర్కొంది. సివిల్ జడ్జి నియామకం విషయంలో నీతూహర్ష్ అనే దృష్టిలోపం ఉన్న వ్యక్తి దాఖలు చేసుకున్న కేసులో ఈవిషయాన్ని స్పష్టం చేసింది.

## రూ.కోటి దాటే నగదు ఉపసంహరణలపై 2% టీడీఎస్

దిల్లీ: రూ.కోటిని మించే నగదు ఉపసంహరణలపై మూలం వద్ద 2 శాతం పన్ను మినహాయింపు (టీడీఎస్)ను విధించనున్నట్లు కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు(సీబీడీటీ) వెల్లడించింది. ఈ నిర్ణయం సెప్టెంబర్ 1 నుంచి అమలవుతుందని తెలిపింది. ఒక వ్యక్తి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆగస్టు 31 లోగా రూ.కోటి, అంతకుమించి నగదు ఉపసంహరించి ఉంటే, తర్వాతి అన్ని నగదు ఉపసంహరణలపైనా రెండు శాతం టీడీఎస్ వర్తిస్తుందని వివరించింది.

## అంకెలపై అపోహ.. వైద్యుడిని ప్రశ్నించిన ఎన్‌ఐఏ

ఈనాడు, దిల్లీ: వైద్య పరిభాషకు సంబంధించిన అంకెలపై తలెత్తిన అపోహతో పద్మశ్రీ పురస్కారాన్ని పొందిన దిల్లీ వైద్యుడిని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అధికారులు ప్రశ్నించిన వైనమిది. జమ్మూ-కశ్మీర్ వేర్పాటువాద నేత, జేకేఎల్ఎఫ్ అధినేత యాసిన్ మాలిక్‌కు సంబంధించిన పత్రాల్లో స్పష్టంగా అర్థంకాని అంకెలు ఉండటంతో దిల్లీకి చెందిన హృద్రోగ నిపుణులు, పద్మశ్రీ పురస్కార గ్రహీత డా.ఉపేంద్రకౌల్‌ను ఎన్ఐఏ శుక్రవారం వివరణ కోరింది. డా.కౌల్ గత రెండు దశాబ్దాలుగా మాలిక్‌కు గుండె జబ్బులకు చికిత్స అందిస్తున్నారు. మాలిక్‌కు డా.కౌల్ పంపిన ఒక సందేశంలో 'బ్లడ్ రిపోర్ట్ వ్యాల్యూ ఐఎన్ఆర్ 2.78' అని ఉండటంతో ఎన్ఐఏ అధికారులు దానిని ఇండియన్ రూపీస్‌గా భావించి, ఉగ్రవాదులకు సాయంగా పంపిన రూ.2.78 కోట్ల హవాలా డబ్బు కావచ్చని ఊహించారని దర్యాప్తు సంస్థ అధికారి ఒకరు వివరించారు. వాస్తవంగా వైద్య పరిభాషలో ఐఎన్ఆర్‌కు అర్థం.. 'ఇంటర్నేషనలైజ్డ్ నార్మలైజ్డ్ రేషియో' అని వివరించారు. మాలిక్ ప్రస్తుతం తీహార్ జైలులో ఉన్నారు. జమ్మూ-కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని రద్దు చేయడం, ఆంక్షలు విధించడంపై డా.కౌల్ కేంద్రప్రభుత్వంపై ఇంతకుముందు విమర్శలు కురిపించారు.



## తిమింగలాలకు కారుణ్య మరణం

అమెరికాలోని హవాయీ రాష్ట్రంలో విషాదం చోటుచేసుకుంది. స్థానిక మావీ దీవిలోని షుగర్ బీచ్‌లో బలమైన అలల ధాటికి 10 తిమింగలాలు ఒడ్డుకు కొట్టుకు వచ్చి బురదలో కూరుకుపోయాయి. ఎంతగా ప్రయత్నించినప్పటికీ తిరిగి సముద్రంలోకి చేరలేకపోయాయి. స్థానికులు గురువారం వాటిని గుర్తించి అధికారులకు సమాచారమిచ్చారు. అధికారులు వాటిలో ఆరింటిని తిరిగి సముద్రంలోకి చేర్చగలిగారు. మరో నాలుగు తిమింగలాల ఆరోగ్యం పూర్తిగా క్షీణించడంతో తొలుత మత్తుమందు ఇచ్చి.. ఆపై వాటికి కారుణ్య మరణం ప్రసాదించారు. కోలుకునే పరిస్థితి ఏమాత్రం లేకపోవడంతో వేదన నుంచి విముక్తి కల్పించేందుకే తిమింగలాలకు కారుణ్య మరణం ప్రసాదించామని అధికారులు తెలిపారు.

## త్వరలో వాట్సాప్ చెల్లింపుల సేవలు!

ఈనాడు, దిల్లీ: సామాజిక మాధ్యమం వాట్సాప్ త్వరలో డిజిటల్ చెల్లింపుల సేవలను భారత్‌లో ప్రారంభించనుంది. డేటాను భారత్‌లోనే నిల్వ చేయాలన్న రిజర్వు బ్యాంకు నిబంధలకు పూర్తి స్థాయిలో ఈ సంస్థ కట్టుబడటంతో ఆ దిశగా ముందడుగు పడుతోంది. ప్రస్తుతం డేటా నిల్వ, ప్రాసెసింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లను ఖరారు చేస్తోంది. అంతా అనుకున్న విధంగానే జరిగితే అక్టోబర్-డిసెంబర్ మధ్య వాట్సాప్ తన చెల్లింపుల సేవలను ప్రారంభించనుంది.




## హార్మోన్ థెరపీతో రొమ్ముక్యాన్సర్ ముప్పు

పారిస్: రుతుక్రమం నిలిచిపోయే మెనోపాజ్ దశలో తలెత్తే ఇబ్బందుల నుంచి ఉపశమనం పొందేందుకు తీసుకునే హార్మోన్ థెరపీతో స్వల్పంగా రొమ్ము క్యాన్సర్ ముప్పు పెరిగే అవకాశం ఉందని తాజా పరిశోధనలో వెల్లడైంది. హార్మోన్ థెరపీకి, రొమ్ము క్యాన్సర్ ముప్పునకు సంబంధం ఉన్నట్లు గతంలో కొన్ని అధ్యయనాలు తెలిపినా, తాజా పరిశోధనలో మరింత విస్పష్టంగా తేల్చారు. హార్మోన్ థెరపీ ఆపేసిన పదేళ్ల తర్వాత కూడా ముప్పు ఉంటుందని ఈ అధ్యయనంలో గుర్తించారు. మెనోపాజ్ హార్మోన్ థెరపీ(ఎంహెచ్‌టీ)ని తీసుకోని 50 నుంచి 69 ఏళ్ల మధ్య వయసుండే మహిళల్లో 100 మందిలో 6.3 మందికి రొమ్ము క్యాన్సర్ ముప్పుండగా, ఈస్ట్రోజన్, ప్రొజెస్టెజన్‌లను తీసుకునే ఇదే వయసు మహిళల్లో వ్యాధి ముప్పు 100 మందిలో 7.7 మందికి పొంచినట్లు ఈ అధ్యయనంలో గుర్తించారు. అదే ప్రొజెస్టెజన్‌ను నిత్యం తీసుకుంటే ముప్పు మరింతగా ఎక్కువగా ఉన్నట్లు వెల్లడైంది. హార్మోన్ థెరపీని ఎంత ఎక్కువ కాలం తీసుకుంటే ముప్పు అంతగా పెరుగుతున్నట్లు ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ పరిశోధకుల్లో ఒకరైన గిలియన్ రీవ్స్ పేర్కొన్నారు.



## పీఎంవో నుంచి వైదొలగిన నృపేంద్ర మిశ్రా

ఈనాడు, దిల్లీ: ప్రధానమంత్రి ముఖ్య కార్యదర్శి నృపేంద్ర మిశ్రా శుక్రవారం ఆ బాధ్యతల నుంచి వైదొలిగారు. 2014లో మోదీ బాధ్యతలు చేపట్టిన నాటినుంచీ పీఎంఓలో ప్రధాని ముఖ్యకార్యదర్శిగా ఉన్న ఆయన ఆ బాధ్యతల నుంచి వైదొలగడానికి అవకాశం ఇవ్వాల్సిందిగా ఇదివరకే అభ్యర్థించారు. ప్రధాని సూచనల మేరకు రెండువారాల పాటు ఆయన తాత్కాలికంగా కొనసాగుతారు. ఈ నేపథ్యంలో ఇటీవలే కేబినెట్ కార్యదర్శిగా పదవీవిరమణ చేసిన పీకే సిన్హాను పీఎంఓలో 'ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ'(ఓఎస్డీ)గా నియమించారు. అత్యుత్తమ అధికారుల్లో నృపేంద్రమిశ్రా ఒకరని ప్రధాని ట్వీట్ చేశారు. 2014లో తాను దిల్లీకి వచ్చినప్పుడు అంతా కొత్తగా ఉండేదని, దిల్లీలోని పరిపాలన వ్యవహారాల గురించి పూర్తి అవగాహన ఉన్న నృపేంద్ర మిశ్రా తనకు ఎన్నో నేర్పించారని చెప్పారు. కాగా, పీఎంఓలోకి శుక్రవారం అయిదుగురు ఉన్నతాధికారులను తీసుకున్నారు.

# స్వదేశీయులా? విదేశీయులా?

- అసోంలో 29.5 లక్షల మంది భవిష్యత్తు తేలేది నేడే
- ఎన్ఆర్‌సీ తుది జాబితా విడుదలకు రంగం సిద్ధం

గువాహటి: అసోంలో అంతా ప్రశాంతంగా ఉన్నట్టు కనిపిస్తున్నా, ఎందరిలోనో ఏదో తెలియని ఆందోళన.. భారతీయులుగానే ఉంటామా? విదేశీయులమన్న ముద్ర పడుతుందా? అన్న సంశయం వారిని నిద్ర పట్టనీయడం లేదు. 71 ఏళ్లుగా నలుగుతున్న జాతీయ పౌర పట్టిక (ఎన్ఆర్‌సీ) తుది జాబితా శనివారం విడుదల కానుండడమే ఇందుకు కారణం. స్వాతంత్ర్యానంతరం పొరుగున ఉన్న బంగ్లాదేశ్ నుంచి పెద్దఎత్తున హిందువులు, ముస్లింలు ఇక్కడికి వలస వచ్చి స్థిరపడడం వివాదంగా మారింది. ఈ సమస్యను పరిష్కరించడానికి ఎన్ఆర్‌సీ రూపకల్పనే మార్గమని భావించి 1951లోనే తొలి జాబితాను వెలువరించారు. తర్వాత దాంట్లో మార్పులు చేర్పులు చోటు చేసుకోలేదు. తాజా వివరాలతో జాబితా రూపొందించాలని 2005లోనే నిర్ణయించినా ప్రక్రియను ప్రారంభించేందుకు 9 ఏళ్లు పట్టింది. చివరకు సుప్రీంకోర్టు పర్యవేక్షణలో 2018 జులై 30న తుది ముసాయిదా ప్రకటించారు. అపీళ్ల కోసం డిసెంబరు 31వరకు గడువిచ్చారు. పరిశీలన అనంతరం తుది జాబితా సిద్ధమయింది. జాబితాలో పేరు లేకుంటే ఆధార్ కార్డు ఇవ్వబోమని అధికారులు ప్రకటించడంతో సంక్షేమ పథకాలు అందుతాయా, లేదా అని ప్రజలు భయపడుతున్నారు. అర్హుల పేర్లు తొలగించారని, అనర్హులవి చేర్చారని వివిధ రాజకీయ పార్టీలు విమర్శిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో భూమిపుత్రుల్లాంటి బోడో తెగ గిరిజనుల పేర్లు లేకపోవడం వారిలో ఆగ్రహం కలిగిస్తోంది. ఇలాంటి సమస్యలు పరిష్కరించడానికి ప్రస్తుతం 100 ట్రైబ్యునళ్లు పనిచేస్తుండగా, సోమవారం నుంచి మరో 200 ఏర్పాటు కానున్నాయి. రాష్ట్రంలో ప్రస్తుతానికి పరిస్థితి ప్రశాంతంగా ఉన్నా కేంద్ర ప్రభుత్వం ముందుజాగ్రత్తగా 51 కంపెనీల పారామిలటరీ దళాలను పంపించింది. ఇప్పటికే 167 కంపెనీల సీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్, ఐటీబీపీ దళాలతో పాటు, రాష్ట్ర పోలీసులు, గ్రామ రక్షణ బృందాలు విధులు నిర్వర్తిస్తున్నాయి.

**ఎవరెవరు ఎంత మంది?**

- 3.29 కోట్లు — ఎన్ఆర్‌సీలో నమోదుకు దరఖాస్తుదారుల సంఖ్య
- 2.89 కోట్లు — చోటు దక్కిన వారి సంఖ్య
- 41 లక్షలు — పేర్లు లేని వారు
- 29.5 లక్షలు — నమోదుకు అపీలు చేసిన వారు

## ఈ రేడియో ఇంట్రెస్ట్ గురూ!



హిమాచల్‌ప్రదేశ్: ఈ రేడియోలో పాఠాలు వినొచ్చు.. ఎంచక్కా సంగీతాన్ని ఆస్వాదించొచ్చు.. కొంగొత్త సంగతులు తెలుసుకోవచ్చు.. ఇంకేముంది? విద్యార్థులకు కొత్తగా అనిపించింది. ముచ్చటపడి శ్రోతలుగా మారిపోతున్నారు. ఈ క్యాంపస్ రేడియో పేరు హలో మోగినంద్. 7 నెలల కిందట నహన్‌లోని ప్రభుత్వ పాఠశాలలో ప్రారంభమైంది. ఇప్పుడు 7 వేల మంది శ్రోతలను సంపాదించుకుంది. విదేశాల్లోనూ ఆదరణ లభిస్తోంది. శ్రోతల సంఖ్య పెరగడంతో పాఠశాల నిర్వాహకుల్లో నూతనోత్సాహం వెల్లివిరుస్తోంది. సెప్టెంబర్ 12 తర్వాత 5 కొత్త కార్యక్రమాలు ప్రసారం చేసేందుకు కూడా సిద్ధమవుతున్నారు. బడులకు రాలేని పిల్లల కోసమని ప్రారంభించిన ఈ రేడియోను ఇప్పుడు కొత్తపుంతలు తొక్కిస్తున్నారు.

## శునకాల పెళ్లికి ఊళ్లో హడావుడి!

ఉత్తర్‌ప్రదేశ్: అక్కడో పెళ్లి జరిగింది.. 500 మంది హాజరయ్యారు.. ఘనంగా రిసెప్షన్ కూడా చేశారు.. ఇందులో విశేషమేముంది అనుకోవద్దు. 'పుర్రెకో బుద్ధి' చందంగా ఆ ఊళ్లో రెండు శునకాలకు పెళ్లి చేశారు మరి. ఊరంతా చందాలు పోగేసుకుని మరీ ఈ పెళ్లి జరిపించారు. ప్రయాగ్‌రాజ్‌లోని మహూన్లీ గ్రామం ఇందుకు వేదికైంది. శునకాలకు సంప్రదాయ దుస్తులు కూడా వేశారు. మేళతాళాలతో ఊరేగించారు. ఈ పెళ్లి దృశ్యాలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి.



## వెళ్లాలన్నా.. రావాలన్నా.. తెప్పే గతి



కర్ణాటక: అభివృద్ధికి దిక్కులేని హోలేక్కుడికే గ్రామానిది కన్నీటి గాథ. ఊరిలో ఆసుపత్రి లేదు.. ఊరు దాటాలంటే రోడ్డూ లేదు.. చుట్టూ నీళ్లే. చిక్‌మంగళూరు మూడీగెరే దగ్గర్లోని ఈ పల్లెను చేరుకోవాలంటే భద్ర నదిని దాటాలి. తెప్పలే రవాణా సాధనాలు. ఆ గ్రామస్థుడొకరు బయట ఆసుపత్రిలో చనిపోతే అతని బంధువులంతా మృతదేహాన్ని తెప్పలోనే తీసుకొచ్చారు. నిత్యం పడుతున్న ఈ అవస్థలను ఇకనైనా ప్రభుత్వం గుర్తించాలన్నది గ్రామస్థుల విన్నపం

ఈటీవీ భారత్
యాప్ స్టోర్ & గూగుల్ ప్లే ద్వారా డౌన్‌లోడ్ చేసుకోండి

## హోటళ్ల సిబ్బంది ఉపాధికి దెబ్బ!

జమ్మూ-కశ్మీర్: ఆంక్షలు కొనసాగుతున్న కశ్మీర్ లోయలో హోటళ్ల సిబ్బంది ఉపాధిపైనా తీవ్ర ప్రభావం కనిపిస్తోంది. పర్యాటక రంగం కళావిహీనం కావడం; పర్యాటకులు, బసచేసేవారి సంఖ్య తగ్గిపోవడంతో హోటళ్లన్నీ నష్టాల బాటలో నడుస్తున్నాయి. ఇక చేసేది లేక కొందరు యజమానులు తమ సిబ్బందికి సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి విధులకు రావొద్దని చెబుతున్నారు. పరిస్థితి కుదుటపడ్డాక విధుల్లోకి తీసుకుంటామని కొందరు నచ్చజెప్పి పంపించేస్తున్నారు. తమ కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఎదురవుతోందని సిబ్బంది ఆవేదన చెందుతున్నారు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Private Limited, and printed at Eenadu Press, Alugunoor, Karimnagar - 505 527, Telangana. Cell: 99590 21802, 99590 21803 RNI No. 52793/92, Regd. No. G/RN/KAR/48/2018-20 Eenadu, Karimnagar. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10.00